# శ్రీరామానుజ సుధామాధురి

శ్రీమతి సముద్రాల శారద

మొదటి భాగం



శ్రీసన్నిధానం సమర్పణ

సమర్పణ



# శ్రీరామానుజ సుధామాధురి



శ్రీమతి సముద్రాల శారద

శ్రీసన్నిధానం

గ్రంథమాల

© శ్రీసన్నిధానం చారిటబుల్ ట్రస్ట్

ప్రతులకు:
శ్రీసన్నిధానం

ఇం. నెం. 10-2-225, విద్యానగర్,
కరీంనగర్, తెలంగాణ -505001
Phone No 95025 83323

శ్రీమతి సముద్రాల శారద

కరీంనగర్, తెలంగాణ.
**Phone No** 9618190716

వెల: అమూల్యము

# మా మాట

శ్రీసన్నిధానం చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న తొలిగ్రంథం మొదటి సంపుటి ఇది. ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే ఈ గ్రంథం 20 వ్యాసాల సమాహారం. ఇవి ఒక్కొక్కటి ఆణిముత్యం లాంటివి. కడు రమ్యంగా శ్రీమతి సముద్రాల శారదగారు ఆవిష్కరించారు. శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురిస్తున్న వ్యాసపరంపరలో గత సంవత్సరం జనవరి 2022 నుంచి జూలై 2023 వరకు వచ్చిన సంచికలలో ప్రచురించినవి. శ్రీభగవత్‌రామానుజులవారి జీవితంలో అమూల్యఘట్టాలను కూర్చి సమర్పిస్తున్న మాల ఇది. శ్రీరామానుజ వాణిని అందించాలన్న ఆశయంతో శ్రీసన్నిధానం "సారస్వత ఆరాధనోత్సవమ్ 2023" పురస్కరించుకుని ఈ గ్రంథ ప్రచురణను, ఆవిష్కరణను చేపట్టింది. మారుతున్న జీవన విధానంలో, సనాతన భారతీయ సంస్కృతిని పరిరక్షించడానికి శ్రీరామానుజులవారి జీవితచరిత్ర ఎంతగానో ఉపయోగపడుతుందనడంలో అతిశయోక్తిలేదు. శ్రీమతి సముద్రాల శారద గారి కలంనుంచి వెలువడుతున్న జగదాచార్యుల చరిత్ర వైభవం దశదిశలా వ్యాపించాలని మేము భావిస్తున్నాము. గ్రంథాన్ని చదివి దివ్యరసానుభూతిని మీరూ అనుభవిస్తారని ఆశిస్తున్నాము.

-ఊంగరి లక్ష్మీనారాయణా చార్యులు

శ్రీరామాయ నమః
శ్రీమతే రామానుజాయ నమః

## -: అభినందనలు :-

'శ్రీ సన్నిధానం' ఆధ్యాత్మిక మాస పత్రిక ప్రారంభించి పదేళ్ళు కావస్తున్నది. పత్రిక యొక్క వార్షికోత్సవం సందర్భంగా 'శ్రీరామానుజ సుధా మాధురి' అనే ప్రత్యేక సంచికను వెలువరిస్తున్నది. ఈ పత్రిక యొక్క ఆశయం ఆధునిక సమాజంలో ఆధ్యాత్మిక బీజాలను నాటి సమాజ శ్రేయస్సుకై కృషి చేయటం, భగవత్-భాగవత-ఆచార్య సేవల యొక్క పరమార్థాన్ని లోకానికి చాటి చెప్పడం. అందుకే పత్రిక ఆవిర్భవించిన నాటి నుంచి పత్రికలో ధారావాహికగా ప్రచురింపబడిన 'రామానుజ సుధా మాధురి'ని ప్రత్యేక సంచికగా వెలువరించే ప్రయత్నం.

ఆధ్యాత్మిక జగతిలో భగవద్రామానుజాచార్యులు కేవలం ఆధ్యాత్మిక ప్రవర్తకులుగానే కాక సంఘ సంస్కర్తలుగా కూడా కీర్తి పొందారు. సుమారు వెయ్యేళ్ళకు ముందు అప్పటి సమాజంలో వేళ్ళూనుకున్న అసమానతలను పెకలించి, సమ సమాజ స్థాపనకై వారు చేసిన ప్రయత్నం వారి ఔన్నత్యాన్ని మనకు చాటుతుంది.

"బ్రహ్మమొకటే... పరబ్రహ్మమొకటే..
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే
చండాలుడుండేటి సరిభూమి యొకటే" అని

ఎలుగెత్తి లోకానికి చాటిన అన్నమాచార్యులు భగవద్రామానుజుల భావజాలానికి ప్రభావితుడైనవాడే. అందుకే

'ఏకులజుడేమి ఎవ్వడైన నేమి
ఆకడ నాతడే హరినెరిగినవాడు' అంటూ మరొక

కీర్తనలో హరిభక్తుడు ఏకులజుడైనా వందనీయుడే అని శ్రీరామానుజుల భావాన్ని అనువదించాడు.



తనకు భగవద్ రామానుజులపై గల భక్తిని –

"కమలన్ని అలమైన కేవలంగనుండును
గతి ఈతడే చూపే ఘన గురు దైవము
ఈతని వలనే కా ఇల వైష్ణవులమైతి
మతన్ని వలనే కంటిమి తిరుమలి
ఈతడే ఉపదేశమిచ్చెను అష్టాక్షరి మంత్రము
ఈతడే రామానుజుడు ఇహ పర దైవము" అంటూ,

"యస్య దేవే పరా భక్తిః యథా దేవే తథా గురౌ" అన్న ఉపనిషద్ సూక్తిని పరిపూర్ణ తిరుక్కోష్టియూర్ నంబిగారితో ఆర్తిగల వారి-దరికి అష్టాక్షరి మంత్రాన్ని ఉపదేశించిన కృపామాత్ర ప్రసన్నాచా-ర్యుడైన రామానుజులను 'ఘన గురు దైవము' ~~అంటూ~~ అంటూ ప్రశంసించాడు.

వేద సారమైన సేవయే జీవితపరమార్థమని చాటిన మహనీయులు రామానుజులు. 'భగవంతుని సేవ గొప్పది. అంతకన్నా భక్తుల సేవ గొప్పది. దానికన్నా గురువును సేవించటం మరింత గొప్ప' అని భగవద్భాగవత ఆచార్య సేవయే ముక్తి మార్గమని, అదియే ముక్తియని బోధించిన వారు రామానుజులు.

సనాతన ధర్మాన్ని అనుసరించి బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్య-శూద్ర వర్ణములు, బ్రహ్మచర్య-గార్హస్థ్య-వానప్రస్థ-సన్న్యాస ఆశ్రమములూ ఉన్నాయి. వైదిక శ్రద్ధ కలవారు ఈ ధర్మాలను అనుసరించవలసిందే. కానీ, వైష్ణవ ధర్మంలో ఈ వర్ణాశ్రమ ధర్మాలను భగవద్భాగవత ఆచార్య సేవగా భావించి అనుష్ఠించాలని బోధించిన వారు రామానుజులు. క్షత్రియులు అనగా, బ్రాహ్మణులు వర్ణాన్ని బట్టి 'శర్మ' గాను, క్షత్రియులు 'వర్మ' గాను, వైశ్యులు 'శ్రేష్ఠి' గాను, శూద్రులు 'దాసు' గాను పిలవబడతారు. శ్రీ రామానుజుల వారు వైష్ణవ

-స్తోంలోని వారందరూ తమను 'దాసులు'గానే భావించు-
-కోవాలని ఉపదేశించారు.

'ఏ పురాణముల యందు వెతకినా
శ్రీ రామానుజుల వెదకన్నెదురు' అని అన్నమాచార్యు-
-లవారు కూడా ఏ వర్ణ సృష్టైనా ఉదరు 'రామానుజ'ని అంటారు.


భగవద్రామానుజుల జ్ఞానానుష్ఠానములు విలక్షణమైనవి. ఆయన దృష్టి కూడా విలక్షణమైనది. సార్వకాలికమైన, సార్వ-జనీనమైన విశాల దృక్పథంతో విశిష్టాద్వైత సిద్ధాన్తాన్ని, శ్రీవై-ష్ణవ సంప్రదాయాన్ని లోకంలో ప్రవర్తింపజేసి జ్ఞాన తృష్ణులకు లోకంలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించిన రామానుజ ది-వాకరుడు చూపించిన మార్గం అనుసరణీయమైనది.

రామానుజుడు అందించిన 'సుధా'-ఎంతో అత్యం-త మధురమైనది కావున 'రామానుజ సుధా మాధురి' ఒక పేరుతో వారి బోధనలను, వారి వైభవాన్ని పాఠకు-లకు ధారావాహికగా అందించిన తిరుమల సప్తగిరి వారికి నా అభినందనములు.

జగదాచార్యులగు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారు సమతామూర్తిని జగతికి ఆవిష్కరించిన సందర్భంగా - శ్రీ సన్నిధానం పత్రిక ద్వారా సమతామూర్తి రామానుజుల వైభవాన్ని 'రామానుజ సుధా-మాధురి' ఒక పేరుతో ధారావాహికను [illegible] 2020, నిర్వహిస్తున్న సందర్భంగా ప్రత్యేక సంచికను వెలువరిస్తున్న వారికి భక్తుల తరపున శ్రీ వైష్ణవుల తరపున సకల శుభాలను ప్రసాదించాలని ప్రార్థిస్తూ....

కె. ఇ. స్థలశాయి, స్థానాచార్యులు
శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం
భద్రాచలం

శ్రీమతే రామానుజాయ నమః



# మధురాస్వాదన

పరమవైదిక తత్వాన్ని లోకానికి చాటిచెప్పి సకల జీవుల సముద్ధరణ కోసం పాటుపడిన జగదాచార్యులు. భగవద్రామానుజాచార్యులు ఈ లోకంలో అవతరించి సహస్రాబ్ది దాటింది. వారు చేసిన మహోపకారాన్ని స్మరించుకొని లోకమంతా వెయ్యేళ్ల పండుగ అత్యంత వైభవంగా జరుపుకున్నది. ఈ సందర్భంగా జగదాచార్యుల దివ్య సన్నిధిలో తమ వంతు కైంకర్యంగా విదుషీమణి శ్రీమతి సముద్రాల శారదమ్మగారు సమర్పించుకున్న వ్యాసపరంపర “శ్రీరామానుజ సుధా మాధురి”

భగవద్రామానుజుల దివ్య జీవిత వైభవం లోని కథా మాధురిని ఉపదేశ సుధా మాధురిని పదిమందితో పంచుకోవాలనే సత్సంకల్పంతో ఆవిష్కరింపబడిన భావతరంగిణి ఇది.

భగవద్ రామానుజుల అవతార వైభవం మొదలుకొని అవతారం చాలించి అర్చామూర్తులుగా సాక్షాత్కరించిన చారిత్రిక ఘట్టాలను కథలు, కథలుగా విప్పి చెప్పి వారి సౌందర్య సౌశీల్య వాత్సల్యాది కళ్యాణ గుణ వైభవాన్ని అత్యంత మధురంగా అందించారు. పరమాత్మకు ప్రపంచానికి మధ్యగల అవినాభావ సంబంధం శరీర ఆత్మ సంబంధమని ఉపనిషత్తులు ఉద్ఘోషిస్తున్న విషయాన్ని భగవద్రామానుజులు సప్రమాణంగా సిద్ధాంతీకరించిన విధానాన్ని వివరిస్తూ శ్రీమతి శారదమ్మగారు విశ్వజనీనమైన వసుధైక కుటుంబ భావనకు మార్గదర్శకులు భగవద్రామానుజులని స్పష్ట పరచారు. సమాజ హితం కోసం జగదాచార్యులు చూపిన మార్గమే మన జీవన సుపథం కావాలని

ఉద్ఘోషించారు.

శ్రీ వైకుంఠ లోక మణి మంటపమార్గదాయి అయిన భగవద్రామానుజార్య సంబంధమే మోక్షకందమని శ్రీరామానుజ అనే నాలుగు అక్షరాలు మాత్రమే ఉజ్జీవన హేతువని వివరించారు.

యతిరాజుల దివ్య జీవిత వైభవాన్ని వారి శ్రీ సూక్తి మధురిమను సంఖ్యా సమన్వయం చేసిన విధానం అత్యంత ప్రతిభావంతంగా పరిశోధనాత్మకంగా కొనసాగింది. ఇది భగవద్రామానుజ దర్శన సారాన్ని చవిచూపింది.


ఇలా భగవద్రామానుజుల వైభవాన్ని వారు దర్శించి లోకానికి అందించిన ఉపనిషత్ తత్వాన్ని వారి సుగంభీరమైన శ్రీ సూక్తి లోని మాధుర్యాన్ని రసవత్తరంగా ఆవిష్కరించిన సముద్రాల శారదమ్మగారి వ్యాస పరంపర భగవద్రామానుజ సుధామాధురి సహృదయుల హృదయాలను తన్మయం చేస్తుందనడంలో సందేహం లేదు. వారు అందించిన మధురిమలను ఆస్వాదిస్తూ అభినందన పూర్వక ఆశీస్సులను అందిస్తున్నాము.

భాగవత విధేయుడు

**శిరిశినహళ్ వెంకటాచార్య, హైదరాబాదు**

ఫోన్ నెంబర్: 9908868075

# జీవనమార్గదీపిక



మహానుభావుల జీవిత చరిత్రలు మనకు చక్కని మార్గదర్శకాలు. మన జీవనయానాన్ని యుక్తమైన రీతిలో గడపడానికి సరి అయిన మార్గాలను అవి మనకు బోధిస్తాయి. వారి చరిత్రలో మనకు గోచరించే సంఘటనలు, సన్నివేశాలు అన్నీ కూడా మనకు గొప్ప కరదీపికలుగా భావించదగినవి. వాటిని సరి అయిన దృష్టిలో అర్థం చేసుకొని, మన జీవితంలో సమన్వయించుకొనగలిగితే, మన జీవనయానం ఫలప్రదంగా సాగుతుంది అనడంలో సందేహం లేదు.

అటువంటి మహానుభావులలో భగవద్రామానుజులవారు ఒకరు. వారు ఒక సిద్ధాంతాన్ని, సంప్రదాయాన్ని ప్రవర్తింపచేసినవారే కాక, మహనీయమైన మార్గంలో తమ జీవితాన్ని సాగించినవారు. వారు ఒక మానవతావాది, సంఘసంస్కర్త, సమతావాది, కరుణాసముద్రులు, సర్వమానవ సంక్షేమంకోసం సదా పాటుపడిన పుణ్యమూర్తి. ఈ విధంగా వారి చరిత్రను మనం పలు దృక్కోణాలలో దర్శించి సమన్వయించుకోవచ్చు. వారి పవిత్ర చరిత్రలో మనకు దర్శనమిచ్చే వృత్తాంతాలను సరి అయిన దృష్టిలో విమర్శించి, వాటిని మన జీవితంలో అన్వయించుకుంటే, మన జీవితం సుఖమయం అవుతుంది అనడం పరమ సత్యం.

శ్రీమతి సముద్రాల శారదగారు శ్రీరామానుజసుధామాధురి (మొదటి భాగం) అనే గ్రంథంలో భగవద్రామానుజుల జీవిత చరిత్రలోని ఎన్నో సంఘటనలను ప్రస్తావిస్తూ, వాటిలో కనిపించే అపూర్వమైన తత్త్వాలను వివరించారు. ఇందులో మొత్తం 20 వ్యాసాలు ఉన్నాయి. ఇవి అన్నీ


భగవద్రామానుజ చరిత్రలోని అవశ్యం గమనించదగిన వృత్తాంతాలను చక్కని విమర్శనాత్మకమైన దృష్టిలో అందిస్తున్నాయి. ఈ వ్యాసాలను అన్నిటినీ శ్రీమతి శారదగారు విమర్శనాత్మక దృష్టిలోనే కాక, కమనీయమైన శైలిలో రచించడంవల్ల ఇది సంప్రదాయ పాఠకులనే కాక, సాహిత్య రసికులను కూడా రంజింప చేస్తుంది అనడంలో ఏ సందేహం లేదు. ఈ గ్రంథం శ్రీసన్నిధానం మాసపత్రికల ద్వారా ముద్రింపబడడం ఇంకొక విశేషం. వీరిని నేను మనఃపూర్వకంగా అభినందిస్తూ, ఈ విధంగానే అనంతర భాగాలను కూడా వీరు త్వరలో వెలయించాలని కోరుకుంటున్నాను వీరికి దానికి కావలసిన శక్తియుక్తులను ప్రసాదించవలసినదిగా నా ఆరాధ్య దైవం శ్రీనివాసప్రభువును వేడుకుంటున్నాను. స్వస్తి.

సహృదయ విధేయుడు,

**ఈ. ఏ. శింగరాచార్యులు**

శ్రీమతే రామానుజాయ నమః

# భగవద్ రామానుజో విజయతే యతి రాజరాజః



రామానుజులు మానవ లోకాన్ని సంసార సాగరాన్నించి పైకి లేవనెత్తడానికి అవతరించిన మహానుభావులు. వారు జన్మించే నాటికి ప్రచ్ఛన్న బౌద్ధులు, మాయావాదులు, వేద వాదులుగా వేషాలు వేసుకున్న ఇతరులు చెలరేగిపోతూ ఉన్నారు. వేద ప్రమాణంగానే బ్రహ్మను అంగీకరించుతూనే ఆయనకు రూపము లేదు గుణము లేదు అని అన్నారు. "అసత్యాత్ సత్య ప్రతిపత్తిః" అని వాదించే వారు అయినారు. అదేమని అంటే నిర్గుణ సగుణ బ్రహ్మలు రెండు అని అంటూ నిర్గుణ బ్రహ్మ పరముడు అని వితండ వాదాలు చేశారు. "అంతశ్శాక్తం బహిశ్శైవం సభామధ్యే తు వైష్ణవం" అన్నట్లు పలు పోకడలు పోతూనే ఉన్నారు. వారు స్థిర నిశ్చయానికి రాలేకపోతూ ప్రజలకు సరిదారిని చూపలేక పోయినారు. జనులు మాత్రము వీరి గడబిడలు ఎట్లున్నా తమ పెద్దలు పోయిన బాటలో ముందుకు సాగుతూ ఏదో ఒక దైవాన్ని నమ్మి ఆ ప్రకారము ప్రజలను తమ ఇష్టానికి అనుగుణంగా అధికార దండాన్ని ఉపయోగించి తమ వైపు మళ్లించుకోవడానికి ప్రయత్నించినారు. ఇటువంటి దుఃఖ స్థితిలో "శ్రీమద్రామానుజాఖ్యం మునిమఖిల జనోద్ధారణా యావతీర్ణం" అన్నట్లు శేషరూపధారియై నిత్య కైంకర్యమును చేసుకొనే భాగ్యాన్ని వదులుకొని ఇక్కడికి దిగి వచ్చినాడు. "యత్ ముహూర్తం క్షణంవాపి వాసుదేవో న చింత్యతే సహానిః తన్మహచ్ఛిద్రం సా భ్రాంతిః సా చ విక్రియా" అన్నట్లు పరమాత్మ యొక్క ఆంతరంగిక కైంకర్య దారిద్ర్యానికి తలవంచుతూ, అర్చామూర్తి ఆరాధనతో తన ఆర్తిని తీర్చుకుంటూ, కన్నతల్లి వలె పామర జనులను కరుణార్ద్ర దృష్టితో

ఉజ్జీవింపజేస్తూ 120 ఏండ్లు జీవించినారు. భగవద్విముఖులను తమ వాదనా పటిమతో పరాజితులను చేస్తూ కాస్తో కాస్తో వివేకం ఉన్న విద్వాంసులను భగవన్ మంగళాశాసన పరులనుగా, భాగవతులనుగా తీర్చిదిద్దినారు. వారి జన్మలకు ధన్యతను చేకూర్చినారు. దేశమంతా సంచరించుతూ గరుడధ్వజుని ముక్తి ప్రదత్వాన్ని చాటుతూ "నచేత్ రామానుజేత్యేషా చతురా చతురక్షరీ కామవస్థాం ప్రపద్యంతే జంతవో హంత మాదృశః" అనిపించుకున్నారు. కావుననే "సత్యం సత్యం పునస్సత్యం యతిరాజో జగద్గురుః" అనినారు లోకులు.

ఇటువంటి లోకోత్తర పురుషుడిని గురించి ఎవరు ఏమి రాసినా బాల వాక్కుల వలె మధురంగా, భోగ్యంగానే ఉంటుంది. "మధురాధిపతే రఖిలం మధురం" అన్నట్టు రామానుజ మంత్రస్మరణ, ఉచ్చారణ లేఖనములతో మీ వ్యాసములు బాగున్నవి. అందుకు మీకు అభినందనలు. అక్కడక్కడ గల పునరుక్తులు, అతిశయోక్తులు, విశేషణాల కూర్పులు శ్రీరామానుజ పద స్మరణతో మంగళప్రదం అగుగాక అని రామానుజ దాసుడు కోరుకుంటున్నాడు.

జయ రామానుజ

భాగవత దాసుడు


**కండ్లకుంట వెంకటనర్సింహాచార్యులు**

హైదరాబాదు

జై శ్రీమన్నారాయణ

పుణ్యాంభోజవికాసాయ పాపధ్వాంతక్షయాయచ

శ్రీమానావిరభూద్భూమౌ రామానుజదివాకరః




భాగవతోత్తములారా !

పరమకారుణికుడైన శ్రియఃపతి శ్రీమన్నారాయణుడు సృజించిన సమస్త ప్రాణికోటిలో మానవుడు గొప్ప జీవి. కేవలం అది భగవంతుని నిర్హేతుక కృప మాత్రమే కారణం. అలాంటి మానవుడు తన కర్తవ్యాన్ని ధర్మాన్ని మరచిననాడు సంభవామి యుగే యుగే అని గీతాచార్యుడు చెప్పినట్లుగా స్వయంగా తానే అవతరించిన అవతారములు. ఇవి రెండు మానవుడు తరించటానికి ఎంతో ఉపయోగకరమైన అవతారములు మరియు పూర్ణావతారములుగా చెప్పవచ్చు. అనేకమైన ఉపదేశముల ద్వారా కృష్ణావతారము, ఆచరణద్వారా రామావతారములు. ఆబాలగోపాలం అనునిత్యం నిత్యనూతనంగా వెలుగొందుతున్న గొప్ప గీతికలుగా చూస్తునే ఉన్నాం. కేవలం ఇతర ప్రాణుల వలెకాక పరోపకారార్థం ఇదం శరీరం అనే తత్వాన్ని తెలుపుతాయి. అందుకే రామాయణ భాగవతాలు మానవుని శక్తిని యుక్తిని శారీరకముగా మరియు మానసికముగా చివరిగా మానవుని లక్ష్యముగా చెప్పే మోక్షాన్ని ఇచ్చేవిగా చరిత్రలో నిలిచాయి. ఆచంద్రార్కము ఇవి నిలుస్తాయి. ఇలాంటి మహోన్నతుల చరిత్రలు ఎన్నో ఉన్నా ముఖ్యముగా భగవద్రామానుజ చరిత్రకూడా ఒక అద్భుతమైన దివ్య చరిత్ర అని చెప్పటంలో సందేహములేదు. ఇవి కేవలము ఏ ఒక్కరికో లేక ఒక దేశానికి కాక ఒకవర్గానికో కాకుండా అందరూ తెలుసుకోవలసినది రామానుజ వైభవం. దానిని తాము అనుభవించి. రామానుజ సుధామాధురి అనే శీర్షిక ద్వారా శ్రీమతి శారదగారు రామానుజ వైభవంలోని కొన్ని జ్ఞానగుళికలతో మంచి సందేషాన్ని శ్రీసన్నిధానం పత్రికా ముఖంగా అందిస్తున్నారు. తమ విద్యలతో పాటుగా ఇలాంటి మహనీయుల చరిత్ర చదవటం ఆచరించటం ఈ నాటి సమాజానికి ముఖ్యంగా యువతకు చాలా ఉపయోగం అని కోరుతూ..

జైశ్రీమన్నారాయణ

**కలకుంట్ల వరప్రసాదాచార్యులు, వేదభవవనం, కరీంనగర్**



శ్రీమతే రామానుజాయ నమః

# అభిప్రాయం - ఆశీర్వచనం

శ్రీమతి సముద్రాల శారద రచనలో శ్రీసన్నిధానం సమర్పణలో వచ్చిన శ్రీరామానుజ సుధా మాధురి మొదటి భాగం చూశాను. ప్రయత్నం గొప్పది. అస్మదాదులను ఆకట్టుకుంటుంది ఈ సంచికలో మొత్తం 20 వ్యాసాల రూపంలో భగవద్ రామానుజుల సంపూర్ణ జీవితాన్ని జీవితకాలంలో వారొనర్చిన అతిమానుష చేష్టలను వివరించారు. అట్లే రామానుజ వెయ్యేండ్ల వైభవం మనసులో నిలిచేట్టుగా ఉన్నాయి. అయితే రామానుజ చరిత్ర బాగా తెలిసిన వారికి ఎలా ఉన్నా మొట్టమొదటిసారి చదివే వాళ్లకు చరిత్రను ఎంతో బాగా వివరించేట్టు ఉన్నాయి. "నారాయణ" అను నాలుగక్షరాలు ఎంతో "రామానుజ" అంతే! అందుకే మన జీయర్ స్వాముల నామాల్లో అందరికీ నారాయణ రామానుజ అను రెండు పదాలు వస్తాయి. ఈ చతురక్షరి మంత్రం మహిమ ఎంతో గొప్పది. ఎల్లకాలము ఉంటుంది.

**డా. కోయిల్ కందాడై వెంకట సుందరాచార్యులు**

రఘునాథ దేశిక పురస్కార గ్రహీత

(మనస్విని ప్రచురణలు )

# వినయాంజలి

యథార్థ జ్ఞానాన్ని పరమార్థాన్ని తెలియజెప్పే ఆధ్యాత్మిక సారస్వతం సమాజ శ్రేయస్సుకు మూలమైనది. పరమ ఋషులు మనకు అందించిన వేద సంస్కృతిని అనుభవ యోగ్యంగా ఆచరణీయంగా సిద్ధాంతీకరించి సకల జనహితంగా ఉపదేశించిన వేద మార్గ ప్రవర్తకులు జగదాచార్యులు. "దధి చిలికినకొద్దీ మాధుర్యం పొంగినట్టు" భగవద్రామానుజాచార్యుల చరిత్ర వైభవం, రామానుజ మార్గము అనే రెండు విశిష్టాంశాలను పెద్దల శ్రీసూక్తుల ఆధారంగా మననం చేసుకునే అక్షర కైంకర్యమే శ్రీరామానుజ సుధామాధురి.

సంప్రదాయ సేవా లక్ష్యంగా ప్రారంభింపబడిన శ్రీసన్నిధానం పత్రిక వేదికగా అస్మదాచార్యుల శరణాగతి భావనగా ఈ శీర్షిక సాగుతున్నది. ఆశీర్వాణి నందించిన భాగవతోత్తములకు అనేక దాసోహములు, ఆదరిస్తున్న పాఠకులకు, ప్రోత్సహించే పెద్దలకు, పత్రికా నిర్వాహకులకు నమస్కారాంజలి సమర్పించు కుంటున్నాను.

**శ్రీమతి సముద్రాల శారద**

# విషయసూచిక


| | |
|---|---|
| 1. కైంకర్యేచ్ఛ | 1 |
| 2. కలిమి నిచ్చే కల్పతరువు | 3 |
| 3. వేనోళ్ల స్తుతించే వెయ్యేళ్ళ పండుగ | 6 |
| 4. వసుధైక కుటుంబకం | 9 |
| 5. ఉత్తారకం- కృపాసముద్రం | 12 |
| 6. సంఖ్యాసమన్వయం - యతిరాజవైభవం | 16 |
| 7. దర్శన భాగ్యం- సౌభాగ్యం, సేవాఫలం- సాఫల్యం | 21 |
| 8. బాల సూర్యుని భావ స్ఫూర్తి | 24 |
| 9. సహస్ర సంజీవిని | 28 |
| 10.దర్శనం - నిదర్శనం | 31 |
| 11. సంబంధం బంధమోచనం | 35 |
| 12. పావన పాదం ప్రయాణ విజయం | 39 |
| 13. వాత్సల్యం వరదాయకం | 43 |
| 14. భక్తి భావ ప్రీతి –దివ్య ప్రబంధ ఖ్యాతి | 47 |
| 15. శరీరశుద్ధి - జ్ఞానసిద్ధి | 50 |
| 16. విరోధి పరిహరణ | 53 |
| 17. ఆనందము మోక్షకందము రామానుజార్య సంబంధము | 56 |
| 18. శిష్య వాత్సల్య నిధి అమృత జలధి | 59 |
| 19. సామర్థ్యం నామ సార్థక్యం | 62 |
| 20. వార్షిక వ్యాస సమీక్ష | 67 |

# కైంకర్యేచ్ఛ

భగవంతునికి ప్రపంచానికి గల సంబంధాన్ని వేదోక్త రీతిన హేతుబద్ధతతో నిరూపించి జగత్తు మాయ అనే స్థితిని మరల్చి భగవద్గుణ మాధుర్యమును అనుభవింపజేసిన మహర్షులు భగవద్రామానుజాచార్యులు. భారతీయ సంస్కృతికి మూలమైన వైదిక ధర్మానికి, అనేక సాంప్రదాయాలకు శ్రీ రామానుజ మార్గం ఆధారమైనదని విశ్లేషకులు చెప్తారు. ఆధునిక పోకడల వలన, ప్రపంచీకరణ ప్రభావము వలన ప్రలోభ పడి జీవన విధానాలు మారిపోతున్నాయి. అయినప్పటికీ శుభదాయకమైన పారమార్థిక లక్ష్యం కలిగిన, సమాజ హితం సమృద్ధిగా కలిగించగలిగిన విధి విధానం శ్రీ రామానుజ మార్గం లోనే ఉంది. సుదీర్ఘమైన భగవద్రామానుజాచార్యుల చరిత్ర వైభవంలోని కథ మాధురిని, ఉపదేశ సుధా మాధురిని శ్రీసన్నిధానం పత్రిక పాఠకులతో పంచుకోవాలని సత్సంకల్పంతో శ్రీరామానుజ సుధామాధురి అక్షర రూపం దాల్చింది. సర్వత్ర జగదాచార్యుల సహస్రాబ్ది సంతోషాలు ఆరాధనలు వెల్లి విరుస్తున్న వేళ జగదాచార్యుల కైంకర్యేచ్ఛతో శ్రీరామానుజ సుధా మాధురి ప్రారంభించబడింది.

సమతామూర్తి శ్రీ రామానుజాచార్య కీర్తి సాటిలేనిది. వారి సహృదయం హృదయ సౌకుమార్యం వారి సూక్తుల్లో ప్రతిబింబిస్తుంది. వారు శిష్యులకు ఉపదేశించిన సూక్తి సుధామాధురి సాంప్రదాయ సంస్కరణలను గావించింది. వారి జీవన మార్గ సరళిని పరిశీలిస్తే అతి సామాన్య జనులకు కూడ సకలైశ్వర్య ప్రాప్తి కలిగించుటకు వారు చేసిన కృషి మనకు గోచరిస్తుంది. పరమభక్తితో మనను మోకరిల్లేలా చేస్తుంది.

జ్ఞానవంతులైన పండితులను, భక్తి ప్రపూర్ణులైన పామరులను, శరణాగతి మార్గంగా ప్రపత్తిచేయు ప్రపన్నులను, భావోద్వేగం గల సామాన్యులను గుర్తించారు. అన్ని రకముల వారు తరించే మార్గాన్ని సూచించారు. అందరూ

శ్రీ[శియఃపతుల పాదారవింద సేవలో తరించే సాం[ప్రదాయాన్ని స్థాపించారు. "సమ్యక్ శా[స్త్ర జ్ఞానమునకు హేతువు భక్తి మా[త్రమే" అని నిరూపించారు. అందుకే సాం[ప్రదాయ సిద్ధాంత జ్ఞానం శా[స్త్రజ్ఞానం ఎంత కలిగి ఉన్నప్పటికీ "యస్య దేవే పరాభక్తిః యథా దైవే తథా గురౌ" అని [శుతివాక్య [ప్రమాణంగా భగవద్భక్తిని ఆచార్య భక్తిని ఉపదేశించారు. భగవత్ భాగవత ఆచార్య కైంకర్య నిష్ఠ నిజమైన దీక్ష అని శిష్యులకు ఆదేశించారు. శ్రీ రామానుజ తాత్విక సుధ ఉభయ తారకం అనుటలో సందేహం లేదు. భగవత్తత్వ సౌందర్యాన్ని కళ్యాణ గుణాలను తెలిపి, భగవత్ [ప్రాప్తి మార్గాచరణను సూచించారు. శరణాగతి మార్గమే రక్షక మని గద్య[త్రయంలో [ప్రత్యక్షీ భూతం చేశారు. దైవీ గుణసంపదలో [ప్రధానమైన పరోపకార శీలతను ఉపదేశం చేశారు. వారి చరి[త్రను అధ్యయనం చేస్తే ఆ 'శ్రీరామానుజ సుధామాధురి' మన జన్మను, హృదయాన్ని, చింతనను, [ప్రవర్తనను, అన్నింటినీ సంస్కరిస్తుంది. పారమార్థిక జీవన మార్గం వైపు మనను మరలుస్తుంది. సకలజీవరాశులను, [స్త్రీలను, పామరులను, సామాన్యులను, వ[క్రమార్గ గాములను శ్రీరామానుజాచార్యులు ఉద్ధరించిన వైనం పరిశీలిస్తే జగదాచార్యుల శరణాగతిలో శ్రీరామానుజ సుధామాధురిలో మనం పునీతం అవుతాము! సకల ఐశ్వర్య వంతులము అవుతాము.

శ్రీ రామానుజ సహ[స్రాబ్ది సమారోహ సమీప శుభ సమయంలో జగదాచార్యుల కైంకర్యముగా శ్రీ శ్రీనివాస స్వరూపులైన శ్రీశ్రీశ్రీ చిన్న రామానుజ జీయర్ స్వామి వారి వాక్సుధా మార్గ అనుసరణలో మనం సంసిద్ధం కావటం మరింత సంపన్న దాయకం!

జగదాచార్యులైన భగవత్ రామానుజాచార్యుల సిద్ధాంత మార్గదర్శనంగా [ప్రతి సంచిక యందు వారి దివ్య కథా వైభవాలను, శ్రీరామానుజ సహ[స్రాబ్ది వైభవాలను మనం సేవించుకుందాము.

శ్రీరామానుజార్య దివ్యాజ్ఞా! వర్ధతాం అభివర్ధతాం!!

# కలిమి నిచ్చే కల్పతరువు

కలిమి లేములు జంటపదాలు జీవిత అనుభవాలు. కలిమి అంటే సంపద. కడగండ్ల నుంచి మనను కడదేర్చగలిగేదే నిజమైన కలిమి. సకల దుఃఖాలనుంచి మనను ఉపశమింపజేసేది భగవదనుగ్రహం అనే కలిమి మాత్రమే! అదే ఒక గొప్ప ఆస్తిక భావన. అటువంటి సంపదను ప్రతి ఒక్కరికి లభింప చేయడానికి తానై అవతరించిన వారు జగదాచార్యులు. మనను ఉజ్జీవింప చేసే ఆచరణ విధిని, సాంప్రదాయ నిధిని మనకు అందించారు. అంతులేని వేద వాఙ్మయ సారాన్ని అందుకోగలిగే ఔషధ గుళికలా అందించారు. విభువయిన జగత్కారణ తత్వాన్ని సులభంగా ఆరాధించే మార్గాన్ని సూచించారు. భగవంతుణ్ణి పొందగలిగే యోగ్యత అందరికీ ఉంటుందని తెలియపరిచారు. అందుకే వారు జగదాచార్యులయినారు. భగవద్ రామానుజాచార్యులు ఉదయించి సహస్రాబ్ది దాటే వరకు వారి కీర్తి, దయా స్ఫూర్తి సహస్ర ముఖాలుగా విస్తరించింది. వారి సూక్తి సుధ సర్వత్రా ప్రసరిస్తున్నది. ఆ సాంప్రదాయ ధార మనకు కలిమి నిచ్చే కల్పతరువు. శతాధిక సంవత్సరకాలం వారు తిరుమేనితో సంచరిస్తూ, అతి సామాన్యుల వరకూ అందరూ ఉద్ధరింపబడడానికే కృషి చేశారు. దేశకాల పరిస్థితులకు అనుగుణంగా కొంచెం కఠినంగా ఉండే ఆచారాలను లోకహితం కోసం సంస్కరించారు. అనుష్ఠానాలను సుగమం చేశారు. తాను మంత్రోపదేశం పొందడానికి ఆచార్యుల వద్దకు సహనంతో 18సార్లు తిరిగి వారి మనసును కరిగించి ఉపదేశం పొందారు. మరి ఇంకెవరూ అలా కష్టపడకుండా ఉండేవిధంగా ఎంతోమంది ఆచార్యులను తయారుచేసి తర్వాతి తరాల వారికి అనుగ్రహించారు. తమ ఆచార్యులను కూడా ఔదార్యగుణంతో మెప్పించారు. శ్రీరామానుజాచార్యులకు ఉపదేశం చేసిన ఐదుగురు ఆచార్యులు కూడా మొదట సందేహించి తర్వాత వారి లోకోపకారబుద్ధికి ఆశ్చర్యచకితులయినారు. తమ కుమారులను వారికి శిష్యులుగా

సమర్పించుకున్నారు. పాషాణ హృదయాలను కూడా ద్రవీభూతం చేసిన ప్రతిభాపాటవాలు గలవారు జగదాచార్యులు. వేదాగమశాస్త్రాలను, భగవద్గీతను, రామాయణ భారత ఇతిహాసాలను, క్షుణ్ణంగా తన మేధస్సుతో మథించారు. అవి దేశ కాల కుల మత నియంత్రణ భేదాలు లేకుండా లోకహితాన్ని కలిగిస్తాయని నిరూపించారు. సకల మానవాళికి ఉజ్జీవనాన్ని కలిగించే మన వైదిక సంస్కృతిని ప్రకాశవంతం చేశారు. విశిష్టాద్వైత సిద్ధాంతం అంటే వేదార్థం బోధించే ఒక శాఖగా కాకుండా, లోకోపకారకమైన ఒక జీవన విధానంగా ఏర్పరచి ఆసంప్రదాయాన్ని మనకందించారు.

భగవంతుడంటే కళ్యాణ గుణశీలుడైన జగత్కారకుడు. పరస్పర సహకారంతో బ్రతికే విధిని సూచించే గుణం కలవాడు జీవుడు. సదా మనం కాపాడుకో గల ఆవశ్యకత కలిగినది ప్రకృతి. చిత్ అచిత్ ఈశ్వర తత్త్వాన్ని నిరూపించే సిద్ధాంతాన్ని ప్రబోధించారు. అంటే సమస్తము భగవత్ శరీరంగా గుర్తించి ప్రకృతి చేతనుడు కూడా పరమాత్మ శరీరమని శరీర శరీరి సంబంధాన్ని నిరూపించారు. అందుకే శ్రీరామానుజ సిద్ధాంతం వసుధైక కుటుంబం అనే భావన కలిగినది. బ్రహ్మసూత్రాలకు వీరు అనుగ్రహించిన శ్రీభాష్యం, గీతాభాష్యం, మరియు వీరు ప్రవచించిన శ్రీసూక్తులు దేశ,కాల, వర్గ భేదాలు లేక శుభాలను చేకూర్చేవని కీర్తించబడుతున్నాయి. సమాజానికి సర్వహితాలను గూర్చి సంక్షేమాన్ని ప్రసాదించే సంస్కృతి క్షేత్రాలు దేవాలయాలు. కష్టం వచ్చినా, విపత్తు కలిగినా మనోధైర్యాన్ని ఐక్యత స్ఫూర్తిని ప్రసాదించేవి దేవాలయాలు. విద్య వివేకం ధార్మిక ఆచరణ దైవ అనుగ్రహం అన్నీ లభించే స్థానం దేవాలయం మాత్రమే. అటువంటి దేవాలయ వ్యవస్థను జగదాచార్యులు పటిష్ఠపరిచారు. భగవత్ శక్తి తేజరిల్లే విధంగా ఆరాధనా విధివిధానాలను ఆగమోక్తంగా సంస్కరించారు. "వైదిక సంస్కృతి గల జీవన విధానం సమ సమాజ జీవన గతికి విఘాతం కాదు" అని నిరూపించిన సమతామూర్తి శ్రీ భగవద్ రామానుజాచార్యులవారు. అందుకే

"పుణ్యాంభోజ వికాసాయ పాప ధ్వాన్త క్షయాయ చ

శ్రీమానా విరభూద్భూమౌ రామానుజ దివాకరః" (పుణ్యమనే పద్మాన్ని వికసింప చేయటానికి, పాపం అనే చీకట్లను పోగొట్టడానికి శ్రీమద్ రామానుజాచార్యులు అను సూర్యుడు ఈ భూమిపైన ఉదయించాడు) అని లోకహితైషుల చేత స్తుతింపబడ్డారు. అందుకే లోక కళ్యాణానికై దివ్య సాకేతమందు ఆచరించ తలపెట్టిన వైదిక క్రతువు ఆస్తికుల సేవలతో సంపన్న వంతమవుతుంది. అపర రామానుజులు శ్రీ శ్రీనివాస స్వరూపులైన శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి కరకమలములచేత ఆవిష్కరింపబడు సమతామూర్తి విరాట్ స్వరూపం సమాజ శ్రేయస్సుకు కృషి చేసే స్ఫూర్తిని అందరిలో కలిగిస్తుంది.

# వేనోళ్ల స్తుతించే వెయ్యేళ్ళ పండుగ

"వేనోళ్ల స్తుతించే వెయ్యేళ్ళ పండుగ. వెయ్యి కాంతుల ఉపదేశ సుధలు కురిసేను దండిగా" సహస్రాబ్ది స్ఫూర్తి శ్రీవైష్ణవ దీప్తి నలుదిశలా విస్తరించిన పర్వదినాలు ఇవి. "హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం" అని కీర్తించే శ్రీ మహాలక్ష్మీ స్వరూపం సువర్ణం. బంగారం అంటే శ్రేష్టమైనది,విలువైనది కరుణా మూర్తి అయిన జగన్మాత స్వరూపం, అటువంటి సువర్ణ మూర్తిగా జగదాచార్యులు అవతరించారు. కారుణ్యం మూర్తిభవించిన జగదాచార్యుల సువర్ణ స్వరూపం ఆవిష్కరింపబడింది. విభు స్వరూపం అంటే జగత్ ప్రభువైన శ్రియః పతి రూపమే ఆ విధంగా మానవ సాధ్యమైన విరాణ్ మూర్తిగా సమతా మూర్తి ఆవిష్కరింపబడింది. జగదాచార్యుల విగ్రహమూర్తులలో గొప్ప మహత్వం ఉన్నది. ఆచార్యులు అవతరించక ముందే "కలౌ కశ్చిత్ భవిష్యతి" అని భగవచ్ఛాస్త్రంలో చెప్పబడిందట! పూర్వాచార్యులు ఆళ్వార్లు అయిన శ్రీ నమ్మాళ్వార్ చేత శ్రీ రామానుజాచార్యుల భవిష్యత్ ఆచార్య విగ్రహమూర్తి శిష్యులకు ప్రసాదించ బడింది. శ్రీ రామానుజాచార్యులు శ్రీపెరంబూదూర్‌లో తానే శిష్యులపై ప్రీతితో అర్చామూర్తిని ప్రతిష్ఠించారు ఆమూర్తిని "తానుహంద తిరుమేని" అని కీర్తిస్తారు. తిరునారాయణ పురంలో తన విశ్లేషణ సహించలేని శిష్యుల కోసం "తమరుహంద తిరుమేని" అని కీర్తించబడుతున్న అర్చా విగ్రహాన్ని స్వయంగా జగదాచార్యులే ఏర్పాటు చేశారు. మరొక అద్భుతాశ్చర్యాలలో ముంచే దివ్య తిరుమూర్తి శ్రీరంగంలో ఉంది. "శరణాగతి" ప్రపత్తి చేసిన శ్రీ రామానుజాచార్యులను "శ్రీరంగే సుఖ మాస్వ" అని శ్రీరంగనాథుడు ఆజ్ఞాపించగా అక్కడే తన దివ్య నిజ తిరుమేనితో వెలిశారు. ఆ మూర్తి "తానాన తిరుమేని" గా కీర్తించబడుతున్నది. ఈ విధంగా జగదాచార్యుల విగ్రహ మూర్తులు గొప్ప మహత్తును కలిగి ఉంటాయి.

ఆ విధంగానే శ్రీ శ్రీనివాస స్వరూపులైన శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారి సంకల్ప స్వరూప మూర్తిగా దివ్యసాకేత ప్రదేశంలో జగదాచార్యులు

ప్రతిష్ఠించబడ్డారు. జగదాచార్యులు సహస్రఫణి భూషితులైన ఆదిశేషులు కనుకనే పంచ త్రింశతి సహస్ర కుండాత్మక (1035 కుండాలతో) హవనారాధనలతో ప్రతిష్ఠాత్మకంగా విరాట్, సువర్ణ మూర్తులుగా సమతామూర్తి ప్రతిష్ఠించబడ్డారు. ఈ స్ఫూర్తి నుండే శ్రీ రామానుజాచార్యుల చరిత్ర వైభవం, వారి శ్రీసూక్తి సుధామాధురి ప్రతి ఒక్కరినీ ఉజ్జీవింపచేస్తుంది.

"సమాజహితం సమతా అభ్యుదయం జగదాచార్యుల పథం అదే జన జీవన సుపథం!" వారి దివ్య జీవన మార్గం నాలుగు దివ్య దేశాల పుణ్యక్షేత్రాల స్ఫూర్తితో సాగినట్లుగా చరిత్ర వైభవం తెలుపుతుంది. అవి:- శ్రీకంచి, శ్రీరంగం, తిరుమల, తిరు నారాయణపురం. వారి జీవిత కథ ననుసరించి ఆయా పెరుమాళ్ళతో పిత్రు, ఆచార్య, శిష్య, పుత్ర సంబంధం కలిగి ఉన్నట్లుగా పెద్దలు సమన్వయిస్తారు.

శ్రీపెరంబుదూర్‌లో అవతరించిన శ్రీ భగవద్ రామానుజాచార్యులు శ్రీకంచికి చేరుకొని అనేక అనుభవాలతో అక్కడి పెరుమాళ్ళ ఆజ్ఞతో శ్రీ సిద్ధాంత వర్తనులై సన్యసించారు.

పూర్వాచార్యుల ఆజ్ఞతో శ్రీ రంగనాథ ఆహ్వానంతో దేవ పెరుమాళ్ళ సన్నిధి శ్రీకంచి వదిలి శ్రీరంగానికి విచ్చేశారు. ఆ విధంగా శ్రీకంచి త్యాగ మంటపంగా కీర్తించబడింది.

శ్రీరంగ పెరుమాళ్ల ఆజ్ఞతో అక్కడే నివాసం చేశారు పంచాచార్యుల చేత ఉపదేశం పొందారు. ఎందరినో ఉద్ధరించి శిష్యులుగా చేర్చుకున్నారు. ఎన్నో దివ్య దేశాలను సంస్కరించారు. ఉభయ వేదాంత సారమైన శ్రీ సిద్ధాంతాన్ని ప్రవర్తింప చేశారు. ఈ విధంగా శ్రీరంగం భోగ మండపం గా కీర్తించబడింది.

శ్రీ తిరుమల నంబి గారి వద్ద శ్రీ రామాయణాన్ని అధ్యయనం చేశారు తిరుమలకు వేంచేసిన శ్రీరామానుజాచార్యులు శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్‌లను శ్రీనివాస స్వరూపంగా నిరూపించి ఆరాధన సాంప్రదాయాలను ఏర్పాటు చేశారు. తిరుమల వైభవాన్ని సుసంపన్నం చేశారు. శ్రీనివాస పెరుమాళ్లకు శంఖచక్రాలను ధరింపజేసి ఆచార్య స్థానంలో నిలిచారు. అక్కడ భగవదారాధనకు పుష్ప కైంకర్యానికి

అనంతాళ్వార్లు అను శిష్యులను ఏర్పాటు చేశారు. ఆ విధంగా తిరుమల పుష్ప మండపంగా స్తుతించబడింది.

పరిస్థితులకు అనుగుణంగా శ్రీరామానుజాచార్యులు సుదీర్ఘ కాలం తిరునారాయణపురంలో నివాసం చేశారు. అక్కడి క్షేత్ర పెరుమాళ్ల వైభవాన్ని పునః స్థాపించారు. శ్రీభాష్య, గీతాభాష్యాది నవరత్నాల అనబడు సిద్ధాంత వాఙ్మయాన్ని అనుగ్రహించారు. ఢిల్లీ సుల్తానుల వద్దనుండి సంపత్కుమార పెరుమాళ్లను తిరునారాయణపురానికి తీసుకొని వచ్చారు. ఎంతో మంది శిష్యులకు సిద్ధాంత జ్ఞాన బోధనలు గావించారు ఆ విధంగా తిరునారాయణపురం జ్ఞానమంటపంగా స్తుతించబడింది.

అందుకే శ్రీ రామానుజ సహస్రాబ్ది సమారోహ హవన కార్యక్రమంలో ఈ నాలుగు మంటపాలను ఏర్పాటు చేశారు. "శ్రీరామానుజ" అన్న దివ్యనామ సంబంధముగలది. ఏదైనా మనకు రక్షక మైనదే! వారి చరిత్ర వైభవమైనా, తిరుమూర్తి దర్శనమైనా, ఉపదేశ శ్రీసూక్తులయినా, ఆదర్శమైన ఆచరణ అయినా " శ్రీ రామానుజ సుధా మాధురి" మృతసంజీవిని అయి ఆనందాన్ని, మాధుర్యాన్ని ప్రసాదిస్తుంది.

# వసుధైక కుటుంబకం

మండే సూర్యుడు జీవ కిరణ మాధురితో జగతి జీవరాశులు అన్నింటినీ చైతన్యవంతం చేస్తాడు. అపౌరుషేయం అయిన వేద వాఙ్మయం కూడా సమస్త జగత్తును పరిరక్షిస్తుంది. ఆ వేదసార మగు సూక్తులతో ఆచార్యుడు అందరి జీవన గతిని సంస్కరిస్తాడు.. ఎవరు ఏ మార్గంలో భగవంతుని పొందినా, ఎవరు ఏ రూపంలో పూజించినా, భగవత్ తత్వాన్ని వ్యాఖ్యానించినా అది వారి దృక్ పరిమితికి అందినంత మాత్రమే అవుతుంది. కానీ వైదిక సారభూతమైన భగవత్ నిరూపణము మాత్రమే సంపూర్ణమైనది. భగవత్ శరీరంగా భావింపబడు సమస్త జగత్తును రక్షించేది వైదిక ధర్మం. అట్లే వర్ణ ఆశ్రమ కుల సంప్రదాయ ధర్మాచరణలు ఎన్నో ఉన్నాయి. వేదోపబృంహణాలు గానే స్మృతి, శాస్త్ర పురాణాలు మనకు ధర్మాన్ని తెలియ జేస్తాయి. అయినా భగవంతుణ్ని జాతి కుల బేధం లేకుండా ప్రపత్తి మార్గంలో సేవించవచ్చు. భగవంతుని పొందడంలో అందరూ యోగ్యులే! ఇది ప్రబోధించే మార్గమే మన రామానుజ దర్శనం "వసుధైక కుటుంబకం" అనే విశ్వజనీనమైన భావనను బలపరిచే సిద్ధాంతం జగదాచార్యుల ఆచరణా సుపథం! భగవద్ రామానుజాచార్య జీవన గతిలో ఒడిదుడుకులను సరిచేసుకొని సమాజాన్ని ఉజ్జీవింప చేసిన తీరు చాలా గొప్పది." ఉదార చరితానాంతు వసుధైవ కుటుంబకం" అన్నట్లుగా వారి ఔదార్యం సాటిలేనిది. సమాజ ధర్మాలు నశిస్తున్న రోజుల్లో, వేదార్థాలకు కుదృష్టి సోకిన రోజుల్లో అవతరించారు జగదాచార్యులు. ఆ చీకట్లను చీల్చుతూ ఉదయించిన జ్ఞాన సూర్యుడు రామానుజ దివాకరుడు. ఆ సమయంలో వారు లేకపోతే ఎలా ఉండేదో మన పెద్దలు ఇలా స్తుతిస్తారు.

" నా చేత్ రామానుజే త్యేషా చతురా చతురక్షరీ
కామావస్థాం ప్రపద్యంతే జంతవో హంత మాదృశః"

అనగా "రామానుజ" అను ఈ సులభ మయిన నాలుగక్షరాలే లేకపోతే ఎలాంటి అజ్ఞానపు స్థితిని పొంది ఉండే వారిమో కదా అని భావం మృత విపత్తులు దరి చేరే

సమయంలో సామాజిక ధర్మాలను తిరిగి ఉజ్జీవింప చేశాయి శ్రీ రామానుజ సూక్తి సుధలు. జగదాచార్యులు ఉపదేశించిన ఈ జీవన విధిలో ఆధిపత్యాల ఆక్షేపణ విధానాలే ఉన్నాయి. అందరినీ ఉద్ధరించే ఆచరణలే ఉన్నాయి. అందరికీ దేవాలయ ప్రవేశాలను ఆదేశించారు. దేవాలయ వ్యవస్థను పటిష్ఠం చేశారు. పాలకులను సమన్వయం చేశారు. ప్రజలందరినీ సంఘటితం చేశారు సంప్రదాయ విద్రోహుల చేత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్త్రీలను ఆదరించారు. లౌకిక ఆచరణలలో సర్వ హిత సంస్కరణలు చేశారు. లోకోపకార జ్ఞాన జనకమైన వారి బోధనలకు ఎంతో మంది శిష్యులు ఆకర్షితులయ్యారు. వారి దివ్యమంగళ స్వరూపం చూసి వారి సూక్తి సుధామాధురికి ముగ్ధులు అయినారు. ఆచార్య కైంకర్య మందు ప్రీతి కలిగి భగవద్భక్తి పరాయణులై నారు. శ్రీరామానుజాచార్యుల బోధనలకు సాత్వికులు భగవద్ అభిముఖులై నారు. భగవత్ వ్యతిరిక్తులు కూడా ఆచార్య అభిముఖులైనారు. శ్రీ రామానుజాచార్యుల శిష్యులు ఆచార్య ఆజ్ఞతో పూర్వాచార్యుల, ఆళ్వారుల దివ్య ప్రబంధ సారాన్ని ఆకళించుకుని ఎన్నో సాంప్రదాయ గ్రంథాలను రచించారు.వారు మేధస్సును మథించి గురు భక్తిని రంగరించి, భగవత్ శరణాగతి మార్గం తెలిపే ఉభయ వేదాంత సార వాఙ్మయాన్ని మనకందించారు.

శ్రీ రామానుజాచార్య చరిత్ర వైభవాన్ని పరిశీలిస్తే వారి ఔన్నత్యం మనకు కనిపిస్తుంది. “అందరు జనులకు ఉపకారం కలిగించేదే ఉత్తమ సంస్కృతి” అని చాటి చెప్పారు. ఆసేతు హిమాచల పర్యంతం పర్యటించారు వారి దివ్య పార్థివదేహం ఉన్నంతవరకు జగత్ కళ్యాణానికి కృషిచేశారు. దేహానికి హద్దు కాలానికి పరిమితి ఉన్నా, వారి ఆకాంక్ష, ఆశంసనం మానవులు ఉజ్జీవించడమే. అందుకే “సత్యం సత్యం పునః సత్యం యతి రాజో జగద్గురుః। స యేవ సర్వలోకానాం ఉద్ధర్తా నాస్తి సంశయః॥” అని వేనోళ్ళ స్తుతింపబడుతున్నారు. నాడు ప్రపన్న జనకూటస్థులుగా ప్రసిద్ధులైన శ్రీ నమ్మాళ్వార్‌లు లోకోద్ధరణకు జగదాచార్యులు అవతరించక ముందే వారి భవిష్యత్ ఆచార్య మూర్తిని దివ్య రూపురేఖలతో సంకల్ప సృష్టి చేసి తదనంతర ఆచార్యులకు అందించారు. నేడు

జనులందరినీ ప్రపన్నులుగా ప్రవర్తింప చేసే మన ఆచార్యులు శ్రీనివాస స్వరూపులైన శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారు “సమతా మూర్తి సహస్రాబ్ది సమారోహం” పేరు తో భవిష్యత్ తరాల వారికోసం ఈ భవిష్యత్ ఆచార్యుల దివ్య మంగళ (సువర్ణ అర్చా, విరాట్ ఆచార్య) మూర్తులను లోకార్పణం గావించారు. ఇది మనందరి భాగ్యం! లోకోత్తరం! తదుపరి శ్రీరామానుజ కథామాధురిని ఆస్వాదిస్తూ సేవించుకుందాము.

అలనాటి రామానుజాచార్యుల వైభవాన్ని నేటి శ్రీనివాస స్వరూపులైన మన చిన్న జీయర్ స్వామి వారి వైభవాన్ని వర్ణించడం ఎవరికి సాధ్యం? అది దివిటీతో దినకరుని చూపించటం వంటిదే! అందుకే శ్రీరామానుజ సుధా మాధురి అనే దీపజ్యోతి తో ఆరాధించుకుందాము.

# ఉత్తారకం - కృపాసముద్రం

మానవ జీవన గతిలో లక్ష్యం, శాశ్వత గమ్యం గురించి మన భారతీయ తత్వం చాలా గొప్పగా చెప్తుంది. దీర్ఘ దృష్టి లేని లక్ష్యాలు సంకుచితమే అవుతాయి. అనగా దూరదృష్టి లేనప్పుడు మనం సాధించే ఫలం తాత్కాలికమే అవుతుంది. ఏది ఏమైనా ఇహ పర ఐశ్వర్య ప్రాప్తి ప్రతి చేతనుడూ పొందవలసినది, కోరుకునేది కూడా! అలా కృతకృత్యుడు కావాలంటే ఒక విధి ఆచరణ కావాలి. దాని యొక్క ఆవశ్యకత తెలియాలి. ఆ సాధనలో ఆసక్తి కలగాలి. ఇటువంటి అస్పష్టమైన క్లిష్ట మార్గాలన్నింటికీ ఒకే సమాధానం మన సంస్కృతిలో లభిస్తుంది. అదే "ఆచార్య ఆశ్రయణం" లేదా గురువును ఆశ్రయించటం. అంటే... ఆ శ్రీ సూక్తులను ఆకళించుకుని అనుసరించి వారి సిద్ధాంతాన్ని అవగాహన చేసుకోవడం. అందుకు మన సాంప్రదాయం లో రెండు ప్రధాన మార్గాలను మన పెద్దలు దృఢంగా నిర్మించి పెట్టారు. అవి 1) "ఎమ్బెరుమానార్ దర్శనం" అనే శ్రీ రామానుజ మార్గం! 2) "ఆచార్య సమాశ్రయణం" అనబడే చక్రాంకిత ఉపదేశ మార్గం. దాన్ని పంచ సంస్కారాలు అని కూడా అంటారు. ఈ రామానుజమార్గంలో ఎటు పయనించాలి, ఎలా వెళ్లాలి, ఏం చేయాలి అనే అనేక ప్రశ్నలకు తావు ఉండదు. ప్రశ్న ఉదయించక ముందే స్పష్టమైన సమాధానం కనిపిస్తుంది. ఆ విధంగా మనను ఉద్ధరించి చేతనులందరిని "ఉత్తారకం" చేయగలిగిన వారు శ్రీరామానుజాచార్యులు ఒక్కరే! అని మన పూర్వాచార్యులు పెద్దలు ధ్రువీకరించారు. ఆచార్యత్వాన్ని మన పెద్దలు రెండు రకాలుగా చెప్తారు.

1) ఉత్తారకాచార్యత్వము, 2) ఉపకార కాచార్యత్వము. ఉత్తారకము అంటే తాముగా శిష్యులను తరింప చేయుట, ఉద్ధరించుట అనగా పంచసంస్కార యుతంగా ఉపదేశించు వారిని ఉత్తారకా చార్యులు అంటారు. ఉపకారకులు అంటే తరింపచేయు ఆచార్యులతో సంబంధము కలిగించినవారు. మరియు భగవత్

సంబంధ ఉపదేశ సూక్తులను మనకు అనుగ్రహించువారు.

ఉత్తారకము చేయువారు అంటే ఉభయ ఐశ్వర్యములు ప్రసాదించువారు ఉదయ ఐశ్వర్యములు ప్రసాదించాలంటే ఉభయ విభూతి అధికారము ఉండవలసిందే!

అట్టి ఉభయ విభూతి నాయకులు "ఉడయవర్లు". సర్వజగత్తుకు నియామకుడు, కర్త, భర్త, త్రాత, సంహర్త అయినా ఆ భగవంతుడు కూడా ఉత్తారకుడే!

ఉత్తారకుడు అంటే మొదట స్వరూప జ్ఞానం కలిగించాలి.

భగవద్రామానుజాచార్యులు భగవత్ స్వరూప, ఆత్మస్వరూప, ప్రకృతి స్వరూపాన్ని తెలియపరిచారు. దారి మళ్ళించే వేద భాష్యాల నుండి కుదృష్టుల నుండి భగవత్స్వరూప జ్ఞానాన్ని రక్షించారు. శూన్య భావం నుండి కళ్యాణ గుణశీలునిగా పరమాత్మను దర్శింప చేశారు. వేదాంత గత భగవత్ తత్వాన్ని ప్రకాశింప చేశారు. కథా వైభవాల ద్వారా భగవంతునికి ఆచార్య స్థానీయులుగా నిలిచి జగదుద్ధారకులై జగద్గురువులు అయినారు. అందుకే ఎందరో జ్ఞానులు "గురురేవ పరబ్రహ్మ గురురేవ పరం ధనం గురురేవ పరా విద్యా గురురేవ పరాగతిః యస్మాత్తదుపదేష్టాసౌ తస్మాత్ గురుతరో గురుః" అని భావించి ఉత్తారకులైన జగదాచార్యులను ఆశ్రయించారు..

అవతారాత్ పూర్వం శ్రియఃపతిచే ఉభయ విభూతి నాయకత్వం పొందారు. యతిరాజుగా పెరియపెరుమాళ్ ఆజ్ఞతో ఉభయ విభూతి అధికారం స్వీకరించారు అని చరిత్ర వైభవం. పంచ నంబుల ద్వారా తాను పొందిన ఉపదేశ శ్రీ సూక్తులను, శ్రీ వైష్ణవశ్రీ వైభవాన్ని సమభావంతో అందరినీ ఉద్ధరించడానికి ఉపయోగించారు అందుకే వారు ఉత్తారకులయ్యారు. ప్రపన్నజన కూటస్థులయిన శ్రీ నమ్మాళ్వార్లు భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రులు. వారికి ఉభయ విభూతి అధికారము ఉన్నది. అయినా వారు లీలా విభూతిలో తక్కువ కాలం వేంచేసి ఉన్నారు. నిత్య విరాగులై

భక్తిరస పూర్ణులై వారు జీవించారు. ఉత్తారకాచార్యులు ఉద్భవిస్తారని, ముందే సంకల్పించారు. భవ్య రూపురేఖలతో భవిష్యత్ ఆచార్య మూర్తిని ఉల్లేఖింపచేశారు. అందువల్ల జగదాచార్యులే ఉత్తారకాచార్యులయినారు.

శ్రీ పెరియ వాచ్చాన్ పిళ్ళై పుత్రులు శ్రీ నాయనా రాచ్చాన్ పిళ్ళై వారు సకల లోకాన్ని ఉద్ధరించడానికి "చరమోపాయ నిర్ణయం"అనే గ్రంథాన్ని రచించి ఆచార్య తత్వ రహస్యాన్ని వెల్లడించారు. శ్రీ పెరియవాచ్చాన్‌పెళ్ళై ద్రావిడ వేదాంత రహస్యాలకు వేల వ్యాఖ్యానాలు అనుగ్రహించి "పెరియవాచ్చాన్" అని పేరుగాంచారు. అటువంటి తండ్రిగారిని ప్రార్థించి వారి అనుగ్రహంతో శ్రీ రామానుజాచార్య వైభవాన్ని తెలియజేసే చరమోపాయ నిష్ఠ అను రహస్యాన్ని మనకందించారు.

"అస్మదుత్తారకం వందే యతి రాజం జగద్గురుమ్ యత్ కృపా ప్రేరితః కూర్మి చరమోపాయ నిర్ణయం" అనగా అందరికీ ఉత్తారకాచార్యులైన జగద్గురువులు అయిన శ్రీభగవద్ రామానుజాచార్య కృపతో "చరమో పాయ నిర్ణయం " అని ఈ గ్రంథాన్ని రచిస్తూ నమస్కరిస్తున్నాను అని భావం.

అనేక యదార్థ సన్నివేశాలతో జగదాచార్యులను ఉత్తారకాచార్యులుగా ఈ గ్రంథంలో నిరూపించారు.

గొప్ప జ్ఞానులైన యజ్ఞమూర్తి అనువారు సిద్ధాంత చర్చలో పరివర్తనులై శ్రీ రామానుజాచార్యులకు శిష్యులైనారు వారు "అరుళాళ పెరుమాళ్ ఎం బెరుమనార్" అను పేరును స్వీకరించారు. వారు యతి రాజుల నివాసానికి సమీపంలోనే ఉండేవారు ఎంతోమంది శిష్యులకు వారి చేత శ్రీ రామానుజాచార్యులు సమాశ్రయణాలు (చక్రాంకిత ఉపదేశాలు) చేయించారట అయినా వారు తమ శిష్యులకు ఉపదేశించి చివరన సర్వోత్తారకులైన రామానుజాచార్యులే అందరికీ ఆచార్యులు వారి చరణములే అందరికీ శరణములు అని ఉపదేశించే వారట!

స్వభావము చేత కూడా ఆచార్యులు రెండు రకాలు. 1) స్వానువృత్తి

ప్రసన్నాచార్యత్వము, 2) కృపా మాత్ర ప్రసన్నా చార్యత్వము. భగవత్ సంబంధ రహస్యాలు ఎంతో ఉత్కృష్టమైనవి. అజ్ఞానంతో తెలిసి తెలియక సామాన్యులు అపకారం చేయకూడదు కనుక స్వీకరించే వారికి యోగ్యత ఉంటేనే ఉపదేశించే వారు. వాటిని పొందగోరిన వారికి ఆసక్తి దీక్ష ఉంటేనే ఉపదేశిస్తారు స్వానువృత్తి ప్రసన్నాచార్యులు. భగత్ సంబంధ విషయాలు అమూల్యమైనవి. అవి సంసార తాపోపశమనాలు కూడా! అట్టి విషయాలయందు అజ్ఞానం చేత అవగాహన రాహిత్యంతో నిరాసక్తులై ఉండవచ్చును. కనుక ఆచార్యులు తల్లివలె వాత్సల్య పూరితులై తమ ఉపదేశ శ్రీ సూక్తుల చేత వారిని తరింప చేస్తారు. వారిని కృపా మాత్ర ప్రసన్నా చార్యులు అంటారు.

శ్రీరామానుజాచార్యుల వలన వారి ముందున్న ఆచార్యులూ తరించారు. సమకాలికులనూ తరింప చేశారు. భవిష్యత్తులోని వారి కోసం కూడా 74 పీఠాల ఆచార్య సింహాసనాధిపత్యాలు ఏర్పాటు చేశారు. వారందరిని కృపా మాత్ర ప్రసన్నార్యులుగా ఉండమని ఆదేశించారు. శ్రీ భగవద్ రామానుజాచార్యులు ఉత్తారకాచార్యులు, కృపాసముద్రులు.

# సంఖ్యాసమన్వయం - యతిరాజవైభవం

సృష్ట్యాది నుండి బీజాక్షరాలకు, సంఖ్యాప్రశస్తికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. గణితం, గణకం, గుణకం ఇవిలేని మానవ జీవితమే లేదు. ప్రాచీనశాస్త్రాలకైనా ఆధునిక సాంకేతికతకైనా సంఖ్యా విశ్లేషణనే అత్యంత ప్రధానమైనది. ప్రకృతిధర్మం కూడా నిశ్చితమైన గణితసూత్రం మూలంగానే నడుస్తుంది. భారతీయ మహర్షులు సంఖ్యానియతిని అనంతంచేసే శూన్యాన్ని అనగా పూర్ణబిందువు విలువను కనుగొని ప్రపంచానికి అందించారు. అదృష్టమైన, అలౌకికమైన విషయావగాహనకు శాస్త్రకారులు సంఖ్యలకూడిక, వ్యంజనం, గుణకం, విభజన ప్రక్రియలనే వాడతారు. ఈ విధంగా అన్నింటికీ మూలం అయిన సంఖ్యా సమన్వయంతో మనజగద్గురువులైన యతిరాజుల జీవనవైభవం ఎలాముడిపడి ఉందో తెలుసుకుందాము. "రామానుజ" అనే నాలుగు సమర్థవంతమైన అక్షరాల మంత్రము మానవ జీవనవిధానానికి మార్గదర్శకమైంది. ఆసేతు హిమాచల పర్యంతం భారతదేశ ఆధ్యాత్మిక మూలాలకు మూలసిద్ధాంతం అయింది అని పెద్దలమాట!

ఏకః:- అకారవాచ్యుడైన శ్రీమన్నారాయణుడు "ఏకోనారాయణ అని ఏకశబ్దంతో సంభావింపడతాడు." "ఏకోనారాయణః నద్వితీయోస్తికశ్చిత్" అనే సత్యాన్ని లోకానికి ఎరుకపరుస్తూ పరతత్వ నిర్ణయాన్ని శ్రీభగవద్రామానుజాచార్యులు చేశారు "అనంతజ్ఞానానంద్దైకస్వరూప!" అని గద్యత్రయంలో భగవంతుని కళ్యాణగుణాలను స్తుతించారు. జగత్కారణమైన పరతత్వము ఒకటేనని ఉభయ వేదాంతసారంగా నిరూపించారు. అట్లే భగవంతుని పొందుటకు మోక్షఉపాయము ఒక్కటే, భగవత్ప్రాప్తి సాధనము ప్రపత్తి మార్గం ఒక్కటే, అని నిరూపించారు. ఓం ఇతి ఏకాక్షరం బ్రహ్మ' అని నిరూపించి ఆచార్య రత్నమాలలో ఒకేప్రధానరత్నంగా శ్రీరామానుజాచార్యులు నిలిచారు.

ద్వయం:-రామానుజసిద్ధాంతంలో లక్ష్మీదేవి పురుషకారంగా భగవత్ప్రాప్తిని

పొందుట అనేది ప్రధానము అందుకే మహాలక్ష్మీ సమేతంగా పరమాత్ముని ఉపాసించడం అనే సాంప్రదాయం స్థిరం చేశారు. శ్రీరంగంలో ఒకపర్వదినంలో పెరియపెరుమాళ్, శ్రీరంగనాచ్చియార్ ఒకేశేర్తిపైన కొలువు తీరినఉత్సవంలో శ్రీరామానుజాచార్యులు గద్యత్రయాన్ని విన్నవించి శ్రీశ్రియఃపతులకు శరణాగతిచేశారు. మొదట లక్ష్మీగద్యంతో ప్రారంభించి ఒకగొప్ప సాంప్రదాయాన్ని నెలకొల్పారు.

ఆవిధంగా రామానుజసిద్ధాంతం శ్రీసిద్ధాంతంగా పేరుగాంచింది. ఉపదేశ శ్రీసూక్తిరచనల్లో "శ్రియఃపతియాయ్" అని ప్రారంభించే సంప్రదాయాన్ని నెలకొల్పారు. మరియు ద్వయమంత్ర ప్రాధాన్యం తెలిపి ప్రపన్నులకు అనుష్టాన విధిని విధించారు.

త్రయం:- శ్రీరామానుజాచార్యులు తత్త్వత్రయాన్ని వేదసారంగా ప్రతిపాదించి శరీర శరీరి సిద్ధాంతాన్నినిరూపించారు. చిత్తు, అచిత్తు ఈశ్వర తత్వాలను తెలిపారు. జడమైన ప్రకృతి, జ్ఞానస్వరూపుడైన ఆత్మ, సర్వజ్ఞుడు సర్వనియామకుడైన పరమాత్మ ఈ మూడుతత్వాలను విశ్లేషించారు. అట్లే రహస్య త్రయార్థములనుపదేశించి, అనుష్టానాన్ని విధించారు. ఆచార్య సమాశ్రయణం పురస్సరంగా మంత్రరాజ, ద్వయమంత్ర. భగవద్గీతాంతర్గత చరమశ్లోక అనుసంధానాన్ని తెలిపారు. ఆచార్యులైన ఆళవందారులు పరమపదించిన తర్వాత అక్కడకు చేరుకున్న శ్రీరామానుజాచార్యులు వారి ముడిచిన మూడు వేళ్ళను 3 ప్రతిజ్ఞలు చేసి తెరిపించారు. అవి: 1) బ్రహ్మ సూత్రములకు విశిష్టాద్వైతరీత్యా భాష్యమును వ్రాయుట, 2) నారాయణ పరతత్వాన్ని తెలిపిన పరాశరవ్యాసుల తిరునామాన్ని ప్రకాశింపచేయుట. 3) సంస్కృత వేదసారమయిన ద్రావిడవేదాన్ని శ్రీనమ్మాళ్వారు తిరువాయ్మొళికి వ్యాఖ్యానాలను రచింపచేయుట అను మూడు ప్రతిజ్ఞలు గావించారు.

చతుర్:- నాలుగువేల పత్తులు గల నాలాయిర దివ్యప్రబంధాలకు శ్రీరామానుజాచార్యులు వ్యాఖ్యానాలను వ్రాయించారు. "రామానుజ" అను

నాలుగు అక్షరాల నామమంత్రముతో అందరిని తరింపచేశారు. ఒకగ్రామంలో 74 తూములు గల ఆనకట్టను తాను చూచి ఆస్ఫూర్తితో సిద్ధాంత ప్రచారానికి లోకోద్ధరణకు 74 పీఠాలను స్థాపించారు. తమ శిష్యులను ఆచార్యులుగా ఏర్పాటు చేశారు. త్యాగ, భోగ, పుష్ప జ్ఞాన మంటపాలుగా శ్రీకంచి, శ్రీరంగం, తిరుమల, తిరునారాయణపురం అను నాలుగు దివ్యదేశాల స్ఫూర్తితో జీవితాన్ని సాగించారు

పంచ:- శ్రీ రామానుజాచార్యులు పూర్వాచార్యుల ఆజ్ఞతో పంచాచార్యుల ద్వారా ఉపదేశాలను పొందారు శ్రీయామునాచార్యులు తను ప్రత్యక్ష ఆచార్యులు కాలేక శిష్యులైన ఐదుగురు నంబులను ఏర్పాటు చేశారు. వారు ఉపదేశించిన అంశాలు పెరియనంబి ద్వయమంత్రం, దర్శనవిషయాలు, పంచసంస్కారాలు, నిగమాంతర్గత విషయాలు, పెరియ తిరుమల నంబి శ్రీరామాయణ రహస్యములు, తిరుక్కోట్టియూరునంబి తిరుమంత్రం, చరమశ్లోకం. తిరువరంగప్పెరుమాళ్ అరయర్లు పంచమోపాయనిష్ఠ, తిరుమాలైయాండాన్ భగవద్విషయం ఉపదేశించారు. మరియు శ్రీరామానుజాచార్యులు భగవత్ప్రాప్తికి సాధనాలుగా అర్థపంచక జ్ఞానాన్ని గురించి తెలిపారు. సర్వజనులకు 'తాపపుండ్ర నామయాగమంత్ర' అను ఐదుసంస్కారాలను విధించారు. 'పర వ్యూహ విభవ అంతర్యామి అర్చావతారాల' ఆరాధనా ప్రాశస్త్యంగల పాంచరాత్ర ఆగమాన్ని అనేకదేవాలయాల ఆరాధనల్లో నియమనం చేశారు.

షట్:- షట్ప్రశ్నలు (ఆరువార్తలు). ఇవి శ్రీరామానుజాచార్యుల జీవనగతిని నిర్దేశించాయి. శ్రీకంచిలో వారు వేంచేసి ఉన్నప్పుడు తల్లిగారి సూచన మేరకు వరదునికి ప్రీతిపాత్రుడైన తిరుకచ్చినంబివారిని కలుసుకున్నారు. వారు నిత్యం ఏకాంతసేవ సమయానికి ముందు దేవపెరుమాళ్ళతో ప్రత్యక్షంగా సంభాషించేవారట. తన విన్నపాన్ని ప్రశ్నలుగా తిరుకచ్చినంబిగారి ద్వారా తెలిపి సమాధానాలు పొంది కార్యోన్ముఖులు అయినారు. ఆ వార్తలు ఈవిధంగా ఉన్నాయి.

1) సకల దేవతలలో శ్రీమన్నారాయణుడే పరాత్పరుడు. 2) ఆత్మపరమాత్మ

రెండువేరు 3) చతుర్విధ ఉపాయాల్లో శరణాగతి, ప్రపత్తి శ్రేష్ఠమైనది. 4) ప్రపన్నునికి అంతిమ స్మృతి నిర్బంధంలేదు. 5) ప్రపన్నునికి శరీరావసానమందు మోక్షము. 6) పూర్ణాచార్యులను, (పెరియనంబిని) ఆశ్రయించాలి.

సప్త: సప్తగిరులు కాలినడకన ఎక్కిశ్రీనివాసుని కలుసుకున్నారు .శ్రీరామానుజాచార్యులు మోకాళ్ళతో తానధిరోహించిన పర్వతాన్ని నేటికీ మోకాళ్ళపర్వతం అనిపిలుస్తారు. 18 సార్లు శ్రీరామాయణ రహస్యాధ్యయనానికి శ్రీరామానుజాచార్యులు తిరుమలకు వేంచేశారు. పుష్పకైంకర్యం ఏర్పాటుచేశారు. శ్రీనివాసపెరుమాళ్లకు శంఖచక్రాలను అలంకరించి ఆరాధన విధులను ఏర్పాటు చేశారు.

అష్ట: నారాయణ అనువాకంలో అష్టాక్షరి గురించి "ఇతిమంత్రోపాసకః వైకుంఠ భువనలోకంగమిష్యతి" అని నిర్ధారింపబడింది. తిరుకోట్టియూర్నంబి 17 సార్లు రప్పించుకొని శ్రీరామానుజాచార్యులకు మంత్రోపదేశం చేశారు. మంత్రరాజము ఉత్కృష్టమైనదని భావించి తరింప గోరువారందరికీ శ్రీరామానుజాచార్యులు మంత్రోపదేశం చేశారు. "మంత్రం యత్నేనగోపయేత్" అను నియమం ఉన్నప్పటికీ, ఆచార్య అనుమతి లేకున్నప్పటికీ అందరూ ఉద్ధరింపబడాలని వారుభావించారు. గుడి గోపురంమీద ఎక్కిసామాన్యజనులకు మంత్రాన్ని చాటిచెప్పారని చరిత్రవైభవం. అది రామానుజాచార్యుల సమతాస్ఫూర్తికి, సకలజన కళ్యాణకాంక్షకు ప్రతీక.

నవ: ఆచార్యుల ఆజ్ఞానుసారము ఉభయవేదసార శ్రీసూక్తులను శ్రీరామానుజాచార్యులు వెల్లడించారు. నవరత్నాలుగా కీర్తించు తొమ్మిది గ్రంథాలను రచించారు. అవి: వేదార్థసంగ్రహం, శ్రీభాష్యం, గీతాభాష్యం, వేదాంతదీపం, వేదాంతసారం, శరణాగతి గద్యం, శ్రీరంగగద్యం, శ్రీవైకుంఠగద్యం, నిత్యగ్రంథం.అను నవగ్రంథాలు. జీవునికి పరమాత్మకు గల నవవిధసంబంధాలను ఉపదేశించారు. దశ: అనేక దేవాలయాలను ఉద్ధరించి దశావతార స్వరూపాలలో వ్యక్తీకృతుడయిన భగవంతుని అర్చాస్వరూపంలో ఆరాధించే నియమావళిని,

ఉత్సవ సాంప్రదాయాలను ఏర్పాటు చేశారు. గోదాదేవి మ్రొక్కును తీర్చి 100 గంగాళాల అక్కారు అడెసలు సమర్పించారు. అంతిమకాలంలో శిష్యులను ఉద్దేశించి 82 వార్తలనే ఉపదేశ శ్రీసూక్తులను అనుగ్రహించారు. సహస్ర ముఖాలు గల ఆదిశేషుని అవతారమైన శ్రీరామానుజాచార్యులు సహస్ర ముఖజ్ఞానప్రకాశులై వేలమందిని సిద్ధాంత వర్తనులు గావించారు. షష్టి సంవత్సర చక్రము రెండుమార్లు తిరుగువరకు 120 సంవత్సరములు తమ దివ్యతిరుమేనితో వేంచేసిఉన్నారు. నేడు నవక నిర్మాణ ప్రాధాన్యం గల సహస్రాబ్ది సమారోహంతో సమతామూర్తి స్వరూపంతో వేంచేసి ఉన్నారు.

108 శ్రీ వైష్ణవ దివ్యదేశాల స్ఫూర్తి సంబంధము శ్రీ రామానుజ జీవన చరిత్రతో ముడిపడి ఉంటుంది. సంఖ్యానియతితో సాధనతో సద్యో జ్ఞానాన్ని పొందగల మార్గాలు మన సంస్కృతిలో కనిపిస్తాయి సాంప్రదాయం లో సంఖ్యా సారథ్యంలో అనేక అంశాలు ఆరాధనలు హోమాదికాలు యజ్ఞ యాగాది కర్మలు నిర్వహింపబడతాయి. శాస్త్రోక్త మైన సంఖ్యా విధానాలతో అనేక ఆధ్యాత్మిక కట్టడాలు నిర్మించబడతాయి. సంఖ్యానియతి విశేషాలతో శ్రీరామానుజాచార్యుల జీవితచరిత్రలో అనేకచోట్ల సంఖ్యాప్రాధాన్యం కనిపిస్తుంది.



# దర్శన భాగ్యం- సౌభాగ్యం, సేవాఫలం- సాఫల్యం

విశ్వాసం అనే సోపానాలు ఎక్కగలిగినప్పుడే భగవత్ గుణానుభవం అనే భవనాన్ని చేరుకోగలుగుతారు. ఆ దివ్యపథంలో పయనించినప్పుడే ఉన్నత స్థానాన్ని చేర గలుగుతాము. అక్కడి నుండి సమస్త సత్యము మనకు గోచరిస్తుంది. జీవిత పరమార్థము స్పష్టం అవుతుంది. లోకహితం, స్వహితం రెండు లభిస్తాయి. లౌకిక అలౌకిక ప్రయోజనాలు సిద్ధిస్తాయి. అటువంటి ఉన్నత లక్ష్యసిద్ధి కొరకు మన వైదిక ధర్మం 'ఆచార్య సంబంధం' అనే గొప్ప సంస్కృతిని ఏర్పరిచింది. అటువంటి ఉత్కృష్టమైన ఆచార్య స్థానమందు పరమాత్ముడే అవతరించాడు. శ్రీకృష్ణ పరమాత్మగా, నర నారాయణులుగా, వ్యాస పరాశరులుగా తాను అవతరించాడు. వైదిక ధర్మాచరణము వక్ర మార్గాలలో పయనించ కుండా ఆళ్వారులు ఆచార్యులు అవతరించారు. ఆళ్వారు శ్రీసూక్తి సారమైన ద్రావిడ వేదం, ఆర్ష ఋషి ప్రకాశిత సంస్కృత వేదం రెండు నేత్రాలుగాగల ఉభయ వేదాంత వైభవాన్ని శ్రీభగవద్రామానుజ మార్గం ప్రకాశం చేసింది. విభేదాలు, వివక్షతలు లేని సర్వమానవ హితైషిగా శ్రీరామానుజ మార్గం గుర్తించి, అనుసరించబడింది. ఉజ్జీవించాలనుకునేవారికి మన పెద్దలు మూడు నిష్ఠలు కలిగి ఉండాలని ఆదేశించారు. అవి ప్రథమ, మధ్యమ, చరమ పర్వ నిష్ఠలు. భగవంతుడే ఉపాయం అని నమ్మి సర్వేశ్వరుని ఆశ్రయించటం మొదటిది. భాగవత శరణాగతి ప్రధానంగా భావించడం రెండవది. చిట్టచివరి ఉపాయం ఆచార్యుడే సర్వస్వం అని భావించటం. అన్ని భగవత్ ప్రాప్తి సాధక మార్గాలలోకి ఆచార్య అభిమానం అనే నిష్ఠను మించినది మరొకటి లేదు. అటువంటి పరమాచార్యులు శ్రీ భగవద్ రామానుజాచార్యులు మాత్రమే అని చరమపర్వనిష్ఠ రహస్యాలను మన పూర్వాచార్యులు గ్రంథాలుగా అనుగ్రహించారు. ఆచార్యులు జ్ఞాన పూర్ణులై ఉండాలి. వేద మార్గ సహేతుక సిద్ధాంతాను వర్తులై ఉండాలి. కారణజన్ములు

సకల మానవ ఉజ్జీవన అనురక్తులై ఉండాలి. వారే జగద్గురువులుగా జగదాచార్యులుగా నిర్ధారించి ఆరాధింపబడతారు. సృష్ట్యాది నుండి ఎందరో భక్తులు పరమ సాధువులు ఆళ్వారులు ఆచార్యులు అవతరించారు. వారంతా భగవత్ ప్రాప్తి మార్గాన్ని వారి వారి పరమోత్కృష్ట విధానాలతో ఉపదేశించారు, ఉద్ధరించారు. అటువంటి ప్రత్యేక లక్షణాలకు మించిన కళ్యాణ గుణాలు పోతపోసిన పరమాచార్యులు లక్ష్మణ మునులు శ్రీ భగవద్ రామానుజాచార్యులు. అందుకే

"సత్యం సత్యం పునః సత్యం యతి రాజో జగద్గురుః
స ఏవ సర్వలోకానాం ఉద్ధర్తా నాస్తి సంశయః" అని కీర్తించబడ్డారు. వేల మందిని దిద్దుబాటు చేసి వేల సంవత్సరాలు అయినా వేనోళ్ళ స్తుతింపబడు వాత్సల్య పూర్ణులు శ్రీ రామానుజాచార్యులు. అనేక మంది శిష్యులను జ్ఞాన ప్రకాశులు గావించిన జగదాచార్యులను ఆ శిష్యులే కంటికి రెప్పలా కాపాడుకున్నారు.

భగవంతుడు పర, వ్యూహ, విభవ, అంతర్యామి అర్చావతారాలుగా పంచ స్వరూపాల్లో ఉన్ననూ, సులభుడై ఈ లోకమందు అందరినీ అనుగ్రహించే స్వరూపం అర్చారూపమే! పరమాత్ముడు అనేక దివ్యదేశాలలో అర్చా స్వరూపుడై మహత్తరమైన లీలలను ప్రదర్శిస్తూ కొలువై ఉన్నాడు. భగవత్ తత్వాన్ని జ్ఞాన భక్తులనే నేత్రాలతో దర్శించిన ఆళ్వార్లు దివ్యదేశాల యందలి అర్చామూర్తి వైభవాన్ని స్తుతించి ప్రకాశింప చేశారు.

ఆ 108 దివ్య దేశాల స్ఫూర్తి శ్రీ భగవద్ రామానుజాచార్య దివ్య జీవన గతికి మూర్తిమత్వాన్ని కలిగించింది. అంటే ఆయా దివ్యదేశాల విజయయాత్రలో శ్రీ రామానుజాచార్యులు ఏర్పరిచిన ఆరాధన వైభవం, పెరుమాళ్ళ అనుగ్రహ లీలా ప్రకాశం కనిపిస్తుంది. భగవంతుడు భూలోక వైకుంఠాలయిన దివ్య దేశాలన్నింటి మహాత్మ్యాలను చాపలా చుట్టి భగవద్ రామానుజా చార్యుల దివ్య దేహంపై పరిచారట! అంటే ఒక్క భగవద్ రామానుజాచార్యుల దర్శనం గావిస్తే, వారిని ఆరాధిస్తే 108 దివ్య దేశ పెరుమాళ్ళను దర్శించి సేవించిన ఫలం లభిస్తుంది అని పెద్దలు ప్రవచిస్తారు. "మారన్ పొన్నడి" శఠగోపన్ పొన్నడి అని అళ్వార్ల

అవయవిగా భావించే నమ్మాళ్వార్‌ల పాద స్థానీయులుగా శ్రీ రామానుజాచార్యులను భావిస్తారు. విలువైన పవిత్రమైన శుభప్రదమైన బంగారు పాదాలుగా సమన్వయం చేస్తారు. అనగా శ్రీ రామానుజాచార్యులను ఆరాధిస్తే ఆళ్వార్లందరినీ ఆరాధించి నట్లుగా భావిస్తారు. అట్లే అందరికీ ఉత్తారకాచార్యులైన భగవద్ రామానుజాచార్యులకు గురు పరంపరలోని (తిరుముడి) ముందున్న ఆచార్యులు, (తిరువడి) తర్వాతి ఆచార్యులు అవయవ భాగాలుగా సమన్వయం చేస్తారు. అనగా శ్రీరామానుజాచార్యులను స్మరిస్తే, ఆరాధిస్తే గురుపరంపరా చార్యుల నందరినీ ఆరాధించిన విశేషఫలంగా పెద్దలు భావిస్తారు.

నమ్మాళ్వార్లు రామానుజాచార్యుల అవతరణకు ముందే భవిష్యదాచార్యులుగా వారిని సంకల్పించడం విశేషం. యమునాచార్యుల ఆజ్ఞగా నాథ మునులచే పునరుద్ధరింపబడిన ఆళ్వార్ల దివ్య ప్రబంధాల యొక్క వైభవాన్ని శ్రీ రామానుజాచార్యులు ప్రాచుర్యం చేశారు. ఉభయ వేదాంత సారంగా సిద్ధాంతాన్ని స్థాపించారు. పూర్వాచార్యుల వైభవాన్ని ప్రకాశింప చేశారు. దివ్యదేశాల దేవాలయ ఉద్ధరణ ఆరాధనా సంస్కరణలు కావించారు

శ్రీరంగం కరిశైల మంజనగిరిం తార్క్ష్యాద్రి సింహాచలౌ
శ్రీకూర్మం పురుషోత్తమంచ బదరీనారాయణం నైమిశం ।
శ్రీమద్వారవతి ప్రయాగ మధురా యోధ్యాగయా పుష్కరం
సాలగ్రామగిరిం నిషేవ్య రమతే రామానుజోఽయం మునిః ॥

శ్రీ వైష్ణవ సంప్రదాయంలో ప్రధానమైనవి మూడు అంశాలు అవి ఆళ్వారులు, ఆచార్యులు, దివ్యదేశాలు ఈ మూడింటి స్ఫూర్తిని శ్రీ భగవద్ రామానుజాచార్యుల దివ్యతిరుమేని యందు మన పూర్వాచార్యులు సమన్వయీకరించారు. అందుకే జగదాచార్యుల నామస్మరణ, ఆరాధన, కైంకర్యం, అనుసరణ సకలశుభదాయకాలు.

# బాల సూర్యుని భావ స్ఫూర్తి

చరిత్రపుటల్లో ప్రస్ఫుటం అయ్యే సత్యాలు మహనీయుల జీవిత చిత్రాలను కళ్లకు కట్టినట్టుగా చూపుతాయి. పెద్దల ప్రమాణ శ్రీ సూక్తులు ఆ వృత్తాంతాలను బలపరుస్తాయి. అవి మనకు కర్తవ్యాన్ని బోధించి ప్రభావ పరుస్తాయి. సమాజాన్ని ఉజ్జీవింప చేయాలనే పూర్వాచార్యుల సంకల్పంతో భగవదాజ్ఞతో అవతరించిన వారు శ్రీభగవద్రామానుజాచార్యులు.

" పుణ్యాంబోజ వికాసాయ పాప ధ్వాంత క్షయాయచ
శ్రీమాన్ ఆవిరభూత్ భూమౌ రామానుజ దివాకరః"

అని పుణ్య మనే పద్మాన్ని వికసింప చేసి పాపమనే చీకటిని తొలగింప చేయు సూర్యుని వలె ఉదయించాడు అని స్తుతిస్తారు. వారు పుట్టగానే వేద పురుషుడు, భూమాత, నమ్మాళ్వారు సంతోషించారట! దివ్య తేజోమూర్తి ,వరప్రసాది అయిన బాల సూర్యుని వంటి కుమారుని చూసి తల్లి దండ్రులైన కేశవ సూరి, కాంతిమతి దేవిలు ఎంతో ఆనందించారు. తండ్రికి పంచాయుధాలుగా తల్లికి ఆదిశేషునిగా ఆబాలుడు దర్శనమిచ్చాడట! మేనమామ అయిన పెరియ తిరుమలనంబి యమునాచార్యుల శిష్యులు. తిరుమలలో నిత్య సేవలో ఉండి మేనల్లుడి జన్మ వార్తతో సంతోషంగా పెరంబూదూరు వచ్చారు. శిశువును ఆశీర్వదించి తిరుమణితో పూగుర్తులుగా శంఖచక్ర ముద్రలు వేశారు. లక్ష్మణ పెరుమాళ్ళ అంశగా ఇళయ్ ఆళ్వార్ అని నామకరణం చేశారు. అప్పటి నుండే శ్రీ సిద్ధాంత సౌరభ విస్తరణకు నాంది పడింది. అన్ని సంస్కారాలు జరుపబడి, చిన్నతనం లోనే వివాహం కూడా జరిగింది. తండ్రిగారు పరమపదించిన తర్వాత పెరంబూదూరు వదిలి కాంచీపురానికి చేరుకున్నారు. ఆనాడు ప్రచారంలో గల అద్వైత సిద్ధాంత బోధకుడు యాదవప్రకాశుడు. అతని వద్ద వేదవిద్య అభ్యసించడం ప్రారంభించారు శ్రీరామానుజులు.

ఒకనాడు గురుసేవా సమయంలో చాందోఖ్యోపనిషత్తులోని "తస్య యథా కప్యాసం పుండరీక మేవమక్షిణీ" అను మంత్రార్థం ప్రస్తుతము కాగా, యాదవప్రకాశుడు చెప్పిన అర్థము విని శ్రీరామానుజులు వేదన చెందారట! హిరణ్య పురుషుని నేత్రములు మర్కట పృష్ట భాగం వలె ఎఱ్ఱగా ఉన్నాయని గురువు చెప్పిన అర్థాన్ని ఖండించారు. జగత్కారణుడగు హిరణ్య పురుషునికి సూర్యకిరణాలచే వికసించిన కమలము వంటి కన్నులు గలవు అని సమన్వయం చెప్పారు రామానుజులు. అలాగే పరబ్రహ్మ కల్యాణ గుణ లక్షణాల గురించి, చిదచిదీశ్వర తత్వాలను గురించి అనేక అంశాలలో వేదార్థాలకు యథార్థ భావస్ఫూర్తిని వెలువరించారు.

ఈ వైఖరి యాదవప్రకాశులకు రుచించలేదు ఎలాగైనా వారిని శిష్యగణం నుండి తొలగించాలని భావించి కాశీ యాత్రలో వారిని అడవిలో వదిలి వేశారు. కానీ పుణ్యదంపతుల రూపంలో వరదరాజ పెరుమాళ్ అనుగ్రహంతో శ్రీరామానుజులు మళ్ళీ తిరిగి కాంచీపురానికి చేరారు. చేసేదిలేక యాదవప్రకాశుడు శ్రీ రామానుజా చార్యులను మరల తన శిష్య గణంలో ఉంచుకున్నారు. ఆ ప్రాంత రాజు యొక్క కుమార్తె పైన గల బ్రహ్మరాక్షసి యాదవప్రకాశుని ధిక్కరించి శ్రీ రామానుజులకు పాదాక్రాంతం కాగా గురువు మరింత క్రోధావిష్టులయినారు. మరొక మంత్రానికి కూడా తన సిద్ధాంత వ్యతిరేకమగు అర్థాన్ని చెప్పగా మండిపడి శ్రీరామానుజులను బహిష్కరించారట! ఆ మంత్రాన్ని పెద్దలు ఈవిధంగా వివరిస్తారు "సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి శాంత ఉపాసీత" అనగా సృష్టి బ్రహ్మము వలన జనించి అందే ఉండి మళ్లీ అందే లయిస్తుంది. అందుచేత విశ్వము బ్రహ్మచేత పరివ్యాప్తం అయి ఉంటుందని నిరూపించి వివరించారట!

శ్రీరామానుజుల కోసం ఎదురుచూసే యామునాచార్యుల శిష్యులు తిరుకచ్చినంబివారు (కాంచీ పూర్ణులు) వారు శ్రీ కంచి వరదరాజ స్వామికి చేసే సేవా కైంకర్యమును, వారి స్వభావమును చూసి శ్రీ రామానుజులు వారితో స్నేహాన్ని పెంచుకున్నారు. వారిని గురు భావంతో గౌరవించారు.

యామునాచార్యులు అనారోగ్యంతో ఉండి శ్రీరామానుజులకై పరితపించారు. మహాపూర్ణులను (పెరియ నంబి) రామానుజుల వద్దకు పంపించారు. వారు పఠించిన ఆళవందారుల స్తోత్రరత్నం లోని అద్భుతమైన భావానికి ముగ్ధులైనారు రామానుజాచార్యులు. ఆ శ్లోకము

స్వాభావికానవధికాతిశయేశితృత్వం
నారాయణ! త్వయి న మృష్యతి వైదికః కః।
బ్రహ్మా శివశ్శతమఖః పరమస్స్వరాడితి
ఏతేపి యస్య మహిమార్ణవ విప్రుషస్తే ॥

దానికి ఆకర్షితులై భక్తితో యామునాచార్యుల వద్దకు వచ్చారు. అప్పటికే పరమపదించిన ఆచార్యుల ముడిచిన మూడు వ్రేళ్ళను మూడు విన్నపాలతో తెరిపించారు. అవి:

1) అహం విష్ణు మతే స్థిత్వా జనానజ్ఞాన మోహితాన్
పంచ సంస్కార సంపన్నాన్ ద్రావిడామ్నాయ పారగాన్
2) సంగృహ్య నిఖిలాన్ అర్థాన్ తత్వ జ్ఞాన పదం శుభం
శ్రీ భాష్యం చ కరిష్యామి జన రక్షణ హేతునా
3) జీవేశ్వరాదీన్ లోకేభ్యః కృపయా యః పరాశరః
సందర్శయన్ తత్స్వభావాన్ తదుపాయ గతీ స్తథా
పురాణ రత్నం సంచక్రే మునివర్యా కృపానిధిః
తస్య నామ్నా మహా ప్రాజ్ఞ వైష్ణవస్య చ కస్యచిత్ అనగా

1) ప్రపత్తి మార్గం, పంచ సంస్కారాలు ద్రావిడ వేద ప్రచారం గావించుట.

2) తత్వజ్ఞాన పరమైన సర్వ హితమైన సకల శుభాలు కలిగించే శ్రీభాష్యాన్ని రచించుట.

3) పురాణ రత్నం విష్ణుపురాణం రచించిన వ్యాస పరాశరుల నామము ఎవరైనా పండితులకు ఇచ్చి ప్రసిద్ధం గావించుట.

అనే మూడు విన్నపాలతో యామున మునులు ముడిచిన వేళ్ళు తెరిచారట!

అయినా కూడా ఏదో ఆర్తితో పరితపించి చింతిస్తున్న శ్రీరామానుజుల అభ్యర్థనను తిరుకచ్చినంబిగారు వరదరాజ పెరుమాళ్‌ల ముందు విన్నవించారు! వారు అడిగిన ఆరు ప్రశ్నలకు వరదరాజ పెరుమాళ్ల ఆజ్ఞగా 6 వార్తలు విన్నవించారు. ఈ ఆరు వార్తలు శ్రీ రామానుజాచార్యుల జీవిత పథాన్ని నిర్దేశించాయి.అవి:

అహమేవ పరబ్రహ్మ జగత్కారణ కారణం ।
క్షేత్ర క్షేత్రజ్ఞయోర్భేదః సిద్ధ ఏవ మహామతే ॥
మోక్షోపాయో న్యాస ఏవ జనానాం ముక్తిమిచ్ఛతాం ।
మద్భక్తానాం జనానాంచ నాంతిమ స్మృతి రిష్యతే ॥
దేహావసానే భక్తానాం దదామి పరమం పదం ।
పూర్ణాచార్యం మహాత్మానం సమాశ్రయ గుణాశ్రయం ॥
ఇతి రామానుజార్యాయ మయోక్తం వద సత్వరం.

అనగా శ్రీ రామానుజాచార్యుల ప్రార్థన మన్నించి వరదరాజ పెరుమాళ్ ఆరు వార్తలను తెలిపిరి అవి:

1) జగత్ కారణమైన బ్రహ్మమును నేను. 2) జీవేశ్వర విభేదము సిద్ధము (జీవుడు పరమాత్మ వేరు). 3) ముముక్షువులకు ప్రపత్తి మోక్ష హేతువు. 4) అంతిమ స్మృతి లేకున్నా మోక్షము కలుగుతుంది. 5) దేహావసానమందు నా భక్తులకు మోక్షము. 6) మహాపూర్ణుని ఆశ్రయించుము. ఈ ఆరు వార్తలను శ్రీరామానుజులకు వెంటనే తెలుపుము అని వరదరాజ పెరుమాళ్ ఆజ్ఞాపించారట! ఈ విధంగా రామానుజ దివాకరుల జ్ఞానం బాల్యంనుంచే ఉదయ సూర్యుని తేజస్సులా దినదిన పరిపక్వతను పొందింది. పూర్వాచార్యుల ఆళ్వారుల శ్రీ సూక్తులతో ప్రవర్ధమానమై ఉభయ వేదాంత భావస్ఫూర్తితో శ్రీ సిద్ధాంత రత్నమై జగత్ ప్రసిద్ధమైనది.

# సహస్ర సంజీవిని

పామరులకు పావనత్వాన్ని పండితులకు ప్రశస్త జ్ఞానాన్ని ప్రసాదించిన పరమాచార్యులు శ్రీభగవద్ రామానుజాచార్యులు వారు అకల్మషులై  సకల జనులకు  కల్పతరువు అయినారు. భగవదనుగ్రహ ప్రాప్తియే లక్ష్యమైన వైదిక ధర్మం అందరి సొత్తు! అని తెలియజేశారు. అతి సామాన్యుల లౌకిక జీవన విధికి పరమవైదిక ధర్మానికి వారధిని ఏర్పరిచారు. అందుకే అందరికీ శ్రీ రామానుజాచార్యులే ఉత్తారకులు అని నిర్ధారించి కీర్తించబడ్డారు. కాల ప్రభావము అంటని శుద్ధ సత్త్వము భగవత్తత్వము. శ్రీ రామానుజ మార్గదర్శన తత్వము అలాంటిదే! యతి రాజులను ఆశ్రయించిన వారు పొందే ప్రయోజనం అనుగ్రహము కూడా అలాంటిదే!  అదే సకల జీవకోటి భగవంతుని పొందవచ్చును అనే మార్గం! కాలం వేల ఏళ్ళు గడిచి, మారినా మానవుని ఉజ్జీవింప చేయు మార్గము రామానుజ మార్గమే! బాహ్య సంపదలు కోరే వారికీ, పరమ పురుషార్థము కాంక్షించే వారికీ వారు కల్పతరువులే ! కనుకనే వారు ఉభయ విభూతి నాయకులైనారు.

వేలమంది విభిన్న విధానంతో జగదాచార్యుల దరికి చేరినా దయతో వారు ఉద్ధరించిన మార్గం ఒక్కటే! వారు దివ్య పార్థివదేహంతో నడయాడినప్పుడు ఎందరినో ఉద్ధరించారు. అర్చామూర్తిగా నెలవై కూడా అంతటి ప్రభావాన్నే కలిగి ఉన్నారు. అనేది నిరూపించబడిన సత్యం!. అది మనకు పూర్వాచార్యులు చరిత్రకారులు వారి రచనల ద్వారా తెలిపారు. అందుకే జగదాచార్యుల చరిత్రలో ప్రస్ఫుటమైన విశేషాలు, పూర్వాచార్యుల స్తుతులు, ఉపదేశ పరంపరలు, దేవాలయ వైభవాలు, ఆచరణలు యతిరాజుల మహోత్త్యాన్ని తెలుపుతున్నాయి. అందుకే శ్రీభగవద్ రామానుజాచార్య గుణానుభవం కూడా  సహస్ర సంజీవిని యే !...

యతిరాజుల జీవన గతిలో అమృతోపమానమైన సన్నివేశాలు ఎన్నో ఉన్నాయి. కొందరు శిష్యులకు వారిని చూసినకొద్దీ తరగని రూప నిధిగా కనిపించారు. జ్ఞాన

తృష్ణతో దరిచేరిన వారికి జ్ఞాన ఖనిగా ఉపదేశ వితరణ చేశారు. గుణ పూర్తి లేనివారిని  సుగుణ పూర్ణులనుగా మార్చారు. ఆర్తితో దరి చేరిన వారిని వాత్సల్యంతో ఆదరించి ఉపశమనులను గావించారు. సమాజంలోని  సంకుచిత ఆచార  చీకటి గుహలో పరమ జ్యోతిని వెలిగించారు. రుగ్మతలను, హృదయ దౌర్బల్యాలను దూరం చేసిన మృత సంజీవినులు  వారి అనుగ్రహ, సంకల్పాలు. అందుకే పెద్దలు శ్రీరామ శ్రీకృష్ణ అవతారములతో సాకేత,మధురా నగరాలు ఎలా పునీతం అయ్యాయో అలాగే యతిరాజుల అవతరణతో శ్రీపెరంబూదూర్ కూడా పునీతమైందని ఇలా స్తుతిస్తారు.

"యథావతారే మధురా మురారేః
రామస్య సాకేత పురీచ యద్వత్
తథా యతీంద్రస్య కృపాశ్రయస్య
పుణ్యో త్తరా భూతపురీ బభూవ" యతి రాజుల అనుగ్రహ విశేషాలు, మెరుగు మాయని సన్నివేశాలు అద్వితీయ ఆచార్య తత్వాన్ని ఆవిష్కరిస్తాయి.

శ్రీరామానుజాచార్యులు శ్రీయమునాచార్యులను చేరక ముందే రాచవ్రణంతో తీవ్ర శరీర బాధను అనుభవించే మారినేటి నంబి వారిని చూస్తారు. శ్రీ యమునాచార్యుల శిష్యులైన మారినేరి నంబి "కృపాగమ లబ్ద ప్రారబ్ధ విశేషం" అనగా ఆచార్య కైంకర్య నిష్ఠతో ఆచార్యుల రుగ్మత బాధను తాను కోరి అనుభవిస్తున్నారు. అది తెలియక వారి బాధను చూసి చెలించి మార్దవ హృదయులై భగవంతుని  ప్రార్థించి, శ్రీ రామానుజాచార్యులు ఆ బాధను దూరం చేస్తారు. కానీ మారి నేరి నంబి తిరిగి కోరుకొని ఆ బాధను అనుభవించారు. ఒకనాడు యతిరాజులు వీధిలో వెళ్లే మూగవాని దైన్యాన్ని చూసి జాలిపడి పిలిచి మంత్రోపదేశం చేశారు. తిరుమలలో గొల్ల వనిత క్షీర కైంకర్యానికి మెచ్చి శ్రీనివాస పెరుమాళ్ళకు,  ఆమెకు మోక్షం ప్రసాదించమని శ్రీముఖం (పత్రం) రాశారు. తన గురువుగారి కూతురైన అతులలక్ష్మికి అత్తవారి ఇంటిలోగల బాధలను తొలగించారు. బ్రహ్మరాక్షసి ఆవహించిన ఇద్దరు రాజకుమార్తెలను పీడా

విముక్తులను చేశారు. ఆచార్య భక్తి గల కొంగు పిరాట్టికి పాదుకలని ఇచ్చారు. ఆతిథ్య మిచ్చిన పరుత్తి కొళ్ళి నాచ్చియార్ దంపతుల సమస్యలను తొలగించారు. తిల్ల అను నర్తకీమణి ఉపకృతికి గుర్తుగా తిరుమలలో గోవిందరాజ పెరుమాళ్ళను ప్రతిష్ఠించి 'తిల్ల గోవింద రాయ' అను నామ వ్యవహారం కల్పించారు. ఆళ్వార్ తిరునగరి మార్గంలో కనిపించిన బాలికను కరుణించారు. "గుణాః పూజ స్థానం గుణిషు, న చ లింగం న చ వయః" అని మంచి గుణాలకే ఆదరణ కానీ స్త్రీ-పురుష భేదం వయోభేదం ఉండదన్నట్లు అందరినీ అనుగ్రహించారు. శ్రీ రామానుజాచార్యుల శిష్య గణంలో శ్రీ కూరత్తాళ్వార్‌లు, దేవరాజముని (యజ్ఞ మూర్తులు) వంటి గొప్ప పండిత జ్ఞానులు ఉన్నారు. వయస్సులో అధికులు ఉన్నారు. స్త్రీలు బాలకులు, సంపన్నులు, నిరుపేదలూ ఉన్నారు. సకల జనులకు వారు ఉద్ధారకులే ప్రియ శిష్యులైన శ్రీ కూరేశులు ఆచార్య సేవలో సిద్ధాంత రక్షణలో భాగంగా చోళ రాజు దుశ్చర్యలకు ప్రతిగా నేత్రాలను త్యాగం చేశారు. ఆ విధంగా సంతప్తులైన ప్రియ శిష్యునికి జ్ఞాన నేత్రాలను ప్రసాదింప చేశారు. ఇంద్రియ నిగ్రహ శూన్యులైన ఎంతోమందికి తీర్థాన్ని ప్రసాదించి ఉజ్జీవింప చేశారు. మూగకు మాటలు రప్పించారు. వేలమంది జైనులకు ఒకేసారి తత్వ దర్శనాన్ని గావించారు. ఇద్దరు రాజకుమార్తెల పైన ఉన్న బ్రహ్మ రాక్షసిని పారద్రోలి వారి తల్లిదండ్రులకు సంతోషాన్ని కలిగించారు. వారి ఆచరణలు, బోధనలు మృత సంజీవినులే!... అందుకే శ్రీ రామానుజ మార్గం సహస్ర సంజీవినిగా కీర్తించబడుతున్నది. నేటికి "సహస్రాబ్ధి సమారోహం" రూపంగా శ్రీ శ్రీనివాస స్వరూపులైన శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారి సంకల్పంతో దివ్య అర్చామూర్తిగా వెలిశారు. సమాజంలోని సహస్ర దోషాలను తొలగించే "సహస్ర సంజీవిని" అయిన జగదాచార్యుల అనుగ్రహాన్ని అందరం పొందుదాం!.

# దర్శనం - నిదర్శనం

భారతీయ సంస్కృతిలో ఆచార్యులదే గొప్ప స్థానం! ఎందుకంటే "ఆచార్యవాన్ పురుషో వేద" అని ఆచార్యులు కలిగినవారే అన్నింటిని తెలుసుకోగలుగుతారు. మనం తెలుసుకోవలసిన పరమార్థం కూడా ఆచార్యుల వల్లనే తెలుస్తుంది. లౌకిక విషయాలలో కూడా గురువుల ప్రభావంతోనే విద్యాభివృద్ధి కలుగుతుంది. అన్నీ కలిగి ఉండి ఎన్నో అనుభవాలతో మరెన్నో సంక్లిష్ట అంశాలలో పరిజ్ఞానం సాధించి ఉన్నప్పటికీ భగవత్ సంబంధిత జ్ఞానము లేనిదైన విజ్ఞానం నిస్సారం నిరుపయోగం అని పెద్దలు చెప్తారు. ఉజ్జీవింప చేయు భావ సంపదను కర్తవ్య స్ఫూర్తిని మనకందించె వారే ఆచార్యులు. పువ్వు పువ్వున తేనెను సేకరించి తెట్టెగా ఒకచోట పెట్టితే అది ఓషధీ భూతంగా అమృత మాధురి సమకూర్చినట్టుగా తత్వజ్ఞాన సంపన్నులైన ఆచార్యులు సమాజానికి హితోక్తులను ఉద్బోధించారు. అటువంటి ఆచార్యుల లోనే ప్రధాన ఆచార్యరత్నం భగవద్రామానుజాచార్యులు. 120 సంవత్సరాలు సమకాలీనులకు దర్శనం ప్రసాదించి ధన్యులను గావించారు. వేల సంవత్సరాల వరకు అనుసరణీయమయిన రామానుజ దర్శనాన్ని ఉద్బోధించారు. ఎన్నో ఒడిదుడుకులకు ఓర్చి సాంప్రదాయాన్ని ఉద్ధరించారు. అంతటి సుదీర్ఘ జీవితం ధార పోసినా అది సరిపోక భగవదాజ్ఞ చేత తిరిగి మనవాళ మహామునులుగా అవతరించారు. శ్రీసాంప్రదాయ ఉపదేశ వాఙ్మయాన్ని ప్రపన్న లోకానికి ప్రసాదించారు అని పెద్దలమాట!

జగదాచార్యుల సమకాలీన శిష్య పరంపరలోని వారే కాకుండా తదనంతర ఆచార్యులు ఎందరో వారి వైభవాన్ని శ్రీసూక్తులుగా, స్తోత్రాలుగా వాఙ్మయ రూపంలో అందించారు. వారి అవతార విశేషాన్ని అనేక రకాలుగా విశ్లేషించారు. యతిరాజులను దర్శించి అనుభవించి కళ్యాణ గుణ పరంపరను ఎన్నో రకాలుగా వర్ణించారు. లోక హితైషి అయిన యతిరాజుల స్వరూప, స్వభావ దర్శనం, సిద్ధాంత దర్శనం వారి మహౌన్నత్యానికి నిదర్శనం!

మొదట శ్రీరామానుజాచార్యులు అవతరించగానే తండ్రి గారైన కేశవ సూరికి మేనమామ యగు తిరుమలనంబికి పరమపదనాథుని పంచాయుధాలుగా కనిపించారట! తల్లి అగు కాంతిమతి దేవికి ఆదిశేషుని అవతారంగా దర్శనమిచ్చాడట! కవితార్కిక కేసరి శ్రీ వేదాంత దేశికులు "విశ్వక్సేనో యతిపతి రభూత్ వేదసారః త్రిదండః" అని వర్ణిస్తారు. అనగా యతిరాజులు విశ్వక్సేనులు. వారి దండము విశ్వక్సేనుని హస్త దండము అని వర్ణిస్తారు. అలాగే వారు రచించిన "యతిరాజ సప్తతి" లో "అమునా తపనాతిశాయి భూమ్నా యతిరాజేన నిబద్ధ నాయక శ్రీ" అను ఈ శ్లోకంతో శ్రీ రామానుజాచార్యుల స్తుతి ద్వారా రహస్యత్రయాన్ని (అష్టాక్షరీ, ద్వయ మంత్రం, చరమ శ్లోకం) సమన్వయిస్తూ వర్ణిస్తారు. అలాగే యతిరాజులకు త్రిదండ సమానులుగా భావింపబడే దాశరథి అను నామాహ్వాయులయిన మొదలి యాండాన్ "ధాటి పంచకం" అనే స్తుతి ద్వారా జగదాచార్యుల వైభవాన్ని త్రిదండ మహోత్మ్యాన్ని వర్ణిస్తారు.

"శ్రీ రంగేశయ జయ ధ్వజః" అని శ్రీరంగనాథుని జయధ్వజులైన యతి రాజులకు "విజయతే" అని కీర్తిస్తారు. అవైదిక మత గజాలను అణచిన కంఠీరవం అని (సింహం) సర్పాలకు గరుత్మంతుని లాగా, అజ్ఞానాన్ని పారద్రోలే విద్యా చూడామణి లాగా యతిరాజుల గుణాలను దర్శించి స్తుతించారు.వీరిని రామానుజ పొన్నడి అని కీర్తిస్తారు. అనగా శ్రీభగవద్ రామానుజాచార్యుల పాద స్వరూపులు.

ఆంధ్ర పూర్ణులు అను పేరు గల వడగ నంబి అనే వారు కూడా యతి రాజుల శిష్యులు. వీరి ఆచార్య నిష్ఠ చాలా గొప్పది. భగవంతుని కంటే ఆచార్యుల సేవయే పరమావధిగా భావించారు. వారు కూడా "శేషాంశకః కేశవ యజ్వ దేవ్యాం" అని యతిరాజులను శేషాంశ సంభూతునిగా స్తుతించారు.

ప్రపన్నగాయత్రిగా అనుసంధించే "ఇరామానుశనూత్తన్దాది" లో యతిరాజుల కళ్యాణ గుణాలను, దివ్య స్వరూపాన్ని తిరువరంగత్త అముదనార్లు స్తుతించారు. ఆచార్య వైభవాన్ని ప్రకాశింప చేసి, శ్రీ రామానుజాచార్యుల అవతార విశేషాలను గానం చేశారు. వారు అనేక రకాలుగా స్తుతిస్తూ పద్మావతీ విభుని చేతిలోని

సుదర్శన, పాంచజన్య, నందక, కౌమోదకీ, శార్ఙ్గములనే పంచాయుధాలు అందరినీ ఉద్ధరించడానికి శ్రీ రామానుజాచార్యుల స్వరూపంతో వచ్చినట్లుగా దర్శిస్తూ ప్రార్థిస్తారు. శ్రీ మనవాళ మహామునుల ఆచార్యులైన తిరువాయ్ మొళి పిళ్ళై (శ్రీశైలేశులు) అన్యమతస్తుల దుశ్చర్యలతో అస్తవ్యస్తమైన ఆళ్వార్ తిరునగరిని ఉద్ధరించ సంకల్పించారు. చతుర్వేది మంగళం అనే వీధి నేర్పరచి ఆళ్వారుకు పునర్ వైభవాన్ని కలిగింప చేశారు. శ్రీ రామానుజాచార్యుల పూర్వపు అర్చామూర్తిని కూడా ప్రతిష్ఠించారు. ఆ సమయంలో వారి శిష్యులుగా ఉన్న మనవాళ మహామునులు "యతిరాజ వింశతి" అను స్తోత్రాన్ని రచించి భక్తితో పాడారట! అందుకే వరవరమునులకు వారి ఆచార్యులు "యతి రాజ ప్రవణులు" అనే బిరుదును ఇచ్చారట! వింశతి అనగా 20. ఆ సంఖ్యా నియతితోనే శ్రీ రామానుజాచార్యుల స్తుతి ఇందులో ఉంటుంది. ఆ శ్లోక రత్నాలు రహస్యత్రయి (అష్టాక్షరి, ద్వయమంత్రం, చరమశ్లోకం) సారంగా పెద్దలు భావిస్తారు. అష్టాక్షరి లో గల మూడు పదాలు, ద్వయ మంత్రం లో గల ఆరు పదాలు, గీతా చరమ శ్లోకం లో గల 11 పదాల సారాన్ని సమన్వయించి ఆచార్య స్తుతిగా ఇరవై సంఖ్యతో శ్లోకాలు రచించారనే రహస్యాన్ని పెద్దలు వివరిస్తారు. మంత్ర సారము ఆచార్య శరణాగతిని తెలియజేస్తుంది. ఆ ఆచార్యులు జగదాచార్యులయిన భగవద్ రామానుజాచార్యులు మాత్రమే! అని పెద్దల ఉపదేశము.

ఈ విధంగా ఎందరో పూర్వాచార్యులు భగవద్ రామానుజాచార్యులను వారి జీవన గమనం, ఆచరణ, ఉపదేశములు, స్వరూప స్వభావములు ఆధారంగా వారిని అవతారపురుషునిగా దర్శించారు. జగదాచార్యులకు ముందు ఆచార్యులు కూడా వారు అవతరించటానికి ముందుగానే భవిష్యత్ ఆచార్యులుగా వారి అర్చామూర్తిని ఆరాధించారు. యతిరాజుల వైభవాన్ని తర్వాతి తరాల వారందరూ కూడా అనుభవించి తరిస్తున్నారు. దివ్య దేశ చరిత్రల యందు, సంప్రదాయ ఆచరణలయందు, శ్రీ సిద్ధాంత నిరూపణల యందు, భాష్యకారుల శ్రీ సూక్తులు యందు, యతిరాజుల అర్చా మూర్తుల విశేషములందు వారి అవతార తత్వాన్ని అందరూ దర్శించవచ్చు!

అందరికీ భగవత్స్వరూపంగా గోచరించిన అవతార పురుషులు శ్రీభగవద్ రామానుజాచార్యులు. అతి సామాన్యులనూ ఉద్ధరించారు. సకల జీవరాశులను కూడా వాత్సల్యంతో చూశారు. విభేదాలు లేకుండా అందరిని తరింప చేశారు అనుటకు వారి చరిత్రే నిదర్శనం! యతిరాజులు భగవత్స్వరూపులే అనుటకు భగవంతుని స్వరూప గుణాలను తనయందు ప్రకాశింపజేసిన శ్రీ రామానుజ దివ్య దర్శనమే నిదర్శనం!

# సంబంధం బంధమోచనం

మానవ సంబంధాలు బాగుంటేనే సమాజం పురోగమిస్తుంది భగవత్ సంబంధాన్ని గుర్తించ గలిగినప్పుడే జీవన సత్యం గోచరిస్తుంది. అలాగే ఆచార్య సంబంధ ఆవశ్యకత తెలియనప్పుడు జీవితం అగమ్యగోచరం అవుతుంది.

"ఆచినోతి శాస్త్రార్థాన్" అని తాము ఆచరించి అనుభవించి, ఉపదేశించి, ఉద్ధరించిన వారే మన ఆచార్యులు. భగవత్ ప్రాప్తి మార్గాన్ని అనుసరణీయంగా మనకు అందించిన వారే మన ఆచార్యులు. జ్ఞానపరిపక్వతతో పాటు పరంపరాగత ఉపదేశ ప్రాప్తి విశేషము మన ఆచార్యుల ప్రధాన యోగ్యత!

అటువంటి వారిలో అవతార పురుషులు, పరమ కారుణికులు, లోకోద్ధరణకై భగవన్నియామకంగా అవతరించిన వారు శ్రీభగవద్ రామానుజాచార్యులు. లౌకిక సంబంధాలు అవసరానుగుణంగా తాత్కాలికంగా ఏర్పడినవి. అవి క్షణికా నందానికి, కాంక్షలకు, ఆకాంక్షలకు, నిలయమైనవి. భగవత్ సంబంధం పూర్వాచార్యోక్తిగా నవవిధ సంబంధ రూపంగా (తొమ్మిది రకాలుగా) సమన్వయం చేయబడింది. ప్రధానంగా శరీర శరీరి సంబంధాన్ని మన పెద్దలు నిరూపించారు. ఆచార్య సంబంధం మనలో జ్ఞాన బీజాలు వేసి కర్తవ్య స్ఫూర్తిని కలిగించి ఆత్మోజ్జీవనానికి పురిగొల్పుతుంది. శ్రీ భగవద్రామానుజాచార్య సంబంధం పరమోత్కృష్టమైనది పరమార్థ సాధకము అయినది. "మణి మంటప మార్గ దాయి" అని వైకుంఠానికి చేర్చేవారు శ్రీరామానుజాచార్యులని కీర్తిస్తారు. రామానుజ సంబంధం ఈ లోకమందు, పరలోకమందు కూడా ప్రయోజనాన్ని కలిగిస్తుంది. ప్రత్యక్షంగా రామానుజాచార్యులతో సంబంధం కలిగి తరించిన పూర్వాచార్యులు ఎందరో వారి శ్రీసూక్తులతో శ్రీరామానుజ సంబంధ ప్రయోజనాలను మనకు తెలిపి తాము అనుభవించి తరించారు. వారు జగదాచార్యులకు శిష్యులై ఉండి శిష్య సంబంధమే కాదు ప్రత్యేక అనుబంధాన్ని కూడా పొందారు. అటువంటి వారిలో శ్రీ గోవింద భట్టర్లు సోదర సంబంధులు. వీరే జగదాచార్యుల తర్వాతి

ఆచార్యులు. ఎంబార్లు అను నామ ప్రసిద్ధులు. శ్రీ రామానుజాచార్యులతో కలిసి విద్యాభ్యాసం చేశారు. శ్రీతిరుమలనంబి వారి వద్ద శిష్యులుగా ఉండి వారి ఆజ్ఞతో శ్రీరామానుజాచార్యులకు ప్రియ శిష్యులు అయినారు. వారు అత్యంత ఆచార్య నిష్ఠ గలవారు. శ్రీతిరుమల నంబి వారు జగదాచార్యులకు దేహ బంధువులుగా మేనమామగారు. విశేషించి వారు శ్రీరామాయణ ఉపదేశం గావించారు. జగదాచార్యుల పంచాచార్యులులో వీరు ఒకరు. జగదాచార్యులకు ఆచార్యులైన పంచనంబులు 1) పెరియనంబి 2) పెరియతిరుమల నంబి 3) తిరుక్కోష్టియూర్ నంబి 4) తిరువరంగ పెరుమాళరయర్ 5) తిరుమాలై యాండాన్. ఈ పంచా చార్యుల వద్ద ప్రత్యేక విషయాలలో ఉపదేశాలు పొంది వారితో ఆచార్య, శిష్య సంబంధాన్ని కలిగి ఉన్నారు. యతిరాజుల చిన్నమ్మ కుమారులుగా బంధు సంబంధం కలిగిన మొదలియాండాన్ జగదాచార్యులకు ప్రియ శిష్యులు మీరు రామానుజన్ పొన్నుడిగా ( పాదుకలుగా ) త్రిదండంగా కీర్తించబడతారు. ఎక్కడికి వెళ్ళినా జగదాచార్యులతోనే ఉండేవారట! అనేకమంది శిష్యులను వాత్సల్యపూర్ణులై అనుగ్రహించు జగదాచార్యులతో ఆచార్య సంబంధము ఎంతో గొప్పది. వారు తమ శిష్యులకు వారివారి సామర్థ్యాలను బట్టి ఆయా కైంకర్యాలను అప్పగించే వారట! క్షీర కైంకర్యం చేసే వడుగనంబి గొప్ప ఆచార్య నిష్ఠ గలవారు. వారు ఆచార్యులను భగవంతుని కన్నా గొప్పవారిగా భావించారు. సిద్ధాంత చర్చలలో ఆచార్యుల హృదయాన్ని ఆవిష్కరించే జ్ఞానపూర్ణులు శ్రీకూరత్తాళ్వాన్లు. వీరి చరిత్ర, ఆచార్యభక్తి ఎంతో విశేషమైనది. యతిరాజుల సంకల్ప అనుగ్రహంతో దిద్దుబాటు గావించబడి శ్రీరంగనాథ దేవాలయ పరిపాలన బాధ్యత వహించిన వారు తిరువరంగత్త అముదనార్లు. వీరు అత్యంత ఆచార్య నిష్ఠతో ప్రపన్న గాయత్రిగా కీర్తించబడు ఇరామానుజ నూత్తన్దాదిని రచించి గానంచేశారు. యతిరాజులకు నమ్మాళ్వారు లంటే ప్రీతిమెండు. వారి పాదస్థానీయులుగా శ్రీ రామానుజాచార్యుల ను స్తుతిస్తారు. జగదాచార్యులు శ్రీ నమ్మాళ్వారుల పేరు గల కుమారులు తనకు

కావాలని భావించారట! ఒక మహానుభావునికి ఆ దివ్యనామం తిరుక్కురుగూర్‌పిరాన్ పిళ్ళాన్ (ఆళ్వార్ తిరునగరికి ఉపకారం చేసిన వారు అని అర్థం) అను నామకరణం చేసి తన పుత్ర సమానులుగా స్వీకరించారట! వారికి తిరువాయ్‌మొళిని ఉపదేశించి వారిచేత తిరువాయ్‌మొళికి వ్యాఖ్యానాన్ని రాయించారు. కాలక్షేప సమయంలో వారు ఎంతో పరవశించి వినే వారట!

వాదోపవాదాలతో సిద్ధాంత చర్చలతో ఎందరినో దిద్దుబాటు చేసి ప్రపన్నులుగా తీర్చిదిద్దారు శ్రీరామానుజాచార్యులు. అటువంటి వారే యజ్ఞ మూర్తులు వీరు మహాజ్ఞాని. 17 రోజులు యతిరాజులతో వాదోపవాదాలు గావించారు. చివరిరోజున రామానుజాచార్యులు తమ ఆరాధ్యదైవమైన వరదరాజపెరుమాళ్లను ప్రార్థించి వాదానికి ఉపక్రమించారు. కానీ వాదన ప్రారంభం కాకముందే ఆచార్యుల తేజస్సు చూచి చకితులై ఓటమిని ఒప్పుకున్నారట! ముందే చేసుకున్న ఒప్పందం ప్రకారం గెలిచిన వారి నామధేయం ఓడినవారు వహించాలి. వరదరాజ పెరుమాళ్ళను అరుళాళపెరుమాన్ అని పిలుస్తారు. కనుక వారికి అరుళాళప్పెరుమాన్‌ఎమ్బెరుమానార్ అను నామాన్ని అనుగ్రహించారు. ఒకసారి వీరి వద్దకు కొందరు శిష్యులను శ్రీసూక్తి ఉపదేశం కోసం జగదాచార్యులు పంపించారు. వారికి భగవద్ రామానుజాచార్య పాదములే అందరికీ రక్షకం అని ఉపదేశించారు. ఈ విధంగా వేల మందిని తమ సహేతుక వాదనలతో పరివర్తింప చేశారు యతి రాజులు.

శ్రీరామానుజ సంబంధంతో ఎందరో ప్రపన్నులై తరించారు. వారికి ముందు కాలమందలి ఆచార్యులతో కూడా ప్రత్యేక సంబంధం ఉంది. వారు అవతరించక ముందే వారి పూర్వాచార్యులు భవిష్యత్ ఆచార్యులుగా శ్రీరామానుజాచార్యుల అర్చామూర్తిని ఆరాధించి పరంపరగా ఆమూర్తిని కాపాడారు. దివ్యదేశ పెరుమాళ్ళతో యతి రాజులకు గల సంబంధము విశేషమైనది. శ్రీరంగనాథ పెరుమాళ్లతో శిష్య సంబంధాన్ని, శ్రీకంచి వరదరాజ పెరుమాళ్‌లతో పుత్ర

సంబంధాన్ని, తిరునారాయణ పురం శెల్వపిళ్ళై (సంపత్కుమార) పెరుమాళ్ళతో పితృసంబంధాన్ని తిరుమల శ్రీనివాస పెరుమాళ్ళతో ఆచార్య సంబంధాన్ని కలిగిఉన్న విశేషాలను మన పెద్దలు అద్భుతంగా సమన్వయం చేస్తారు. గోదాదేవి మొక్కును తీర్చి ఆండాళ్ తల్లితో సోదరులుగా గోదాగ్రజాయ నమః అనే నామాన్ని పొందారు. ప్రపన్న లోకానికి జ్ఞానాన్ని ప్రబోధించిన ఉపకార ఆచార్యులు ఎందరు ఉన్నప్పటికీ ఉత్తరకాచార్యులు శ్రీభగవద్రామానుజాచార్యులు మాత్రమే! అని పూర్వాచార్యులు నిర్ధారించారు. అందుకే శ్రీరామానుజ సంబంధము పరమోత్కృష్టమైనది. అందుకే ఆచార్య సమాశ్రయణం ఉపదేశములు పొందే ప్రపన్నులకు శ్రీభగవద్ రామానుజాచార్య శరణాగతినే ఉద్బోధిస్తారు. ఆక్రమంలోనే శ్రీరామానుజాచార్యుల తిరువడి  తిరుముడి ఆచార్యులను గురుపరంపరగా స్తుతించడం సంప్రదాయం! సంసారబంధ దుఃఖ నివృత్తికి, భగవదనుగ్రహ ప్రాప్తికి శ్రీరామానుజాచార్యుల సంబంధమే ప్రధానము. అందుకే శ్రీరామానుజ సంబంధాన్ని తెలియజెప్పే శ్రీరామానుజ దాసన్ అనే నామ సంబంధంతో సంప్రదాయ పరులు తరిస్తారు.

# పావన పాదం ప్రయాణ విజయం

జీవితం అనే ప్రయాణంలో మనం వేసే ప్రతి అడుగు ఉన్నతికి సూచిక కావాలి. విజయానికి చేరువ కావాలి. అలాగే ప్రతి ఒక్కరు భౌతికంగా చేసే ప్రయాణం కూడా ఏదో ఒక లక్ష్యం వైపు ఒక అవసరం కోసం సాగుతూ ఉంటుంది. జీవితంలో మన ప్రయాణాలు గమనాన్ని నిర్దేశిస్తాయి. చరిత్రలో పురాణాల్లో మహాపురుషుల జీవిత కథా కథనాలు ప్రయాణాలను మూలం చేసుకునే చరిత్రను సృష్టించాయి. ఆ ప్రయాణాలు యుగపురుషుల జన్మసార్థ్యక్యాన్ని తెలియ జేశాయి. శ్రీరాముని వనవాస ప్రయాణం, మహాభారతంలోని పాండవుల అరణ్య ప్రయాణం మానవులకు జీవిత ధర్మాలను సూచించాయి. ఊర్ధ్వ లోకాల నుండి ఉషః కిరణాలై ఉద్భవించిన మహాను భావులెందరో లోకంలోని అజ్ఞానాన్ని సహస్ర భానుప్రకాషులై పారద్రోలారు. దేశవిదేశాలు పర్యటించి జీవిత సత్యాలను కర్తవ్యాలను ఉద్బోధించారు. ఆవిధంగానే శ్రీరామానుజాచార్యుల జీవన గతిలో కూడా ప్రయాణాలు అత్యంత ప్రధానమైనాయి. వారి జ్ఞానతృష్ణకు ప్రయాణం ఒక పరిష్కార మార్గం అయింది. ఆ ప్రయాణమే జనోద్ధరణకు కారణ భూతమయింది.

భగవద్ రామానుజాచార్య ప్రయాణ ఫలితాలు వేదధర్మ విజయాలు. రామానుజ మార్గం అంటే సమాజంలో సమస్త జనులకూ ఉజ్జీవనమే అందుకే శ్రీరామానుజాచార్యుల పాదం పరమపావనం వారి ప్రయాణం విజయ కారకం అయింది.

భగవదాజ్ఞతో శ్రీ రామానుజాచార్యులు దివ్య పార్థివ దేహంతో భూమిపైకి అవతరించడంతోనే ప్రయాణం ప్రారంభమయ్యింది. 120 సంవత్సరాల జగదాచార్యుల జీవన ప్రయాణం జాతికి ఒక గొప్ప సాంప్రదాయ సిద్ధాంతాన్ని అందించింది. వైదిక ధర్మాచరణమునకు మార్గదర్శనం చేసింది. వారి జీవితం లోని ప్రయాణ విజయాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. మొదటిది జ్ఞాన సముపార్జనకు, ఉపదేశ స్వీకారానికి చేసిన ప్రయాణాలు. రెండవది ఉజ్జీవనా

మార్గాన్ని ఉపదేశించుటకు, ఉద్ధరించుటకు చేసిన ప్రయాణాలు. ప్రథమాంశంలో శ్రీ రామానుజాచార్యుల జ్ఞానతృష్ణ, సంప్రదాయ నిష్ఠ, ఆచార్య నిష్ఠ ప్రస్ఫుటం అవుతాయి.

శ్రీ పెరంబుదూర్ యందు పార్థ సారధి పెరుమాళ్ళ వరప్రసాదియై శ్రీ రామానుజాచార్యులు అవతరించారు. తండ్రి గారు పరమపదించిన తర్వాత విద్యార్జన నిమిత్తం కాంచీపురానికి వెళ్లటంతో మొదటి ప్రయాణం ప్రారంభం అయింది. అక్కడ యాదవప్రకాశుడను గురువు వద్ద వేద విద్యను అభ్యసించడం ప్రారంభించారు. విశేషమైన బ్రహ్మవర్చస్సుతో ప్రకాశించే శ్రీ రామానుజాచార్యుల పావన పాద స్పర్శతో బ్రహ్మరాక్షసి బారినుండి రాజకుమారి రక్షించబడింది. పవిత్రమైన వేద మంత్రాలకు చక్కని భావార్థాలు శ్రీరామానుజులు వివరించేవారు. ఇలా ఎన్నో కారణాల వల్ల అసంతృప్తి కలిగిన గురువు శ్రీ రామానుజాచార్యులకు అపకారం తలపెట్టాడు. కాశీ ప్రయాణానికి ఏర్పాటుచేశాడు. అర్ధరాత్రి మార్గ మధ్యలో వదిలి వెళ్ళిపోయారు. కానీ లోకోపకారంకంగా మలుపు తిరిగిన వారి ప్రయాణం ఇదే!. అడవిలో కంచి వరదరాజ పెరుమాళ్, తాయారు చెంచు దంపతులుగా సాక్షాత్కరించి శ్రీ కంచికి దారి చూపించారు. వారికి శ్రీ రామానుజాచార్యులు చేసిన జల కైంకర్యానికి గుర్తుగా అక్కడి జలాలను నేటికీ పెరుమాళ్ సేవలో ఉపయోగిస్తారు.

శ్రీ కంచిలో శ్రీ తిరుకచ్చినంబి వారి సహకారంతో వరదరాజ పెరుమాళ్ళ నుండి అర్ధషట్కాన్ని అనగా ఆరు వార్తలను స్వీకరించారు. అవి పరతత్వం శ్రీమన్నారాయణుడే', విశిష్ట భేదం జీవాత్మ పరమాత్మలకు ఉన్నది. మోక్షానికి శరణాగతి ప్రధానం నిత్య భగవత్ స్మృతి గలవారికి అంతిమ స్మృతి అవసరం లేదు శరీర అవసానంలో పరమపదం లభిస్తుంది. గురువును ఆశ్రయించాలి. ఈ ఆరు వార్తలతో శ్రీ రామానుజాచార్యులు తన కర్తవ్యాన్ని జీవిత ఆచరణను నిర్ణయించుకున్నారు. యామునాచార్యులు పూర్వాచార్య ఆనతి ననుసరించి భవిష్యత్ ఆచార్యులుగా ముందే శ్రీ రామానుజాచార్యులను నిర్ణయించారు. వారి

వద్దకు తన శిష్యులైన పెరియ నంబి వారిని పంపించారు. ఈ ప్రయాణం మరింత విశేషమైనది. శ్రీ రామానుజాచార్యులు పెరియనంబి వారితో శ్రీరంగానికి బయలుదేరారు. ఆళవందారుల అంతిమ స్థితిలో వారిని చేరిన జగదాచార్యులు ఎంతో చింతించారు. వారి పార్థివదేహమందు చేతి వేళ్ళు ముడిచి ఉండడం చూసి మూడు ప్రతిజ్ఞలు చేసి విడిపించారు. భవిష్యత్ శ్రీరామానుజ సిద్ధాంత స్థాపనకు అప్పుడే నాంది పడింది. తాము పరమపదించినా తన శిష్యులను పంచా చార్యులుగా శ్రీ రామానుజాచార్యులకు ఉపదేశించుటకు నియమించారు.

వరదరాజ పెరుమాళ్ల ఆజ్ఞతో శ్రీపెరియ నంబి వారిని ఆశ్రయించుటకు మరొకసారి శ్రీరంగ క్షేత్రానికి ప్రయాణం అయ్యారు శ్రీరామానుజాచార్యులు. ఈ ప్రయాణం మార్గమధ్యలోనే మధురాంతకం అనే పుణ్య క్షేత్రంలో ఎదురై శ్రీపెరియ నంబి వారు అక్కడే వారికి పంచ సంస్కారాలు గావించారు. తిరిగి శ్రీకంచికి వేంచేసి యతిరాజులు నివాసం ఉండసాగారు. అప్పుడే అత్యంత ప్రధానమైన ప్రయాణం చేయవలసి వచ్చింది. శ్రీ రామానుజాచార్యుల పంచాచార్యులలో ఒకరైన వారు, యామునాచార్యుల కుమారులు తిరువరంగ పెరుమాళ్ అరయర్లు. వీరు తండ్రి గారి మరియు శ్రీరంగనాథ పెరుమాళ్ళ ఆజ్ఞతో శ్రీ కంచికి వచ్చి శ్రీరామానుజాచార్యులను శ్రీరంగ పీఠానికి అధిపతిగా ఆచార్యులుగా ఆహ్వానించారు. తన గానామృతంతో శ్రీకంచి పెరుమాళ్ళను మెప్పించి వారిని తీసుకొని వెళ్ళుటకు ఏర్పాట్లు గావించారు. ప్రపన్న లోకానికి ప్రపత్తి నేర్పిన యతిరాజులు శ్రీరంగ క్షేత్రానికి ప్రయాణం కావడం చరిత్రలో ఒక గొప్ప మైలురాయి. అవైదిక మతాచారాలు, వక్రభాష్యాలు క్షీణించాయి. పరమోత్కృష్టమైన వైదిక ధర్మానికి పునస్థాపన జరిగింది. పరమ భక్తుడు, జ్ఞాని, సిద్ధాంత ప్రవర్తకులయిన శ్రీ రామానుజాచార్యులను ఎంతో మంది శిష్యులు ఆశ్రయించారు. వారి జీవిత చరిత్రలో తిరుకోష్ఠియూరు ప్రయాణం మరింత విశేషమైనది. ఆచార్య ఆజ్ఞతో రామానుజాచార్యులు తిరుకోష్ఠియూరు నంబివారి వద్దకు 18 సార్లు ప్రయాణం చేశారట! వారిని మెప్పించి వారి వద్ద మంత్రరాజమైన అష్టాక్షరీ

మంత్ర, మంత్రార్థాన్ని స్వీకరించి సేవించారు. కానీ ఆ మంత్రంతో అందరూ తరించాలని మంత్రార్థాన్ని శిఖరాన్ని ఎక్కి వెలువరించారట! ఈ ప్రయాణంతో ఒక గొప్ప సంస్కర్తగా వాత్సల్య సంయుతుడైన కృపామాత్ర ప్రసన్నాచార్యుడుగా జగదాచార్యులు ప్రసిద్ధులయ్యారు.

అలాగే యతిరాజుల తిరుమల తిరుపతి ప్రయాణం కూడా ప్రధానమైనదే. శ్రీరామాయణ రహస్యాలను శ్రీతిరుమల నంబి వారి వద్ద సేవించిన వారి జ్ఞాన ప్రకర్ష ఎంతో గొప్పది. శ్రీరామానుజాచార్య చరిత్ర వైభవ సుధ మాధురి లో ప్రయాణ విజయాలు ప్రశస్తమైనది. ద్వితీయ అంశంగా పరిశీలించినట్లయితే కాశ్మీరదేశ ప్రయాణంతో శ్రీభాష్యం ఉదయించింది. మేల్ కోట ప్రయాణంతో సంప్రదాయ పరిరక్షణ. దేవాలయ ఉద్ధరణ. దక్షిణదేశ ప్రయాణ విజయాల వలన దివ్య దేశ వైభవ ప్రకాశము జరిగాయి. ఇంకా వారి ప్రయాణ విజయాల్లో ప్రత్యేకత ఏమంటే... వైదిక ధర్మానుసారంగా "భగవత్ ప్రాప్తికి శరణాగతి చేసే అర్హత సర్వ మానవులకు ఉంది" అనే గొప్ప ఆచారాన్ని నెలకొల్పారు. అందుకే యతిరాజుల పాదం పావనం, ప్రయాణం విజయ కారకం!.

# వాత్సల్యం వరదాయకం

అమృతోపమానమైన మాతృవాత్సల్యం తెలియని వారు ఉండరు. శిశువు అశక్తతకు తాను ఆలంబనగా నిలుస్తుంది. దేహ పోషణను, జీవిత అవసరాన్ని తాను వాత్సల్య మూర్తియై తీర్చుతుంది మాతృదేవత. ఆ శరీరం ధర్మసాధనకు ఉద్దేశింపబడింది! "శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" అని విజ్ఞులు ఆత్మోజ్జీవన మార్గాన్ని మనకు తెలియ పరిచారు. అటువంటి మార్గాన్ని మనకు ఉపదేశించి ఆవరాన్ని ప్రసాదించగల వారు ఆచార్యులు. వారు మనలోని అయోగ్యతను, దోషాలను లెక్కించక జ్ఞానాన్నుపదేశించే పూర్ణులు. అందుకే సాంప్రదాయ వాఙ్మయ వ్యాఖ్యానాల్లో ఆచార్యులను తల్లిగా అభివర్ణిస్తారు. వాత్సల్యం అంటేనే దోషభోగ్యత్వం అనగా దోషాలను లెక్కించక ఉద్ధరించి అనుగ్రహించటం. వత్స అనగా అప్పుడే జన్మించిన లేగ దూడ. ఆ దూడను గోవు మాతృ ప్రేమతో నోటితో శుభ్రపరుస్తుంది. అటువంటి ప్రేమనే వాత్సల్యం అని పెద్దలు నిర్వచించారు.

శ్రీ భగవద్ రామానుజాచార్యులు కూడా వాత్సల్య గుణపూరితులు! శిష్యుల దోషాలను లెక్కించక కరుణాపూర్ణులై వాత్సల్యంతో అందరినీ తరింప చేశారు. వారి వాత్సల్యం సమకాలీన జనోద్ధరణకు మాత్రమే కాదు. ఆచంద్రతారార్కము, ఆసేతుహిమాచల పర్యంతము విస్తరించింది. సిద్ధాంతోపదేశ సుధలను కురిపించింది. రామానుజ దర్శనం భగవత్ ప్రాప్తి మార్గాన్ని అందరికీ దర్శింప చేసింది. భగవంతునిలోని వాత్సల్య గుణాన్ని అనుభవింప చేసింది. శరణాగతి గద్యలో "అపార కారుణ్య సౌశీల్య వాత్సల్య ఔదార్య ఐశ్వర్య సౌందర్య మహోదధే!" అని ప్రార్థించి పరమాత్మలోని కళ్యాణ గుణాలను తాను దర్శించి తెలియ చేశారు. అందుకే "దయైక సింధోః"అని, "విజ్ఞాపనం యదిద మద్యతు మా మకీనం అంగీకురుష్వ యతిరాజ దయాంబురాశే!" అని మణవాళమామునులు యతి రాజ వింశతిలో స్తుతిస్తారు. యతిరాజుల చరిత్ర వైభవంలో అనేక సన్నివేశాలు వారి వాత్సల్య శీలతను వెల్లడిస్తాయి. వారి ముందు ఎవరైనా తప్పు

చేస్తే దానికి  అనేక ఒప్పులు చేసే విధంగా వారిని పరివర్తింప చేశారు. అజ్ఞానంతో అవగాహన లోపంతో ఉన్న శిష్యులెందరినో వారి జ్ఞానం వికసింప చేసేలా అనుగ్రహించారు.

జగదాచార్యుల వాత్సల్యానికి తార్కాణమైన రెండు అంశాలను చూద్దాం!. యజ్ఞమూర్తి అను పండిత శ్రేష్టుడు మహా విద్వాంసుడు. శాస్త్ర జ్ఞానం తెలిసిన విజ్ఞుడు. కాని పూర్వాశ్రమంలో భగవద్రామానుజాచార్యులతో వారికి 17 రోజులు అనర్గళంగా శాస్త్ర  వాదాలు జరిగాయి. 18వ రోజున  జగదాచార్యుల దివ్యవర్చస్సును, జ్ఞాన పరిపూర్ణతను చూచి పరవశులై, శిష్యులుగా మారిపోయారు. భగవద్రామానుజాచార్యులు "అరుళాల పెరుమాళ్ ఎంబెరుమానార్" అను దివ్య నామాన్ని అనుగ్రహించి శిష్యులను గావించు కున్నారు. వారు ఆచార్య నిష్ఠతో ఎన్నో సాంప్రదాయ గ్రంథాలను రచించారు.

అళగియ మణవాళ మాముణులు, సుందర జామాత్రు ముని, రమ్య జామాత్రు ముని, రమ్య జామాత్రు యోగి, వరవరముని, యతీంద్ర ప్రవణర్, కాంతోపయంత్రులు, రామానుజన్ పొన్నడి, సౌమ్య జామాత్రు యోగీంద్రర్, కోయిల్ శెల్వ మణవాళ మాముణులు, మొదలైనవి. వీరికి గల నామ ధేయములు ప్రపన్న గాయత్రిగా ప్రసిద్ధమైన, యతిరాజుల వైభవాన్ని ప్రకాశింప చేసిన, ఇరామానుజ నూత్తందాది కృతికర్త తిరువరంగత్త ఆముదనార్లు. వీరు శ్రీరంగనాథస్వామి దేవాలయంలో కోయిల్ నంబిగా ఆరాధన ఉత్సవ నిర్వహణ అధికారిగా ఉండేవారు. యతి రాజులు అనేక ఆగమోక్త  విధానాలతో శ్రీ రంగనాథ ఆరాధన సేవలను సంస్కరించారు. ఆ సమయంలో తన శిష్యులైన కూరత్తాళ్వాన్ చేత అముదనార్లను దిద్దుబాటు చేయించారు. వారు ఆచార్య నిష్ఠతో యతి రాజులపై ఎంతో భక్తితో, ఆచార్య భక్తి ఫల మాధుర్యాన్ని ,అమృతతుల్యమైన ఇరామానుజనూత్తందాదిగా  గానం చేశారు. జగదాచార్యుల అనుగ్రహాన్ని పొంది, అముదనార్ అను దివ్య నామాన్ని స్వీకరించారు.

ఈ విధంగా అనేకమంది పండితులను, జ్ఞానులనే కాదు అతి సామాన్యులైన

వారిని, స్త్రీలను, ఆర్తి గల శిష్యులను, పామరులను అందరినీ అనుగ్రహించి తరింప చేశారు. శాశ్వతమైన ఆచార్య పరంపరాగతవ్యవస్థను ఏర్పాటు చేశారు. వేదవాఙ్మయ సారానికి  సిద్ధాంత సూత్ర సౌరభాలతో నవరత్నాలు (తొమ్మిది గ్రంథాలు) రచించారు. దయావారాశి అయిన యతి రాజుల వాత్సల్య గుణాన్ని మన పెద్దలు ఎంతో గొప్పగా ప్రస్తుతించి నిరూపించారు.

120 సంవత్సరాలు సుదీర్ఘ జీవితం లోకోద్ధరణ కోసమే కృషిచేసిన యతీంద్రులు తిరిగి యతీంద్ర ప్రవణులుగా శ్రీరంగనాథ క్షేత్రమందే అవతరించారు. భగవద్రామానుజా చార్యులే వాత్సల్యంతో  వరదాయకులై వరవరమునులుగా సాంప్రదాయ ఉద్ధరణకు అవతరించారు. వీరిని వరవరమునులు, అళగియ మణవాళ మామునులు, యతీంద్రప్రవణులు, రమ్యజామాతరం, అని స్తుతిస్తారు. ఎందరో శిష్యులకు అభిమాన పాత్రులైన ఆచార్యులు వీరు. ఆచార్య నిష్ఠ గల అష్టదిగ్గజములు అను పేరుగల శిష్యుల చేత సేవింపబడ్డారు. శ్రీరంగనాథునిచే 'శ్రీశైలేశ దయాపాత్రం' అను తనియతో గురువుగా భావించ బడ్డారు. ఆదిశేషాంశజులైన వీరి చరిత్ర వైభవం పూర్వాచార్యుల వాఙ్మయంలో అద్భుతంగా తెలియజేయబడింది.

ఆళ్వార్ తిరునగరికి, శ్రీరంగ క్షేత్రానికి, దివ్య దేశాలకు, శ్రీరామానుజ దర్శనానికి వీరి వలన పునర్వైభవము కలిగినట్లుగా పెద్దలు చెప్తారు. శ్రీరామానుజ మునులు సాక్షాత్ ఆదిశేషులు అని నిరూపణలు ఉన్నట్టుగానే, మనవాళ మామునులుకూడా శేషాంశజులనుటకు ప్రమాణములు ఉన్నాయి. శఠగోప కొత్తియమ్మ అనే ఆమెకు వీరు ఆదిశేష  స్వరూపముతో దర్శనం ఇచ్చారు. శ్రీరంగనాథునికి ఆలపట్ట కైంకర్యం చేసే ఉత్తమ నంబికి శ్రీ రంగనాథ స్వామియే స్వప్నంలో కనిపించి వీరు ఆదిశేషులని చెప్పినట్లుగా చరిత్ర. మరియు పెద్దలు పూర్వాచార్యులు "యతీంద్ర ప్రవణ స్సాక్షాత్ యతీంద్రో భాష్యకృత్ ధ్రువం" అని ఈ విధంగా నిరూపించారు. వారు రచించిన అనేక సాంప్రదాయ గ్రంథ వ్యాఖ్యానములు, వారుపదేశించిన శ్రీ సూక్తులు, వారు తెలిపిన శాస్త్రార్థములు శ్రీనమ్మాళ్వార్ల  మొదలగు

పూర్వాచార్యులను ప్రకాశింప చేసిన విధము, రామానుజాచార్యులను పోలి ఉంటుంది. వీరి రచనలు మరియు సిద్ధాంత ప్రచారానికి అష్టదిగ్గజాలను (జీయర్లను) ఏర్పాటు చేయుట, దివ్యదేశ అభిమాన దర్శనాదులు, శ్రీరంగ క్షేత్రాన్ని అభివృద్ధి చేయుట, ఇత్యాదులచేత శ్రీమత్ వరవరములు సాక్షాత్ యతిరాజులే అని నిరూపించబడినది. అందుకే “యతివరుల వాత్సల్య ఫలమగు వరమే వరవరమునుల అవతరణము” అని పెద్దల అభిప్రాయము.

# భక్తి భావ ప్రీతి - దివ్య ప్రబంధ ఖ్యాతి

భగవంతుడు సముద్రాన్ని తరచి అమృతాన్ని దేవతలకు ఇచ్చినట్లు ఆళ్వార్లు వేద వేదాంతాలను తరచి దివ్య ప్రబంధాలను పరమ భాగవతోత్తముల కోసం ప్రసాదించారట! ఆళ్వార్లు దివ్య ప్రబంధాలలో భగవంతున్ని "అముదు" "పీయూష సారాం" అని అమృతంగా కీర్తించారు. ఆళ్వార్లు అంటేనే పరమ భక్తి తత్పరులు. భక్తి ఆత్మోజ్జీవనం కలిగిస్తుంది. ప్రాణ శక్తిని ఉద్దీపింప చేస్తుంది. అటువంటి భక్తి మార్గం భారతీయ సంస్కృతికే మూలకందం. ఆళ్వార్ల జ్ఞాన ప్రకర్షలో నుండి ఉద్భవించిన భక్తి భావ మాధుర్యం అత్యంత శక్తివంతమైనది. ఆ భగవత్సాక్షాత్కార శక్తి వారి దివ్య ప్రబంధ వాఙ్మయంలో అక్షరాల్లో, శబ్దాల్లో అణువణువు నిబిడీకృతమై ఉంటుంది. అది ఎంతటి వారినైనా భగవదభిముఖులను చేసి పరవశింప చేస్తుంది. దధిని చిలికి వెన్న తీసినట్టు భగవత్ తత్వాన్ని చిలికి భక్తి మధురిమను ఆళ్వార్లు వెలికి తీస్తే, వెన్నకాచి నెయ్యిని చేసినట్టు పూర్వాచార్యులు భక్తికి అనుష్ఠానాన్ని చేర్చి శ్రీ సంప్రదాయాన్ని మనకు అందించారు. అటువంటి భక్తి భావ నిధి యందలి ప్రీతితో జగదాచార్యులు భగవద్ రామానుజాచార్యులు దివ్య ద్రావిడ ప్రబంధ ఖ్యాతిని ప్రాచుర్యం చేశారు. సమాజంలోని అట్టడుగు స్థాయిల వరకు ఆధ్యాత్మిక సాధనామార్గాన్ని చూపించిన పరమ దయాళువులు శ్రీరామానుజాచార్యులు.

ఆచార్యులైన యామున మునుల వద్ద చేసిన మూడు ప్రతిజ్ఞలలో ఒకటిగా దివ్య ప్రబంధాలను ప్రకాశితం చేశారు. అష్టాంగ యోగ సాధనలనీ, జ్ఞానానుష్ఠానాలనీ క్రియాత్మక ఆచరణముల ద్వారా ఆధ్యాత్మిక సాధన సంపత్తిని సమకూర్చుకుంటున్న వేళ భగవంతుడు అందరివాడు అని, అనన్య భక్తికి వశ పడగల భగవత్ సంబంధాన్ని తెలియజేసింది ఆళ్వార్ల మార్గం. వేద మార్గ ప్రతిష్ఠాపనలో శ్రీ భగవద్రామానుజా చార్యులు ఆళ్వారుల దివ్య ప్రబంధములలోని భక్తి మూలాలనే సిద్ధాంతీకరించారని పెద్దలు చెప్తారు. భగవత్ రామానుజాచార్యులు శిష్య పరంపర ద్వారా దివ్య ద్రావిడ ప్రబంధాలకు ఎన్నో వ్యాఖ్యానాలను రచింప చేశారు. సూత్ర

సిద్ధాంత గ్రంథాలను తానూ రచించారు. చెక్కుచెదరని పూర్వాచార్యకృత సాంప్రదాయ వాఙ్మయ సంపద శాశ్వతంగా నిలిచి ఉంది. రత్నాల మాలవలె మణిప్రవాళ శైలిలో సంస్కృత పదాలతో కూడిన ఆనాటి ప్రాంతీయ ద్రావిడ భాషలో గల వ్యాఖ్యాన గ్రంథాలన్నీ ఆస్తికులకు విలువైన అమృత నిధులు. అంతటి జ్ఞానులైన భగవద్రామానుజాచార్యులు ఆ దివ్య ప్రబంధ మాధురిలో భగవద్గుణానుభవంలో లీనమయ్యేవారు.

భగవద్ రామానుజాచార్యులు గోదాకృతమైన తిరుప్పావై ప్రబంధంపై అమిత ప్రీతి కలిగి ఉండేవారు. పన్నిద్దరాళ్వార్లలో ఒకరైన గోదాదేవి మొక్కును తాను తీర్చుటకు 100 గంగాళాల పాయసాన్ని భగవంతునికి సమర్పించారట! గోదాగ్రజులని జగదాచార్యుల నామము.

గోపికాతత్వాన్ని తన యందు ఆపాదించు కున్న గోదాదేవి శ్రీకృష్ణునితో ఉన్న నీళాదేవిని "ఉందు మదగళిత్త" అను పాశురంలో తలుపు తెరవమని ప్రార్థిస్తుంది. ఆ పాశురాన్ని అనుసంధిస్తూ యతి రాజులు ఒక ఇంటి ముందు నిలిచి ఉండగా ఆ ఇంటి తలుపు తెరుచుకొని ఒక స్త్రీ బయటకు వచ్చింది. ఆమె చేతి కంకణాల సవ్వడి విని భక్తి పరవశంతో సాష్టాంగ పడ్డారట! ఆ స్త్రీ వణికి పోయి తత్తర పడింది. ఆమె జగదాచార్యుల గురువుగారి పుత్రిక. ఆ పాశురం లో "శీరార్ వళై ఒళిప్ప వందు" అనగా అందమైన కంకణములు ధ్వనించినట్లుగా తలుపు తెరువు అనే భావం ఉంటుంది. ఆ భావ తాదాత్మ్యంలో భక్తి పరవశులైనారు జగదాచార్యులు. ఈ దృశ్యాన్ని చూచి యతిరాజులను వారి ఆచార్యులైన పెరియనంబి గారు పులకిత గాత్రులై "తిరుప్పావై జీయరే" అని పలికారట!. భక్తవశుడు భగవంతుడు అని, "మంత్రాదీనంతు దైవతం" అని పెద్దల మాట! అటువంటి భక్తి పూర్ణమైన మంత్రాలు దివ్య ప్రబంధాలు.

భగవద్రామానుజాచార్యుల సంస్కరణలలో ప్రధానమైనది దేవాలయ వ్యవస్థ. ఆళ్వార్ల భక్తి ప్రబంధాలలోనూ వివిధ దివ్యదేశ అర్చామూర్తులు స్తుతించబడ్డారు. జగదాచార్యులు దివ్యదేశ విజయ యాత్రలు చేస్తూ ఒకసారి ఆళ్వారు తిరునగరికి వచ్చారట! శ్రీనమ్మాళ్వార్లను, ఆదినాథ పెరుమాళ్లను సేవించి, తామ్రపర్ణి నది దాటి

నవ తిరుపతులలో "తిరుప్పళింగుడి" కి బయలుదేరారు. మార్గ మధ్యలో వారికి ఒక బాలిక కనిపించింది. యతిరాజులు ఆమెను "తిరుప్పళింగుడి" దారి ఎటువైపు? అని అడిగారు. ఆమె యతిరాజులను చూచి మీకు తిరువాయిమొళి వచ్చా? రాదా? అని ప్రశ్నించిందట! ఆశ్చర్యపోయిన యతిరాజులు ఎందుకని అడగగా ఆ బాలిక "కూవుదళే మేళి" అను (9వ 10 లో రెండవ తిరువాయిమొళి పదవ) పాశురం చదివి ఆళ్వార్ తిరునగరికి కూత వేటు దూరంలోనే ఉంటుంది.అని సమాధానం ఇచ్చిందట! యతిరాజులు ఆ బాలికను చూసి ఎంతో సంతోషించారు. శ్రీ నమ్మాళ్ళవార్లపై ప్రీతితో తన శిష్యులలో ఒకరికి తిరుక్కురుగై పిరాన్ పిళ్ళాన్  అనే పేరు ఉంచి వారిని పుత్రులుగా చూసుకునేవారు. వారికే తిరువాయి మొళిని స్వయంగా ఆకళించుకున్న ఆ బాలికనిచ్చి తల్లిదండ్రుల అనుమతితో వివాహం జరిపించారు.

శ్రీ యామునాచార్యులు పరమపదించేటప్పుడు తెలిపిన మూడు కోరికల్లోని దివ్య ద్రావిడ ప్రబంధాల కీర్తిని ప్రాచుర్యము చేయటము అనే  ప్రతిజ్ఞ శ్రీ రామానుజాచార్యులు చేయటం కూడా ఒక విశేషము.ఆచార్య ఆజ్ఞానుసారము ద్రావిడ వేద ప్రాచుర్యము గావించి ఉభయ వేదాంత ప్రవర్తకులైనారు. శ్రీరంగం మొదలు కాగల దివ్య దేశాలలో ద్రావిడ వేద పారాయణం, అరయర్ సేవలు, అధ్యయనోత్సవాలు మొదలగు అనేక ఆరాధన కైంకర్యాలను దివ్య ద్రావిడ ప్రబంధ గానములతో ఏర్పాటు చేయించారు. శ్రీ వైష్ణవ సిద్ధాంతము అంటేనే ఉభయ వేదాంత ప్రవర్తకము. శ్రీ రామానుజ మార్గం అంటేనే భక్తి శరణాగతి ఆళ్వారాచార్యుల శ్రీ సూక్తి అనుసరణము అని ప్రశస్తం కావించారు. స్వయంగా భగవద్రామానుజాచార్యులు కూడా...

భగవద్రామానుజాచార్యులు  దివ్య ద్రావిడ ప్రబంధ భక్తి భావామృతంలో ఓల లాడారు. ఉభయ వేదాంత ప్రవర్తకులై దివ్య ప్రబంధ ఖ్యాతినీ ప్రాచుర్యం చేశారు.

# శరీరశుద్ధి - జ్ఞానసిద్ధి

"భగవంతుడు" అంటే ఎవరు అనే ప్రశ్నకు షాడ్ గుణ్య పూర్ణుడనే నిర్వచనాన్ని, వివరణను పెద్దలు చెప్తారు. జ్ఞాన, ఐశ్వర్య, బల, వీర్య, తేజస్, శక్తి పరిపూర్ణుడని భావం. "ఏకో నారాయణః న ద్వితియోస్తి కశ్చిత్" భగవంతునికి "ఏకః" అనే లక్షణం కూడా ప్రధానమైనది. అనగా అందరిలోకి ఒక్కడే పరమాత్ముడు అని మాత్రమే కాకుండా అందరికీ ఒక్కడే అనేది ముఖ్య లక్షణం! అందరూ ఆశ్రయించ తగినవాడు భగవంతుడు ఒక్కడే కనుక అందరిపైనా సమస్తము పైన సమదృష్టి కలిగే ఉంటాడు. "ఏక విజ్ఞానేన సర్వజ్ఞానం" అన్నట్టు జగత్కారణుడైన సర్వేశ్వరుడు ఒక్కడే! శ్రియపతికి సమస్తానికి శరీర శరీరి భావ సంబంధాన్ని వారు తెలియచేసారు. మరియు భగవత్ సృష్టి అంతా సత్యమే అని నిరూపిస్తూ నవనిధుల వంటి గ్రంథాలను శ్రీ రామానుజాచార్యులు రచించారు. అందులో నాయక మణి "శ్రీభాష్యం" గ్రంథం. తర్వాతి ఆచార్యులు ఆ గ్రంథాలను ప్రకాశింప చేసే దివ్య జ్యోతుల వంటి వ్యాఖ్యాన ప్రకాశికా గ్రంథాలను రచించారు.

పరబ్రహ్మాన్ని ప్రకాశింప చేసిన వ్యాసభగవానుని వలె పరతత్వాన్ని నిరూపించి సిద్ధాంతీకరించినందున శ్రీరామానుజాచార్యులు భగవద్రామానుజాచార్యులుగా సంభావింపబడ్డారు. పూర్వాచార్యులచే భవిష్యదాచార్యులుగా ముందే సంకల్పం చేయబడి భగవద్రామానుయాచార్యులుగా కీర్తించబడ్డారు. భగవంతుని దృష్టిలో అందరూ సమానమే అన్న సమవర్తిత్వం శ్రీభగవద్రామానుజాచార్యుల ఆచరణలోనూ ఉన్నది. సమవర్తి అయి సంచరిస్తూ జగత్తునంతటిని ప్రకాశింప చేసిన సూర్య భగవానునితో సమానంగా జ్ఞాన సూర్యులై ప్రబోధించిన భగవద్రామానుజాచార్యులను "రామానుజ దివాకరః" అని పెద్దలు సమన్వయం చేస్తారు. అలాగే సూర్య భగవానునికి వేదానికి సామ్యాన్ని వేదమే తెలుపుతుంది. ప్రతిరోజు మూడు కాలాల్లో సూర్య భగవానుడు మూడు వేదాలతో సంచరిస్తాడట! అట్లే "ఆదిత్యోవా ఏష తన్మండలం తపతి. సైషా త్రయ్యేవ విద్యా తపతి" వేదమే ఆదిత్య మండలమై ప్రకాశిస్తున్నదట! ఉభయ వేదాంత సార జ్ఞాన పూర్ణులైన భగవద్రామానుజాచార్యులు సత్య నిరూపణం చేశారు. "ఆచార్యవాన్ పురుషో వేద"

అన్నట్లుగా ఆచార్యులు గలవారే సత్యాన్ని తెలుసుకోగలుగుతారు. ఆ ఆచార్యులు, పరమాచార్యులు, భగవద్రామానుజాచార్యులే! సర్వేశ్వరుడైన భగవంతుడు, సర్వసాక్షి అయిన సూర్యుడు, సర్వోత్కృష్టమైన వేదము, సర్వజ్ఞత్వం గల జగదాచార్యులు సమవర్తులే! భగవద్రామానుజాచార్యుల దృష్టిలో సమత్వ భావము ఎంతో గొప్పది. శరీర సంబంధ వర్ణ సంబంధ వివక్షతలు లేనిది. శరీర శుద్ధి కంటే జ్ఞాన స్ఫూర్తి కి ప్రాధాన్యమిచ్చే వారి తాత్విక విశ్లేషణ చాలా గొప్పది.వారి చరిత్ర వైభవంలో అనేక సన్నివేశాలలో వారి భావ స్ఫూర్తి పులకాంకురాలు కలిగిస్తుంది.

ఒకసారి ధనుర్దాసుడనే మల్లుడు, అతని భార్య అయిన హేమాంబ శ్రీ రంగనాథ స్వామి ఉత్సవ దర్శనానికి వచ్చారు. ధనుర్దాసు తన భార్య నేత్ర సౌందర్యం పై ప్రీతితో చేసే వింత చేష్టలను యతిరాజులు పరిశీలించారు. అతనిలోని హృదయ సున్నితత్వానికి సౌందర్యారాధనకు యతిరాజులు స్పందించారు. సౌందర్య సౌగంధ్య సౌకుమార్య అనంత కళ్యాణ గుణనిధి అయిన శ్రియఃపతి సౌందర్యారాధనకు ధనుర్దాసులో ప్రేరణ కలిగించాలని సంకల్పించారు. వెంటనే ధనుర్దాసుతో సంభాషించి, ఒప్పించి శ్రీ రంగనాథుని గొప్ప నేత్ర సౌందర్యాన్ని చూపించారు. తీర్థ మహిమతో అతన్ని భగవత్ అభిముఖునిగా చేశారు. పవిత్రమైన సౌందర్య తృష్ణకు పరాకాష్ట భగవద్భక్తి అనే సత్యాన్ని తెలియపరిచారు. ధనుర్దాసు మార్గంలో హేమాంబ కూడా జగదాచార్యులను ఆశ్రయించింది. కాచిన బంగారానికి స్వచ్ఛత ఎక్కువ అన్న రీతిగా ఆ దంపతుల పరిపక్వతను సందర్భానుసారంగా లోకానికి వెల్లడి చేశారు.

నిత్యం కావేరి నదిలో స్నానం చేయుటకు వెళ్లి వచ్చే జగదాచార్యులు వెళ్లేటప్పుడు శిష్యులైన మొదలియాండాన్ చేయి పట్టుకుని వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు ధనుర్దాసు చేయి పట్టుకుని వచ్చేవారట! ఇది చూసి ఎందరో ఆశ్చర్యపోయారు. "కాయ శుద్ధి వైలక్షణ్య విమర్శ"లో ( పుట్టుక లో జ్ఞానము లో ఏది గొప్ప) జన్మశుద్ధి కంటే జ్ఞాన శుద్ధి ప్రధానమైనదని వారు శిష్యులకు నిరూపించి చూపారు. "విద్య, ధన, అభిజన గర్వం వదిలిన వారే సత్పురుషులు వారు ఆకారత్రయ సంపన్నులైతే (భగవంతునికే చెందినవారము. భగవంతుని అధీనంలో ఉన్నవారము భగవంతుడు తప్ప మరో ఆశ్రయం లేనివారమనే భావము) ప్రపన్నులు". కేవలము శరీర శుద్ధియందే

ప్రాధాన్య దృష్టి గల వైష్ణవ స్వాములకు ధనుర్దాసు గొప్పతనాన్ని తెలియచెప్పుటకు యతి రాజులు ఒక సన్నివేశాన్ని కల్పించారు.

స్వాములందరూ ధరించు కాషాయ వస్త్రాలను వారు చూడకుండా చిన్నచిన్న ముక్కలుగా చింపి పెట్టమని తన ఆంతరంగిక శిష్యుడికి ఆజ్ఞాపించారు. అతను అట్లే చేశాడు. వైష్ణవ స్వాములు ఎవరు చింపారో తెలియక వాదోపవాదాలు చేస్తూ ఒకరినొకరు నిందించుకున్నారు. పరిపక్వత లేని ఆ స్వాములకు ధనుర్దాసు దంపతుల జ్ఞాన శుద్ధి గొప్పతనాన్ని తెలియజేయాలనుకున్నారు. కొందరు శిష్యులను ధనుర్దాసు ఇంటిలో దొంగతనానికి పంపించారట! వారు ధనుర్దాసు ఇంటికి వెళ్లి ఒకవైపు మలిగి నిద్రిస్తున్న హేమాంబ పైన గల నగలను తీసుకున్నారు. కానీ వచ్చిన వైష్ణవ స్వాములకు మరోవైపు తాను ధరించిన నగలను తీసుకొనుటకు సహకరించాలని ఆమె మరోవైపు తిరిగింది. ఆమె మేల్కొన్నదని భావించి వారు భయపడి పారిపోయారు. ఈ విషయం తెలిసిన ధనుర్దాసు హేమాంబ పైన దోషం మోపి వారి స్వాతంత్ర్యాన్ని భంగం చేశావు! అని కోపించి నిందించాడట! వస్త్రాల కోసం గొడవ పడిన స్వాములకు విలువైన నగలు పోయినా చలించని ధనుర్దాసు గొప్పతనాన్ని జ్ఞానస్ఫూర్తిని యతిరాజులు లోకానికి తెలియజేశారు.

శ్రీభగవద్రామానుజాచార్యులు దయార్ద్ర హృదయులు. ఎంతోమంది శిష్యులతో సేవింపబడుతూ ఉండేవారు. ఒకరోజు వీధిలో తిరిగే అర్భకుడైన మూగవానిని చూచి వర్ణాశ్రమ విభేదాలు లేకుండా దయతో లోపలికి పిలిచి ఆచార్య చరణాలే రక్షకము అని ఉపదేశించి అనుగ్రహించారట!

ఆచార్యనిష్ఠ గల భాగవతోత్తముడు మార్నేర్ నంబి పరమపదించగా శ్రీ రామానుజాచార్యుల ఆచార్యులైన పెరియనంబిగారు వర్ణభేదాన్ని లెక్కించక అంత్యసంస్కారాన్ని చేశారు. దానిని ఎందరో దోషంగా భావించినా విశేష ధర్మంగా భావించి జగదాచార్యులు సమర్థించారు. నేటి సామాజిక సంస్కరణలకు ఆనాడే భగవద్రామానుజాచార్యులు పునాది వేశారు.

"శరీరశుద్ధి, జ్ఞానసిద్ధి" ధర్మానుసరణ అను ప్రవర్తన రీతుల్లో మానవులకు ఏది ప్రధానమో ప్రబోధించారు.

# విరోధి పరిహారణ

కర్తవ్యపాలనలో ధర్మవర్తనలో ఆధ్యాత్మిక సాధనలో విరోధి పరిహారం జరిగినప్పుడే అవి సక్రమంగా సాగుతాయి. ఫలవంతం అవుతాయి. శ్రీ సాంప్రదాయంలో భగవత్ ప్రాప్తి సాధనకు విరోధి పరిహారణ ప్రధానమైనది. అనగా కార్య సాధనలోని అడ్డంకులను తెలుసుకొని తొలగించటం. లౌకిక జీవనంలో కూడా అడ్డంకులను తొలగించుకుంటూ సాగినప్పుడే లక్ష్యాన్ని సాధించడం సుగమము అవుతుంది. సమాజ హితం కోసం మన ఆచార్యులు పెద్దలు చేసిన కృషిని శ్లాఘించడం ఎవరికి సాధ్యం! ఆ మార్గంలో వారు ప్రాణాపాయ స్థితిని ఎదుర్కొన్న సంఘటనలు కూడా మనం పూర్వాచార్యుల చరిత్రల్లో గమనించవచ్చు. సిద్ధాంత స్థాపనలో, పరిరక్షణలో శ్రీ భగవత్ రామానుజాచార్యులు ఎదుర్కొన్న అడ్డంకులు, వాటిని పరిష్కరించిన విధానము ఆశ్చర్యచకితులను గావిస్తుంది. సంఘాన్ని సంస్కరించిన విధం, సమాజ ఉజ్జీవనానికి వారనుసరించిన విధానం ఎంతో గొప్పవి.

ప్రపన్న జీవన మార్గంలో ఎదుర్కొనే విరోధాలను గురించి అడగగా శిష్యులైన వంగి పురత్తు నంబికి జగదాచార్యులు ఉపదేశించారు. వారనుగ్రహించిన 83 అవరోధములను గురించి “విరోధి పరిహారంగళ్” అని పేరు గల గ్రంథాన్ని ద్రావిడ భాషలో రచించారు. గొప్ప ఆచార్య నిష్ఠ గల వీరిని పూర్వాచార్యులు “ఆప్తతమర్” అని కీర్తించారు. శ్రీ పిళ్ళ లోకాచార్యులు కూడా సాంప్రదాయ గ్రంథాలైన అష్టాదశ రహస్యాలలో “అర్థ పంచకం”లో కూడా విరోధిస్వరూపాన్ని తెలిపారు.

“శ్రేయాంసి బహు విఘ్నాని భవంతి మహాతామపి” అని పెద్దల సూక్తి పండిన వృక్షానికే రాతి దెబ్బలని లౌకిక సామెత కూడా ఉంది ఇది సర్వత్ర అన్ని యుగాల్లోనూ కనిపించేదే! అడ్డంకులను తొలగించుకునే ధైర్యం,నిర్ణయ శక్తి కలగటానికి అనుసరించ తగిన రెండు మార్గాలను పెద్దలు చెప్తారు. ఒకటి పెద్దల ఆచార్యుల శ్రీ సూక్తులను వినటం. రెండవది అన్ని విరోధాలు పరిహరించి లోక కళ్యాణానికి కృషిచేసిన మహనీయుల చరిత్ర వైభవాలను తెలుసుకోవటం.

సాక్షాత్ ఆదిశేషాంశ సంభూతులై అవతరించిననూ సమస్త జనుల ఉద్ధరణలో జగదాచార్యులు ఎదుర్కొన్న అడ్డంకులను గురించి వారి చరిత్ర వైభవంలో మనం తెలుసుకోవచ్చును. ఆదిశేషులు అంటే నిత్య సూరులలో, శ్రియః పతి పరివారంలో ప్రధానులు. "నివాస శయ్యాసన పాదుకాంశుకోపధాన వర్షాతప వారణాదిభిః" అని భగవంతునికి అన్నిసేవలూ చేయగల శేష భూతులు. ఆదిశేషులు. ఆ ఆది శేషావతార మయిన శ్రీభగవద్రామానుజాచార్యులు వారి జీవనమార్గంలో అవరోధాలను ఎదుర్కొన్నారు దివ్యమంగళ స్వరూపులైన శ్రీరామానుజా చార్యుల శ్రీపాద తీర్థం చేత, కరస్పర్శ చేత, కరుణాకటాక్షముల చేత, మధురవాక్కుల చేత ఉద్ధరింపబడిన వారు ఎందరో ఉన్నారు. వారి జీవిత గమనంలోని కొన్ని సంఘటనలను తెలుసుకుందాము.

స్వార్థంతో వక్రమార్గంలో నడిచే కొందరికి జగదాచార్యుల కర్తవ్యనిష్ఠ గిట్టలేదు. అర్చకులై ఉండి కూడా ఘోర ఆపదను తలపెట్టి విష తీర్థాన్ని ఇచ్చారు. విషమిశ్రిత తీర్థాన్ని స్వీకరించినా కూడా వారికి. ప్రమాదం కలగలేదు. మరొకసారి భర్త ఆజ్ఞతో ఒక బ్రాహ్మణ గృహిణి విషం కలిపిన భిక్షను ఇయ్యటానికి సిద్ధపడింది. ఆమె తత్తర పాటును గమనించిన ఉడయవర్లు సూక్ష్మగ్రాహులై ఆ భిక్షను కావేరి లో విసర్జించారు.

చిన్ననాడే అసూయపరుడైన గురువుగారి చేత ప్రయాణంలో నట్టడవిలో వదిలివేయబడ్డారు. వరదరాజ పెరుమాళ్ళ అనుగ్రహంతో తిరిగి శ్రీకంచిని చేరుకున్నారు. ఒక రాజకుమార్తె పైగల బ్రహ్మరాక్షసి శ్రీరామానుజాచార్యులకు లొంగి వెళ్ళిపోవటం, వేదమంత్రాలకు వారు చెప్పే దివ్య అర్థాలను విని జీర్ణించుకోలేక, యాదవప్రకాశుడు ఒక ప్రయాణాన్ని ఏర్పాటు చేసి పెద్ద కీకారణ్యంలో శ్రీరామానుజాచార్యులను ఒంటరిగా వదిలి వేశాడు. చెంచు దంపతుల రూపంలో శ్రీకంచిపెరుమాళ్ తాయారు అనుగ్రహించి కాపాడారు. కానీ చివరికి తల్లిగారి ఆజ్ఞతో యాదవప్రకాశుడు గోవింద దాసుడనే నామాన్ని స్వీకరించి శిష్యులయిన రామానుజాచార్యులకే శిష్యులైనారు.

వేల మంది జైనులు వారి అమృతవాక్సుధకు దాసోహం అయినారు. పరమ భక్తుడు సింహగిరి కృష్ణమార్య కవి పరుష వాగ్ధాటిని మానిపించి దిద్దుబాటు

చేశారు. స్త్రీ నయన సౌందర్యారాధకుడయిన ధనుర్దాసును పుండరీకాక్షుడైన పెరియ పెరుమాళ్ నేత్ర సౌందర్యానికి దాసుని గావించారు. సర్వ శాస్త్ర పారంగతులు. జ్ఞానప్రకర్షులైన యజ్ఞమూర్తి అను మహా పండితునితో సిద్ధాంత చర్చకు ఉడయవర్లు ఉపక్రమించారు. 17 రోజులు నిరాటంకంగా సిద్ధాంత చర్చలు జరిగాయి. ఆ సంధర్భంలో జగదాచార్యులకు కొంత సంకోచం కలిగింది. భగవత్ శరణాగతి చేస్తూ అవ్యాహత మైన. యధార్థమైన శ్రీ సిద్ధాంతాన్ని నీవే కాపాడమని ప్రార్థించారు. అప్పుడు సిద్ధాంతరత్న దృఢత్వ నిరూపణానికే సరియగు విద్వాంసునితో వాదం కల్పించానని భగవంతుడు సూచన చేశాడట! మరునాడు పండిత సభలో ఒకే మాటతో జ్ఞాన మూర్తులైన యజ్ఞమూర్తి తానోడి యతి రాజుల పాదపద్మములపై పడి శరణువేడారు. 'అరుళాళ పెరుమాళెంబెరుమానార్' అను నామం స్వీకరించి, ఉపదేశం పొంది త్రిదండాన్ని ధరించారు.

యతిరాజులు తన భక్తురాలగు పరుత్తికొల్లినాచ్చియార్‌ను రక్షించారు. శ్రీపాద తీర్థప్రసాదాలు ఇచ్చి ఆమెను మోహించిన వర్తకుని పరివర్తనం గావించారు. ఆనాటి చోళరాజు క్రిమి కంఠుని వంటి దుష్ట రాజుల చేష్టలను కూడా వారు అధిగమించారు. నాలూరాన్ అను మంత్రి సలహాతో శ్రీరామానుజాచార్యులను బంధించి శిక్షించదలచిన చోళ రాజు యొక్క వికృతమైన శిక్షల నుండి తప్పించుకున్నారు. సుదీర్ఘకాలం శ్రీరంగ క్షేత్రాన్ని వదిలి మేల్కోటలో నివసించారు. మేల్కోట నివాస సమయంలో కూడా వ్యయ ప్రయాసల కోర్చి ఢిల్లీ నవాబుల వద్ద నుండి సంపత్ కుమార పెరుమాళ్లను భక్తితో తెచ్చి తిరునారాయణా పురమందు ప్రతిష్ఠింప చేశారు. తిరుమలలో జగదాచార్యులు చేసిన ఉద్ధరణ జగద్విఖ్యాతము. ఎక్కడ ఉన్నా సంస్కరణ, సమాజ ఉద్ధరణ లక్ష్యంగా జీవితాన్ని కొనసాగించారు. రామానుజాచార్యులు మృదు హృదయులు. మధుర వాక్ ధురీణులు. వారు వివేకం, సర్వజ్ఞత్వం, భగవద్భక్తి ఇటువంటి కళ్యాణ గుణాలతో విరోధి విషయాల పరిహరణం గావించారు. భక్తుల అడ్డంకులు తొలగించారు. విరోధి పరిహార మార్గాలను తెలిపే శ్రీ సూక్తులను అనుగ్రహించారు.

# ఆనందము మోక్షకందము రామానుజార్య సంబంధము

భగవంతుని పంచావతారాల్లో చేతనునికి ప్రత్యక్ష సంబంధం కలిగిన స్వరూపము అర్చావతారమే! వేద శబ్దోచ్చారణచే ఆగమాది దివ్య శాస్త్రవిహిత ఆచరణల చేత సంపద్యతను పొందిన దివ్యస్థానము. శాస్త్రము అంటే సర్వకాల సర్వావస్థల యందు, సమస్త ప్రదేశములందు, సర్వహితమైన ఆచరణా విధివిధానాలను తెలిపేదే శాస్త్రం. ప్రమాణ పూర్వకము, హేతుబద్ధము అయిందే శాస్త్రము. శ్రీపాంచరాత్రాగమాన్ని, శ్రీమద్భగవద్గీతను గొప్ప శాస్త్రాలుగా పెద్దలు అభివర్ణించారు. శాస్త్రాలు అంటే వేద వేదాంగ సారభూతాలే అని పెద్దల మాట! అటువంటి శాస్త్రసారంగా సముద్భవించినదే రామానుజ మార్గం. అది ఆనందదాయకము మోక్షప్రదము కూడా!

భగవత్ స్వరూపమైన అర్చామూర్తులకు మూలము శ్రీ రంగనాథ స్వామి. అలాగే దివ్యదేశ మూలకందాలుగా కోయిల్ (శ్రీరంగము), తిరుమలై, పెరుమాళ్ కోయిల్ (శ్రీ కంచి), తిరునారాయణ పురం నాలుగు దివ్య దేశాలను పేర్కొంటారు. ఈ క్షేత్రాలు శ్రీరామానుజాచార్యుల జీవితంలో కూడా మూలకందాలైన త్యాగ (శ్రీ కంచి), భోగ (శ్రీరంగం), పుష్ప (తిరుమల), జ్ఞాన (తిరునారాయణపురం) మండపాలుగా ప్రసిద్ధి చెందాయి.

అన్ని దివ్యదేశ పెరుమాళ్ళు రాత్రివేళ శ్రీరంగాన్ని చేరుకుంటారని, అర్చా స్వరూపంలో ఉన్న భగవంతునికి బీజము శ్రీ రంగనాథ పెరుమాళ్లే అని మన ఆళ్వార్లు స్తుతిస్తారు. భగవదవతార వైభవాన్ని చేతనునికి భగవంతునికి గల సంబంధాన్ని భగవద్ ఆరాధన చేసే విధివిధానాలను తెలియజేసేది శ్రీ పాంచరాత్రాగమం. సాక్షాద్భగవంతుని వాక్కుగా తెలుపబడేది గీతా శాస్త్రము. ఇవి వేద ప్రామాణికంగా విశిష్టాద్వైత తత్వ ప్రాధాన్యంగా రామానుజ మార్గంలో నిరూపించబడ్డాయి. మోక్షదాయకముగా శ్రీ భగవద్రామానుజ శ్రీ సూక్తులు మార్గదర్శనంగావిస్తాయి.

ద్రావిడ వేద సారముగా సంపన్నవంతమైన శ్రీరామానుజ మార్గము జీవనానందాన్ని కలిగిస్తూ మోక్షకందమైనదై వ్యాపించినది. "ఏకవిజ్ఞానేన సర్వజ్ఞానం" అని పరమాత్మ తత్వాన్ని నిరూపించి భగవత్ కల్యాణ గుణానుభవాన్ని ఆనందదాయకంగా వివరించిన గొప్ప సాంప్రదాయాన్ని జగదాచార్యులు మనకు ప్రసాదించారు.

అందుకే శ్రీ రామానుజార్య సంబంధము జీవనానంద దాయకము మోక్షమార్గ ప్రేరకము అని పెద్దలచే కీర్తించబడుచున్నది. విశాల భావం, విస్తృత లక్ష్యం కలిగినదని నిరూపించబడినది. యతి రాజుల జీవన గమనంలో ఎన్నో సన్నివేశాలు మనను ఆశ్చర్యానికి గురిచేస్తాయి.

చోళరాజు దారుణ దుశ్చర్యలకు పూనుకొని శ్రీ రామానుజ మార్గానికి జగదాచార్యులకు కీడు తల పెట్టాడు. చోళరాజు దుర్మార్గము వలన శ్రీవైష్ణవశ్రీ సంపద్యతకు భంగం కలగరాదని వారు శిష్యులతో కలిసి మేల్కోట వైపు అడవి మార్గంగా బయలుదేరారు. రాజభటుల దృష్టికి చిక్కకుండా కాషాయ త్రిదండాదులను భావనలో ధరించి భౌతికంగా సాధారణ వస్త్రధారణతో ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో ఎందరో శిష్యులను అనుగ్రహించారు. తిరునారాయణ పురానికి చేరుకొని అక్కడ ఎంతో మందిని పరివర్తన గావించారు

తిరిగి చాలా కాలం తర్వాత క్రిమికంఠుడు నశించి, పరిస్థితులు చక్కబడ్డాయని తెలుసుకుని శ్రీరంగానికి చేరుకున్నారు. శ్రీరంగనాథ కైంకర్య దర్శనాలకు దూరంగా ఉండలేని ప్రేమాతిశయంగల పరమాచార్యులు పెరియ పెరుమాళ్ళ విరహంతో తపించి పోయారు. ఆ శ్రీరంగనాథుని సన్నిధికి చేరిన క్షణాలు! వారి చరిత్రలో ఉద్వేగపూరితాలు! సుదీర్ఘ కాలం తర్వాత ప్రాణ సమానమైన శ్రీరంగనాథుని ప్రియ శిష్యులైన శ్రీ కురేశులను చూసిన క్షణాలు అశ్రుపూరిత నయనాలతో వారి హృదయం ఆర్ద్రతను పొందింది. ఆచార్య నిష్ఠతో యతిరాజులకు బదులుగా చోళరాజు ఆస్థానానికి తాను వెళ్లి సాంప్రదాయ రక్షణలో నేత్రాలను పోగొట్టుకున్నారు శ్రీకూరేశులు. సమాజహితానికి, సాంప్రదాయ రక్షణకు కర్తవ్య నిష్ఠతో జీవించే జగదాచార్యులకు కూడా నేత్రహీనులైన శిష్యుని చూసి హృదయం ద్రవించింది. ఆచార్యులైన పెరియనంబిని కోల్పోయానని తెలిసి చింతించారు. శ్రీ

కురేశుల దరికి చేరి, అనునయించి, "పేరరుళాల్" అని దయానిధిగా ప్రసిద్ధమైన కంచి పెరుమాళ్లను నేత్రాల కొరకై ప్రార్థించమన్నారు. ఆచార్య ఆజ్ఞతో కూరేశులు వరదరాజస్తవంతో ప్రార్థించారు. ఆచార్యులు పురమాయించగా పంచస్తవాలను కూడా రచించారు. వరదరాజస్వామి కృపతో భగవంతుని, ఆచార్యులను దర్శించగలిగే జ్ఞాన నేత్రాలను వారు పొందారు.

వరదరాజస్వామి ఏ వరాన్నైనా అనుగ్రహించుటకు సిద్ధంగా ఉన్నాడు. అయినా కూరేశులు చోళరాజును దుశ్చర్యలకు పురికొల్పిన మంత్రి నాలూరాన్లకు మోక్షాన్ని ప్రసాదించమని ప్రార్థించారు. కరుణించిన వరదరాజస్వామి సంబంధ సంబంధీకులందరికీ మోక్షాన్ని ప్రసాదించారట. ఆ విధంగా శ్రీసాంప్రదాయాన్ని అనుసరించే శ్రీరామానుజార్య సంబంధీకులు అందరికీ మోక్షమే! అట్లే ఆలయ గోపురమునెక్కి సర్వులకు మంత్రార్థాన్ని ఉపదేశించి మణి మంటప మార్గదాయిగా యతి రాజులు స్తుతించబడ్డారు. భూమిపై అవతరించక ముందే ఆదిశేషులుగా భగవంతునిచే ఆజ్ఞాపింపబడి ఉభయ విభూతి నాయకత్వం పొందారని కూడా పెద్దలు ప్రస్తుతిస్తారు. అనగా ఇహలోక ఆనందాన్ని, మోక్షాన్ని కూడా శ్రీరామానుజాచార్య సంబంధంతోనే పొందగలము అని సుస్పష్టము. 'శ్రీ రామానుజ మార్గమందు' మందు మరొక గొప్పవిశేషం ఉంది. భగవంతునికి చేతనులందరూ సమానమే. శరీర శరీరి సంబంధాన్ని వారు ప్రతి పాదించి నిరూపించారు. "పశుర్మనుష్యః పక్షీవా యేచ వైష్ణవ సంశ్రయాః! తేనైవ తే ప్రయాస్యంతి తద్విష్ణోః పరమం పదం!! అనేది శ్రీరామానుజ సంప్రదాయము. పశువయినా మానవుడయిన పక్షి అయినా ఏ జాతి వాడయినా విష్ణు సంబంధ ఆశ్రయాన్ని పొందితే విష్ణు పదమయిన పరమపదాన్ని మోక్షాన్ని పొందగలరు. అది ఆచార్య సమాశ్రయణ సంబంధము చేత భక్తిభావ శరణా గతితో మోక్షాన్ని పొంద గలరని పెద్దల మాట! అందుకే

"ఆనందము... మోక్షకందము...
రామానుజార్య సంబంధమూ!..."

# శిష్య వాత్సల్య నిధి అమృత జలధి

తత్వహిత పురుషార్థములు అనేవి ఉజ్జీవించాలని అనురక్తి గల వారికి ముఖ్యమైన విషయాలు. వీటిని మూలంగా చేసుకొని సంప్రదాయ అనుసరణము ఆచరణ ఆలోచనలు నిర్దేశించబడతాయి. అటువంటి అమూల్య సాంప్రదాయ సంపద మన పూర్వాచార్యుల నుండి పెద్దల నుండి పరంపరగా అందించబడుతున్నది. పూర్వం విద్యా విధానాల ద్వారా సంప్రదాయ విస్తరణ ప్రభావితమయ్యేది. ముఖ్యంగా శిష్య పరంపరల వలననే అధ్యయనము, జ్ఞాన వితరణము రెండు సమాంతరంగా సాగి సంప్రదాయ విస్తరణ జరిగింది. శిష్యులు అంటేనే ఆచార్యుల తేజస్సును ఇనుమడింప చేసేవారు. గురువుల గరిమను, వైభవాన్ని చాటి చెప్పేవారు. సదాచార్యుల శిష్యులు సదాచార సిరులు తరతరాల వరకు శాశ్వతంగా నిలిచేలా చేశారు. "శిష్యవాత్సల్య నిధి" అయిన శ్రీభగవద్రామానుజాచార్యులను ఎంతోమంది శిష్యులు కైంకర్య నిష్ఠతో సేవించారు. వేద వేదాంగాలను శాస్త్రాలను అభ్యసించడమే కాకుండా అనుష్ఠాన మార్గాలను నేర్చుకున్నారు. సిద్ధాంత ప్రచారంలో, సంప్రదాయ పరిరక్షణలో, ప్రబోధనలలో జగదాచార్యులంతటి ప్రసిద్ధత ను వారు కూడా పొందారు. "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా। ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః॥" సాష్టాంగ నమస్కారం చేసి, వినయంతో ప్రశ్నించి, శుశ్రూష చేసి, తత్త్వదర్శనులైన జ్ఞానుల వద్ద జ్ఞానాన్ని తెలుసుకోవాలి." అన్నట్లు వారంతా గురు శుశ్రూష చేసి ఆచార్య అనుగ్రహాన్ని పొందారు. శ్రీరామానుజాచార్యులు కూడా శిష్య పరంపరకు వాత్సల్య నిధిగా నిలిచి శాస్త్ర జ్ఞానం అనే అమృత జలధిని పంచారు. ఆ క్రమంలో సిద్ధాంత వాఙ్మయంతో పాటు సాంప్రదాయ ఆచరణలు కూడా విస్తరిల్లాయి.

వారు ఏర్పాటు చేసిన 74 పీఠాధిపతులుగా శిష్యులు ఆచార్య స్థానమందు జగదాచార్యులకు ప్రతినిధులుగా నిలిచారు "చక్రాంకితాః ప్రవేశితవ్యాః" అన్నట్లు శ్రియఃపతి సారూప్య, సామీప్య, సాయుజ్యములను పొంది పరమపదంలో ప్రవేశించాలంటే పంచసంస్కారములు పొందాలని శాస్త్ర వచనం. అటువంటి

పరంపరాగత విధానాన్ని శ్రీ రామానుజాచార్యులు ఏర్పాటు చేశారు. అందుకే వారు శిష్యాగ్రేసరుల చేత "యతిరాజేన నిబద్ధ నాయక శ్రీః మహతీ గురు పంక్తి హార యష్టిః" యతీంద్రులనే నాయకమణిచే కూర్చ బడినది గురుపరంపర అనే ముత్యాల హారం! అని శ్లాఘించబడ్డారు. యతి రాజులకుండే హృదయ మార్దవం, దివ్య సుందర స్వరూపం, వేద వేదాంగ శాస్త్ర పురాణ పాండిత్యం, ఆళ్వారాచార్యులపై గల భక్తి భావం ఎందరో శిష్యులను దగ్గర చేశాయి. భారతీయ సంస్కృతికి వేద ధర్మానికి మూలమైన గురు శిష్య సంబంధం అనే సంపద్యత జగదాచార్యుల చరిత్రలోనే మనం దర్శించవచ్చు. మచ్చుకగా ముగ్గురు మహానుభావుల మహితను మనం తెలుసుకుందాం!

వడగనంబి అను వారిని ఆంధ్ర పూర్ణులు అని కూడా అంటారు.వీరు పరమపదించినప్పుడు "వడగనంబి వారు తిరునాడుకు వేంచేశారు" అని అంటే అది తప్పుగా భావించారట! "ఆచార్య తిరువడికి వేంచేశారు" అని అనాలని ఆదేశించారట! అప్పటినుండే ఆచార్య తిరువడికి వేంచేశారు అనే మాట వాడుకలోకి వచ్చింది అని పెద్దలు ప్రవచిస్తారు. వడగనంబి వారు అంతటి గురుభక్తి కలవారు. వారికి భగవంతుని మీద కంటే ఆచార్యుల మీద భక్తి ఎక్కువ! మేల్కోట ప్రయాణంలో సాలగ్రామం అనే గ్రామాన్ని చేరుకున్న రామానుజాచార్యులు అక్కడి ప్రజలను ధర్మనిరతులను చేయదలచి ఆ ఊరు చెరువు నీటిని పవిత్రం చేశారట! ఆ విధంగా సాలగ్రామ నివాసి అయిన ఆంధ్ర పూర్ణులు జగదాచార్యులకు శిష్యులైనారు. వీరి గురుభక్తికి నిదర్శనంగా ఎన్నో వృత్తాంతాలు ప్రాచుర్యమైనాయి. భగవద్ దర్శనం కంటే ఆచార్యులకు చేసే క్షీర కైంకర్య సేవ గొప్పదని చెప్పారు. మంత్ర అనుష్ఠానానికి ముందుగా గురుపరంపర ప్రార్ధన ప్రాధాన్యాన్ని సూచించారు. తానారాధించు ఆచార్యుల పాదుకలను ఆరాధనా పెరుమాళ్ళ అర్చామూర్తిని సమంగా భావించారు. యతి రాజవైభవం అష్టోత్తర శతనామ స్తోత్రము రచించి ఆచార్య వైభవాన్ని ప్రకాశితం చేశారు. నిత్యం రామానుజాచార్యులకు భోజన కైంకర్య సేవను చేసి శేష ప్రసాదం స్వీకరించేవారు. సదా వాత్సల్య నిధి అయిన జగదాచార్యుల సన్నిధిలోనే నివాసం చేశారు.

భగవద్రామానుజాచార్యులకు ఆండాన్, ఆళ్వాన్ అనువారు ప్రధాన శిష్యులుఅని పెద్దలు చెప్తారు. ఆండాన్ అనగా మొదలియాండాన్ వీరిని దాశరథి అని కూడా అంటారు. గొప్ప గురుభక్తి గల వీరి స్పర్శతో సాలగ్రామం అనే గ్రామ చెరువు నీటిని జల పవిత్రంగావించారు. సన్యాసులు ధరించే త్రిదండానికి గల తెల్లని వస్త్రాన్ని జల పవిత్ర అంటారు. అందుకే మొదలియాండాన్లను రామానుజాచార్యులకు త్రిదండ సమానులుగా భావిస్తారు. రామానుజాచార్యుల గురువుగారగు పెరియనంబి గారి పుత్రిక తో ఆమె అత్తవారింటికి స్త్రీధనంగా జగదాచార్యుల ఆజ్ఞతో వెళ్లారు. జ్ఞానులు, నిరాడంబరులైన వారిని చూచి ఆమె అత్తవారింటి వారు పశ్చాత్తాపంతో తిరిగి పంపించారట! మొదలి ఆండాన్లు కూడా జగదాచార్యుల వాత్సల్యాన్ని అనుభవిస్తూ వారిని భక్తితో సేవించారు. వీరు జగదాచార్యులను గురించి రచించిన. ధాటీ పంచకం ఆచార్య నిష్ఠకు దర్పణం. యతిరాజుల వేద వేదాంత జ్ఞాన నిష్ఠకు నిరూపణం! వీరినే యతిరాజ పాదుక గా, శ్రీ వైష్ణవ దాసర్ గా కీర్తిస్తారు. ఆళ్వాన్లు అంటే కూరత్తాళ్వాన్ వీరిని కురేశులు శ్రీవత్సాంక మిశ్రులు అని కూడా అంటారు. వీరు సాటిలేని ఆచార్యనిష్ఠగలవారు.. ఎంబెరుమాన్, ఎంబెరుమానార్ (శ్రీరంగనాథులు, శ్రీ రామానుజాచార్యులు) లపైన భక్తితో జీవితాన్ని గడిపారు. సిద్ధాంత రక్షణలో నేత్రాలను త్యాగం చేశారు. ఆచార్యుల ఆజ్ఞను శిరసా వహించి రామానుజాచార్యులకు అనేక కార్యాలలో సహకరించారు. పంచస్తవాలు అను గొప్ప స్తోత్రాలను రచించారు. సాంప్రదాయ విస్తరణలో వారు చేసిన కృషి సాటి లేనిది. వీరు గొప్ప పాండిత్య ప్రకర్ష కలవారు. సంపదలు కలిగి యున్నను నిరాడంబరంగా జీవించారు. భగవంతుడే రామానుజాచార్యులకు శిష్యులుగా అనుభవాన్ని పొందదలచి కూరేశులుగా అవతరించారని పెద్దలు ప్రవచిస్తారు.

వీరిలాగే గోవింద భట్టర్లు, అరుళాలపెరుమానెంబెరుమానార్ మరియు అనేకమంది శిష్యులు వాత్సల్య నిధి అగు రామానుజాచార్యుల చేత ఉపదేశితులై ఆచార్యుల వలె తాము కూడా సాంప్రదాయ విస్తరణకు కృషి చేశారు. గురు శిష్య సంబంధానికే ఆదర్శభూతులు అయ్యారు.

# సామర్థ్యం నామ సార్థక్యం

భారతీయ సంస్కృతిలో నామ సంబోధనలో ఒక ప్రత్యేకత ఉంటుంది. నామ మాధురీ మహత్యాలను గురించి ఎన్నో విశేషాలు ఉన్నాయి. నామము అనగా స్వరూప స్వభావ గుణశీలాల భావాంతర్యంగా అక్షరరూపంలో కనిపించే ఒక శబ్దము. అది ఒక వ్యక్తి చేసే కార్యాలను తెలుపుటే కాక పరస్పర సంబంధ బాంధవ్యాలను కూడా తెలియజేస్తుంది.

షోడశ సంస్కారాలలో నామకరణ సంస్కారము ప్రథమము ప్రధానము. గొప్ప వారిని గౌరవిస్తూ ఇచ్చే బిరుదులు వారి సేవలను ప్రతిబింబిస్తాయి. అధికార పదవి నామాలు వారి కర్తవ్యాన్ని బాధ్యతను గుర్తు చేస్తాయి. భగవన్నామం అలౌకిక ఆనందాన్ని ప్రయోజనాన్ని కలిగిస్తుంది. "మంత్రా ధీనంతు దైవతం" అని వైదిక ధర్మాచరణల్లో అనుష్ఠానంలో భగవద్ నామాన్ని ఉద్దేశించిన మంత్రాలు భగవత్ శక్తినే ఉద్దీప్తం చేస్తాయి. ఆ నామ మంత్రాల కూర్పుతో చేసే ఆరాధనలు హెూమాదులు ఫలిస్తాయని విశ్వాసం.

నామస్మరణం నామ గుణానుభవం మోక్షదాయకం అని కూడా విశ్వాసం. పరంపరగా తాత తండ్రుల నామధేయాలను కూడా శుభప్రదంగా భావించి స్వీకరిస్తారు. పార్వతి అనగా పర్వతస్య అపత్యం స్త్రీ అని, సుమిత్రాయాః అపత్యం పుమాన్ సౌమిత్రి అని నామ శబ్ద వ్యుత్పత్తి వివరిస్తారు. జన్మ నక్షత్ర పూర్వక నామాహ్వాయం చేస్తారు. సంప్రదాయంలో పంచ సంస్కారాలు చక్రాంకిత ఉపదేశములు స్వీకరించేటప్పుడు నామ సంస్కారంగా ఆచార్య దాస నామాన్ని స్వీకరిస్తారు. మహనీయుల బిరుదులు స్తోత్రాలు వారి కృషిని లోకోపకారకృతిని తెలియజేస్తాయి.

సంక్షిప్తాక్షర రూపమైన నామంలో విశిష్టమైన విస్తార చరిత్ర వైభవమే తెలుస్తుంది. గుణానుభవం కలుగుతుంది. అటువంటి సామర్థ్యం కలిగి సార్థక్యం కలిగిన భగవద్రామానుజాచార్యుల నామ సార్థక్య సన్నివేశాలను తెలుసుకుంటే వారి స్వభావ ఔన్నత్యము చరిత్ర వైభవము కూడా తెలుస్తాయి.

జగదాచార్యుల దివ్య నామములు

ఇళైయాళ్వార్–తిరుమల నంబి

రామానుజులు –పెరియనంబి

యతిరాజులు – శ్రీకంచి వరదరాజ పెరుమాళ్

ఉడయవర్ – శ్రీరంగనాథ పెరుమాళ్

లక్ష్మణమునులు –తిరువరంగ పెరుమాళరయర్

ఎంబెరుమానార్ – తిరికోష్ఠియూర్ నంబి

కోయిల్ అణ్ణన్ – గోదాదేవి

తిరుప్పావై జీయర్ – పెరియ నంబి

భాష్యకారర్ – శారదాదేవి

భూత పురీషులు–ఆదికేశవ పెరుమాళ్

దేశికేంద్రులు – తిరుమల శ్రీనివాస పెరుమాళ్

తిరువల్లి క్కేణి దివ్యదేశము నందు కొలువైన పార్థసారథి స్వామి అనుగ్రహంతో శ్రీ పెరుంబుదూరు నందు కాంతిమతి కేశవసూరి దంపతులకు జగదాచార్యులు జన్మించారు. ఆనాటి ఆచారముననుసరించి 12 రోజుల శిశువునకు మేనమామ శ్రీశైల పూర్ణులు (తిరుమల నంబి) శంఖ చక్ర పూ ముద్రలు వేసి "ఇళై ఆళ్వార్"అని నామకరణం చేశారు. చిన్ననాడే బాల సూర్యుని వలె ప్రకాశించే భవిష్యదాచార్యులు తల్లికి ఆదిశేషుల వలె తండ్రికి పంచాయుధముల వలె కనిపించారట! అందుకే పెద్దలు "ఆదిశేషులా సేనానాథులా( విశ్వక్సేనులు) శ్రీపతియా" అని ప్రాజ్ఞులు వితర్కించారు అని కీర్తిస్తారు.

రామ అనుజులు అనగా బలరామ అనుజులు శ్రీకృష్ణ భగవానుడు జగద్గురువై తత్వహిత పురుషార్థములను బోధించిన శ్రీకృష్ణుని వలె జగదాచార్యులను కూడా ఆచార్యులుగా భావిస్తారు. శ్రీరామచంద్రుని అనుసరించిన లక్ష్మణుని వలె భగవత్ తత్వాన్ని లోకానికి అందించిన వీరిని లక్ష్మణ మునులు అని సంభావించారు.

ప్రత్యక్ష ఆచార్యులు కాకపోయినా యామున మునులు పరంపరగా లభించిన ఆచార్య మూర్తిని రామానుజాచార్యులుగా భావించి వారికి ఉపదేశ గురువులుగా పంచాచార్యులను ఏర్పాటు చేశారు. వారిలో మహా పూర్ణులు (పెరియనంబి)వద్ద

ఉపదేశం పొందారు. పరమ భక్తులైన కాంచీపూర్ణుల( తిరు కచ్చి నంబి) ద్వారా శ్రీ కంచి వరదరాజ స్వామి ఇచ్చిన ( వార్తా షట్కము) ఆరు ఆజ్ఞలను స్వీకరించారు. మూఢ విశ్వాసము గల భార్య ప్రవర్తనకు కలత చెందారు. సన్యాసం స్వీకరించి పెరియంబి వారిద్వారా "రామానుజ" నామాన్ని పొందారు. సన్యసించిన రామానుజాచార్యులను అర్చకముఖంగా ఛత్ర చామరాది గౌరవంగా ఆహ్వానించి శ్రీ కంచి దేవ పెరుమాళ్ "యతిరాజ" అను నామ ప్రదానం చేశారు.

యామునాచార్యుల ఆజ్ఞను అనుసరించి శ్రీ కంచి వరదరాజ స్వామి ముందు నమ్మాళ్వార్ల శ్రీ సూక్తులను గానం చేసి తన సంగీత ఆలాపనతో మెప్పించి శ్రీ వర రంగార్యులు( తిరువరంగ పెరుమాళరయర్ ) రామానుజాచార్యులను శ్రీరంగానికి ఆహ్వానించారు. శిష్యులుగా స్వీకరించి ఉపదేశించి వారి మేధాశక్తికి ఆశ్చర్యం పొంది వారి జ్ఞాన తృష్ణకు సంతోషించి లక్ష్మణ మునులని సంబోధించారు.

శ్రీ రామానుజాచార్యుల శ్రీరంగ ప్రవేశం ఆధ్యాత్మిక సంపన్నతకు నాంది అయింది. అనేక దివ్య దేశాల సముద్ధరణకు సిద్ధాంత వైభవానికి మూలమయింది. దివ్య ప్రబంధ ప్రకాశము, వ్యాస పరాశరుల నామ ప్రాశస్త్యము, శ్రీ భాష్య బ్రహ్మసూత్ర రచన అను యామునమునుల మూడు కోర్కెలను ఆజ్ఞలుగా స్వీకరించి జగదాచార్యులు పరిపూర్ణం చేశారు. ఆదిశేషాంశ సంభూతులైన కారణజన్ములైన రామానుజాచార్యులు శ్రీ రంగనాథ స్వామిని భక్తితో శరణాగతి చేశారు. అప్పుడే పెరియ పెరుమాళ్ ఉభయ విభూతుల (ఈ లోక పరలోక రక్షణ) అధికారమును ఇచ్చి అర్చక ముఖమున "ఉడయవర్" అని సంబోధించారని కథా వైభవం! తిరుమంత్ర ఉపదేశమును స్వీకరించుటకు పరితపించిన రామానుజాచార్యులు పెద్దల ఆజ్ఞచే తిరుక్కోష్ఠియూరు గోష్ఠీపూర్ణుల వద్దకు వెళ్లారు. ఆచార్యుల అనుగ్రహానికై 18 సార్లు వెళ్లి తిరుమంత్ర ఉపదేశాన్ని స్వీకరించారు. మంత్ర రాజము యొక్క మహత్యాన్ని గ్రహించి ఆ ప్రయోజనాన్ని సకల జనులు పొందాలని సంకల్పించి మంత్రార్థ మహత్తును అందరికీ వెల్లడించారు. అందుకు ముందుగా గోష్ఠిపూర్ణులు కోపించినా యతిరాజుల లోకోపకార బుద్ధికి ముగ్ధులై "ఎంబెరుమానారే" అని ఆలింగనం చేసుకున్నారట! ఎంబెరుమాన్ అంటే సాక్షాత్

రంగనాథస్వామి అని అర్థం. యజ్ఞమూర్తులను పండితులు మహానుభావులు సిద్ధాంత చర్చలో ముగ్ధులై శిష్యులుగా మారి యతి రాజుల పేరుగా అరుళాల పెరుమాళ్ ఎంబెరుమానార్ అని పేరు స్వీకరించారు.

పంచాచార్యులలో మరొకరు తిరుమాలై యాండాన్. వీరు భగవద్విషయాన్ని రామానుజాచార్యులకు బోధించారు. నమ్మాళ్వార్ల శఠగోప గీతి సారాన్ని తెలుసుకుంటూ తాను బోధించని తమ ఆచార్యులైన యామునమునుల అంతరంగ మందలి అర్థ వివరణను శ్రీ రామానుజాచార్యులు చెప్పగా విని నమ్మాళ్వార్ పై వారికి గల భక్తి భావానికి చకితులైనారట! ఆనందంతో "శఠగోపన్ పొన్నడి" అని సంబోధించారు. అంటే నమ్మాళ్వార్ల బంగారుపాద స్వరూపము యతి రాజులు.

భూతపురిలో జన్మించిన జగదాచార్యులు అక్కడ కొలువైన ఆదికేశవ పెరుమాళ్ళ ఆజ్ఞతో భూతపురీశులుగా ప్రసిద్ధులైనారు. సదా తిరుప్పావై దివ్య ప్రబంధ అనుసంధానం చేస్తూ భక్తితో పరవశించిన యతిరాజులను చూసి ఆనందంతో వారి ఆచార్యులైన మహా పూర్ణులు తిరుప్పావై జీయర్ అని సంబోధించారట!

నాచ్చియార్ తిరుమొళి లోని గోదాదేవి ప్రార్థన మొక్కును అనుసరించి 100 వెన్న భాండాలను చక్కెర పొంగలి ఘటాలను "తిరుమారిలుంషోలై" స్వామికి సమర్పించి గోదాగ్రజులుగా "కోయిల్అణ్ణన్"గా గోదా దేవి అనుగ్రహంతో అర్చకముఖంగా సంబోధింపబడ్డారు.

కాశ్మీరంలోని శారదా పీఠంలో ఉన్న బోధాయన గ్రంథాన్ని సంపాదించుటకు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. తిరిగి శ్రీభాష్య రచనానంతరం కాశ్మీరం చేరు కున్న రామానుజాచార్యులను ఆదరించి వారు రచించిన శ్రీభాష్యమును కరకమలముల ధరించి శ్రీభాష్యకారర్ అని దీవించిందట!

తిరుమల చరిత్రలో యతి రాజుల కృషి విశేషమైనది. వారు తిరుమల నంబి వద్ద రామాయణ రహస్యములను అధ్యయనం చేశారు. శ్రీనివాస పెరుమాళ్లను నారాయణ స్వరూపముగా శంఖ చక్ర ధారణము చేయించారు. లక్ష్మీదేవిని వక్షస్థల మందు స్థాపించారు ఆరాధనా విశేషాలను ఏర్పాటు చేశారు. తిరుమల దేవాలయంలో భాష్యకారుల సన్నిధిగా రామానుజాచార్యుల సన్నిధి కొంచెం

ఎత్తయిన ప్రదేశంలో ఉంటుంది. లక్ష్మీదేవిని ఏర్పాటు చేసి మామ గారి స్థానంగా, శంఖచక్రములను సమర్పించి ఆచార్య స్థానముగా దేశికేంద్రులుగా కీర్తించబడ్డారు. వారి కృషిని సత్కృతిని ప్రతిబింబించేలా ఎందరో శిష్యులు అనేక నామాలతో కీర్తించారు రామానుజ అను నాలుగు అక్షరములు గల నామమే లేకుంటే మన వంటి వారు సత్యాన్ని తెలిసి కొనలేక అజ్ఞానంలో ఉండేవారని పెద్దలు భావిస్తారు. గురుపరంపరా హారంలో శ్రీరామానుజాచార్యులే నాయక మణి అని పెద్దల అభిప్రాయము. శ్రీరామానుజ నామస్మరణము మోక్షదాయకము కనుకనే పెద్దలు పరస్పర పలకరింపులో రామానుజ దాసన్ అని పలికే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

# వార్షిక వ్యాస సమీక్ష

మానవజాతి ఉజ్జీవనానికి ఉపయోగపడే అనేక అంశాలను శ్రీభగవద్ రామానుజాచార్యులు ఉపదేశించారు. అటువంటి వేల సంవత్సరాల ప్రాచీన పరంపర గల గొప్ప సంప్రదాయంలో జన్మించిన మనందరం ఆ రామానుజ మార్గ చరిత్ర విశేషాలు తెలుసుకోవాలి. వారి ఉపదేశ శ్రీ సూక్తులు ఆధునిక సమాజానికి అనువర్తనీయం కావాలి. ఆ సంకల్పంతో అక్షరాత్మకమైన ప్రయత్నంగా "శ్రీరామనుజ సుధా మాధురి" అనే శీర్షికతో శ్రీ సన్నిధానం పత్రిక సాగుతున్నది. వార్షికోత్సవ సంచిక ద్వారా 12 వ్యాసముల సమీక్షలను, నేటి వరకు 8 వ్యాసముల సమీక్షలను మీ ముందు ఉంచుతున్నాము.

(జనవరి) విశేషప్రజ్ఞ కైంకర్యేచ్ఛ: భగవద్‌రామానుజాచార్యులు జ్ఞానవంతులైన పండితులను, భక్తి గల పామరులను, భావోద్వేగంగల సామాన్యులను, శరణాగతి మార్గంగా ప్రపత్తి చేయు ప్రపన్నులను, ఇలా అన్ని రకాల జనులకు భగవద్భక్తి మార్గాన్ని తెలియపరిచారు. వారి వారి అభినివేశానికి అనుగుణంగా పరివర్తనం గావించి తరింప చేశారు. అటువంటి జగదాచార్యుల విశేష ప్రజ్ఞను ప్రస్తావించిన వ్యాసము.

కలిమినిచ్చే కల్పతరువు: జగదాచార్యులు అనుగ్రహించిన రామానుజ మార్గము అందరిని ఉజ్జీవింప చేయునది. మరియు కల్పతరువు వంటిది అని వివరింప బడినది.

(ఫిబ్రవరి) వేనోళ్ల స్తుతించే వెయ్యేండ్ల పండుగ: భారతీయ సమాజం మొత్తాన్ని అభిముఖం, గావించిన చారిత్రక పవిత్ర ఘట్టం. దివ్య సాకేతం ముచ్చింతల్ హైదరాబాదు నగర మందు శ్రీరామానుజ సహస్రాబ్ది సమారోహం. శ్రీనివాస స్వరూపులైన శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారు మరియు అనేకమంది భక్తుల సేవకుల సుదీర్ఘ కృషితో వెలసిన జగదాచార్యుల విరాణ్మూర్తి విశేషాలను వెయ్యేండ్ల పండుగగా వివరించుకున్నాము. జగదాచార్యుల తిరుమేని వైభవాన్ని వివరించిన వ్యాసము.

(మార్చి) వసుధైకకుటుంబకం: భగవద్ రామానుజాచార్యులు ప్రతిపాదించిన

సిద్ధాంతం భగవత్ స్వరూప నిరూపణంలో ఉత్కృష్టమైనది, సమగ్రమైనది. శృతి స్మృతి పురాణ శాస్త్ర ఉభయ వేదాంత సారంగా సహేతుకంగా నిరూపించబడినది. వారు ప్రబోధించిన ఆచరణా విధానాలు సమత్వ స్ఫూర్తిని కలిగినవి. ఆధునికంగా భావించే వసుధైక కుటుంబ భావనను వారు ఆనాడే వెలువరించారు. అటువంటి సమాజ హిత భావనను, సహస్రాబ్ది ప్రతిష్ఠా విశేషాలను వివరించుకున్న వ్యాసం.

(ఏప్రిల్) ఉత్తారకం కృపా సముద్రం: ప్రతి మానవుడు కృతకృత్యుడు కావాలంటే భగవత్ తత్వాన్ని తెలుసుకోవాలి. అందుకు ఆచార్య సమాశ్రయణమే ప్రధానం. పంచ సంస్కారాలు పొంది రామానుజ మార్గాన్ని అనుసరిస్తూ ఆచార్య నిష్ఠ కలిగి ఉండాలి. ఉత్తారకత్వంతో దయాసముద్రుడైన శ్రీ రామానుజాచార్యులను కృపామాత్ర ప్రసన్నాచార్యులుగా పూర్వాచార్యులు సమన్వయం చేసిన విధాన్ని ఈ వ్యాసంలో స్మరించుకున్నాము.

(మే) సంఖ్యా సమన్వయం-యతిరాజ వైభవం: శ్రీరామానుజాచార్యుల తిరునక్షత్ర సందర్భంగా ప్రచురించిన వ్యాసం. సంప్రదాయ విషయాంశాల సంఖ్యలతో శ్రీరామానుజాచార్యుల జీవన వైభవానికి సిద్ధాంత విశేషాలకు సమన్వయాన్ని కూరుస్తూ జగదాచార్యుల గొప్పతనాన్ని వివరించే వ్యాసం. ఏక సంఖ్య మొదలుకొని దశ సంఖ్య వరకు అమూల్య విశేషాలతో సమర్థించి తెలిపిన వ్యాసం.

(జూన్) దర్శన భాగ్యం సౌభాగ్యం -సేవా ఫలం సాఫల్యం: భారతీయ సంస్కృతిలో ఆచార్యుల స్థానం గొప్పతనం తెలుపుట. భగవద్రామానుజాచార్యులలోని సంపూర్ణ ఆచార్య తత్వాన్ని వివరించుట. దివ్య దేశాలతో శిష్య పరంపరతో శ్రీరామానుజాచార్యుల సంబంధం గురు పరంపరలో ప్రత్యేక స్థానం ఇత్యాది విషయాలను స్మరించకునే వ్యాసం.

(జులై) బాలసూర్యుని భావ స్ఫూర్తి: ఎందరినో ప్రబోధనలతో తరింప చేసే జ్ఞాన ప్రకాశంలో భగవద్రామానుజాచార్యులను రామానుజ దివాకరః అని సూర్య భగవానునితో పెద్దలు పోలుస్తారు. విశిష్టమైన జ్ఞాన సంపద గల జగదాచార్యులు ఉదయించినది మొదలు గురుకులంలో తన ప్రతిభను వెలువరించిన భావ స్ఫూర్తిని ఈ వ్యాసంలో వివరించుకున్నాము.

(ఆగస్ట్) సహస్ర సంజీవిని: ఎందరో జనులకు శిష్యులకు పావనత్వాన్ని ప్రసాదించిన పరమదయాళువు జగదాచార్యులు వారి మహత్తు సమకాలీనులనే కాదు సృష్టి ఉన్నంతవరకు ప్రపత్తి చేసిన ప్రతి ఒక్కరిని ఉద్ధరిస్తుందనేది సత్యం! ఆచార అనుష్ఠాన భావనా లోపాలు అనే రుగ్మతలను సరిచేసిన సంజీవిని వంటి జగదాచార్యుల జీవిత విశేషాలను తెలిపే వ్యాసం.

(సెప్టెంబర్) దర్శనం నిదర్శనం: 120 సంవత్సరాలు సమకాలీనులకు దర్శన భాగ్యాన్ని ప్రసాదించి వేల సంవత్సరాలు అనుసరించదగు శ్రీరామానుజదర్శనాన్ని ప్రసాదించారు. ఉపదేశ వాఙ్మయాన్ని అందించారు. జగదాచార్యుల దివ్యమంగళ స్వరూపం మరియు సిద్ధాంత దర్శనం గొప్పతనం గురించి వివరించే వ్యాసం.

(అక్టోబర్) సంబంధం బంధమోచనం: మణి మంటప మార్గదాయిగా స్తుతించబడు భగవద్రామానుజాచార్య సంబంధం భగవత్ సంబంధాన్ని మనకు తెలియజేస్తుంది. సంసార బంధమోచనాన్ని కలిగించి దుఃఖాన్ని తొలగిస్తుంది. ఆచార్య సంబంధాన్ని జగదాచార్యుల కథా వైభవంతో ఈ వ్యాసం తెలియజేస్తుంది.

(నవంబర్) పావనపాదం-ప్రయాణవిజయం: భగవద్రామానుజాచార్యుల జీవనప్రయాణంలో వారు ఎదుర్కొన్న ఒడిదుడుకులు భగవద్ తత్వ దర్శనం, అందరినీ ఉద్ధరించిన విధాన్ని స్మరించుకోవడం ఈ వ్యాసాంశం. శ్రీపెరంబుదూరు లో ఉద్భవించినది మొదలుకొని శ్రీ కంచి శ్రీరంగం మేలుకోట అనేక దివ్య దేశ ప్రయాణాలు ఈ వ్యాసంలో ప్రస్తావించబడ్డాయి.

(డిసెంబర్) వాత్సల్యం వరదాయకం: అమృతోపమానమైన జగదాచార్య వాత్సల్యం ఏ విధంగా వరదాయకం అయిందో స్మరించుకోవడం వ్యాసాంశం. యతి రాజులు వరవరమునులుగా మళ్లీ అవతరించి వరదాయకులు అయిన విశేషాలను వివరించే వ్యాసం.

(జనవరి) భక్తి భావ ప్రీతి దివ్య ప్రబంధ ఖ్యాతి: ఆళ్వారుల భక్తి, శరణాగతి, ప్రపత్తి తత్వాలను ప్రకాశింప చేసేది రామానుజ సంప్రదాయం. ఉభయ వేదాంత సారంగా ఉద్భవించినది రామానుజ మార్గం. జగదాచార్యులకు దివ్య ప్రబంధాలపై గల ప్రీతిని వారు విస్తరింప చేసిన ఖ్యాతిని వివరించే వ్యాసం.

(ఫిబ్రవరి) వార్షిక వ్యాస సమీక్షలు

(మార్చి) శరీర శుద్ధి కంటే జ్ఞాన సిద్ధి : భగవంతుడు అంటే ఎవరు అట్టి భగవంతుని పొందే మార్గం ఏమిటి అనే సత్యాన్ని నిరూపిస్తూ భగవద్రామానుజాచార్యులు చేసిన రచనలను ప్రస్తావిస్తూ ధనుర్దాసు వృత్తాంతము, మార్నేరి నంబిని గురించి ఇందులో వివరించబడినది. భగవత్ ప్రాప్తికి శరీర శుద్ధి కంటే జ్ఞాన సిద్ధి ప్రధానతను తెలిపే సన్నివేశాలను గురించి తెలిపబడినది.

(ఏప్రిల్) విరోధి పరిహరణ: లక్ష్య సాధనకు తద్విరోధములు పరిహరించడం ఎంత ముఖ్యమో వివరిస్తూ, జగదాచార్యుల జీవనగమనంలో ఎదుర్కొన్న అడ్డంకులను ఎదురైన ప్రమాదములను గురించి తెలిపే సన్నివేశములు విరోధి పరిహరణ అను వ్యాసమందు వివరింపబడినవి.

(మే) ఆనందము మోక్షదాయకము: రామానుజ మార్గము ఆనందము మోక్షదాయకము అను పెద్దల శ్రీ సూక్తిని అనుసరించి జగదాచార్యులతో గల ఆచార్య సంబంధము భగవత్ప్రాప్తికి మూలము. దివ్య దేశాలతో జగదాచార్యులకు గల సంబంధాన్ని వివరించి శ్రీ కూరేశుల నేత్ర ప్రాప్తి వృత్తాంతం ఆనందము మోక్షకందము అను వ్యాసమందు వివరించబడినది.

(జూన్) శిష్యవాత్సల్య నిధి: అను వ్యాసమందు భారతీయ సంస్కృతిలో గురు శిష్య సంబంధ విశేషాలను తెలుపుతూ అమృత జలధి వంటి జగదాచార్యుల వాత్సల్యం ప్రతిబింబించే సన్నివేశాలు, ఆండాన్, ఆళ్వాన్, వడగనంబిల వృత్తాంతాలు ఇందులో వివరించబడ్డాయి.

(జూలై) సామర్థ్యం నామ సార్థక్యం: అను వ్యాసమందు జగదాచార్యుల విశేష సామర్థ్యాన్ని వివరిస్తూ వారి నామ ప్రాప్తి కారణాలు, నామ వైభవం గురించి వివరించబడింది.

శ్రీభగవద్రామానుజాచార్యుల జీవిత కథాంశాలతో రామానుజ మార్గ గొప్పతనాన్ని వివరిస్తూ శ్రీసన్నిధానం పత్రిక అనేక విశేషాలను పాఠకులకు అందిస్తున్నది.

శ్రీరామానుజార్య దివ్యాజ్ఞా వర్ధతాం ! అభివర్ధతాం !!

# శ్రీసన్నిధానం చారిటబుల్ ట్రస్ట్

# శ్రీసన్నిధానం

## గ్రంథమాల

గ్రంథ ముద్రణకు సహకరించినవారు శ్రీమన్ తులసి వంశీ కృష్ణ దీపిక (UK )